www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 9-2-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) :312 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 7.25 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఆర్ద్ర సా. 5.53 తదుపరి పునర్వసు; వర్జ్యం: తె.5.57 మొదలు; దుర్ముహూర్తం: సా.4.39-5.25; అమృతఘడియలు: ఉ.7.58-9.33; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.10 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చీపురునే ఊడ్చేసింది



ఇది చరిత్రాత్మక విజయం. ఆప్ నుంచి ఢిల్లీకి విముక్తి లభించింది. దశాబ్దం పాటు తమను అహంకారంతో పాలించిన ఆ పార్టీని ఢిల్లీ రాజకీయాల నుంచి ప్రజలు తరిమికొట్టారు. వారు పాలనను మాత్రమే కోరుకుంటున్నారు, నాటకాలను కాదు. ప్రజలు మాపై చూపించిన ప్రేమకు అనేక రెట్లు అభివృద్ధి రూపంలో తిరిగి అందిస్తాం. విధానసభ తొలి సమావేశాల్లో కాగ్ నివేదికను ప్రవేశపెడతాం.

- ప్రధాని నరేంద్ర మోదీ



ప్రజాతీర్పును అంగీకరిస్తున్నాం. మా పార్టీ ఎల్లప్పుడూ ఢిల్లీ సంక్షేమం కోసమే పనిచేసింది. ఇకపై ప్రతిపక్షంగా కీలక పాత్ర పోషిస్తాం. ఢిల్లీ ప్రజలకు అందుబాటులో ఉంటాం. మేం అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదు. సేవచేసేందుకే వచ్చాం. ఢిల్లీ ప్రజలు బీజేపీపై పెట్టుకున్న నమ్మకం నెరవేరాలని కోరుకుంటున్నా.

- అరవింద్ కేజ్రీవాల్




ఢిల్లీలో ఆప్‌ను మట్టి కరిపించిన బీజేపీ

- 26 ఏళ్ల తర్వాత మళ్లీ అధికార పీఠంపైకి
- 8 సీట్ల నుంచి ఏకంగా 48 సీట్లలో గెలుపు
- 22 సీట్లకే పరిమితమైన ఆమ్ ఆద్మీ పార్టీ
- కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సైతం ఓటమి
- 'సున్నా'తో హ్యాట్రిక్ సాధించిన కాంగ్రెస్
- కమలాన్ని గెలిపించిన పీఆర్సీ, ఐటీ, జాట్లు
- కమల వికాసంలో కాంగ్రెస్ కీలక పాత్ర
- ఆ పార్టీ చీల్చిన ఓట్లతో 14 సీట్లలో విజయం
- **ముఖ్యమంత్రిగా పర్వేశ్ వర్మ?** రేసులో బిధూరీ, మనోజ్, స్మృతి ఇరానీ
- ఫలించిన మోదీ, షా వ్యూహాలు
- **ఆప్‌ను ముంచిన మద్యం స్కాం**
- ఇండియా కూటమి భవిష్యత్తు ఏమిటి?


ప్రత్యేక కథనాలు 11, 12, 13వ పేజీల్లో..

వాడిన కమలం వికసించింది! ఓడిన చీపురు మూలకెళ్లింది! హస్తం ఎప్పట్లా రిక్తహస్తమైంది! దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అపూర్వ విజయం సాధించింది! ఆమ్ ఆద్మీ పార్టీని మట్టి కరిపించి దాదాపు 26 ఏళ్ల తర్వాత అధికార పీఠాన్ని మరోసారి దక్కించుకుంది! ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లే ఢిల్లీలోనూ డబుల్ ఇంజన్ సర్కారును ఏర్పాటు చేయనుంది! మోదీ దెబ్బకు ఆప్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవిండ్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సైతం ఓటమి పాలుకావడం ఈ ఎన్నికల విశేషం! గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 సీట్లకే పరిమితమైన బీజేపీ ఈసారి ఏకంగా 48 సీట్లను సాధిస్తే.. 62 స్థానాలతో అధికార పార్టీగా కొనసాగుతున్న ఆప్.. 22 సీట్లకే పరిమితమైంది! అంటే.. ఆప్ అధికారంలో ఉన్న 40 సీట్లలో ఈసారి బీజేపీ పాగా వేసింది! గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బోణీ కొట్టని కాంగ్రెస్ వరుసగా మూడోసారీ జీరోగా మిగిలింది! 70 సీట్ల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల ఐదో తేదీన

మిగతా 11వ పేజీలో...



ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు



తెలంగాణ బీసీల్లో ముదిరాజ్‌లే టాప్!

- జనాభా పరంగా అగ్రస్థానం
- తర్వాతి స్థానాల్లో యాదవ, గౌడ, మున్నూరు కాపు, పద్మశాలీలు
- కులగణన నివేదిక తేల్చిన లెక్క!
- అగ్రకులాల్లో రెడ్లదే అగ్ర తాంబూలం

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బీసీ జనాభాలో ముదిరాజ్‌లు సంఖ్యాపరంగా అగ్రస్థానంలో ఉన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో ముస్లిమేతర బీసీ జనాభా 46.25 శాతం ఉన్నట్టు ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో తేలింది. ఇందులో 24.9శాతం మంది అంటే సగానికి పైగా జనాభా ఐదు సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. ఆ ఐదింటిలో ముదిరాజ్ వర్గానికి చెందిన వారు సంఖ్యాపరంగా అగ్రస్థానంలో ఉండగా యాదవ, గౌడ, మున్నూరు కాపు, పద్మశాలీ సామాజిక వర్గాల వారు తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ ఐదు సామాజిక వర్గాల జనాభా రాష్ట్ర జనాభాలో 24.9 శాతం మేర ఉన్నట్టు సమాచారం. ఈ లెక్క ప్రకారం ముస్లిమేతర బీసీల్లో ఈ ఐదు సామాజిక వర్గాలను మినహాయిస్తే బీసీ జనాభా 21.35 శాతమే. 2014లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలతో పోలిస్తే ఈ ఐదు సామాజిక వర్గాల జనాభా 2 శాతానికి పైగా పెరిగినట్లు కులగణన సర్వేలో తేలినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఐదు సామాజిక వర్గాల జనాభా సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో 22.5 శాతంగా ఉంటే.. పదేళ్ల తర్వాత జరిగిన కులగణన సర్వే ప్రకారం 24.9 శాతంగా నమోదైంది. అంటే పదేళ్లలో ఈ ఐదు సమాజిక వర్గాల జనాభా 2.4 శాతం పెరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కులగణన సర్వే ఆధారంగా ఈ ఐదు సామాజిక వర్గాల జనాభా వివరాలు ఇవి.


రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌లది 7.3%

కులగణన సర్వేలో ముదిరాజ్‌లు, ముతరాసీలు, తెనుగోళ్లను ఒక కేటగిరీలో లెక్కించారు. దీంతో వీరి సంఖ్య 26.36 లక్షలుగా తేలింది. ఇది రాష్ట్ర జనాభాలో 7.43 శాతం. యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు 20.17 లక్షల మంది ఉండగా జనాభాలో వీరి వాటా 5.69%. గౌడ సామాజిక వర్గం(ఈడిగ, గౌడ, కలలి, గౌండ, శ్రీసయన) జనాభా 16.27 లక్షలు కాగా జనాభాలో వీరు 4.59 శాతంగా ఉన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం జనాభా 13.71 లక్షల మంది కాగా.. రాష్ట్ర జనాభాలో వీరు 3.87 శాతంగా ఉన్నారు. ఇక పద్మశాలీలు(సాలి, శాలివాన్, పట్టుశాలి, సేనాపతులు, తొగుటశాలీ) 11.79 లక్షల మంది ఉంటే రాష్ట్ర జనాభాలో వీరు 3.32 శాతంగా ఉన్నారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌లు 6 శాతం, యాదవులు 5.4, గౌడలు 4.3, మున్నూరు కాపులు 3.5, పద్మశాలీలు 3.3 శాతం మంది ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

రెడ్లు 17.06 లక్షల మంది

రాష్ట్రంలో రాజకీయంగా అత్యంత ప్రభావం చూపుతున్న రెడ్డి సామాజిక వర్గం జనాభా 17.06 లక్షలుగా ఉంది. రాష్ట్ర జనాభాలో వీరు 4.81 శాతంగా ఉన్నారు. 2014 సర్వేతో పోలిస్తే రెడ్డి సామాజిక వర్గం జనాభా 0.5 శాతం మేర పెరిగింది. ముస్లిమేతర అగ్రకులాల జనాభా 13.31 శాతంగా ఉంటే.. రెడ్డి సామాజిక వర్గాన్ని మినహాయించి.. బ్రాహ్మణ, కమ్మ, వెలమ, కోమటి తదితర అగ్రకులాలన్నీ కలిపి 8.50 శాతంగా ఉన్నాయి.

లోకం తీరు



ఫోర్బ్స్ 30 అండర్ 30 జాబితాలో 'భాంజు' నీలకంఠ భాను

- సహ వ్యవస్థాపకులకూ చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫోర్బ్స్ ఇండియా ఈ ఏడాదికి గాను విడుదల చేసిన 30 అండర్ 30 జాబితాలో హైదరాబాద్‌కు చెందిన గణిత బోధన వేదిక భాంజు వ్యవస్థాపకుడు, సీఈఓ నీలకంఠ భానుతో పాటు సంస్థ సహ వ్యవస్థాపకులు దేవులపల్లి లక్ష్మీ ప్రచేతన్, అల్లూరు ఉదయ్ కిరణ్, జొన్నలగడ్డ సాయి కృష్ణకాంత్‌కు చోటు దక్కింది. విద్యారంగ విభాగం నుంచి వీరికి ఈ జాబితాలో స్థానం లభించింది. చిన్నపిల్లల్లో గణితంపై భయాన్ని తొలగించే లక్ష్యంతో 2020లో భాంజు పేరుతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారీ నలుగురు. నీలకంఠ భానుకు ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన మానవ క్యాలికులేటర్‌గా పేరుంది. ఫోర్బ్స్ జాబితాలో నీలకంఠ భానుకు గుర్తింపు లభించడం ఇది రెండోసారి. 2022 సంవత్సరానికి గాను విడుదల చేసిన ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా లిస్టులోనూ భానుకు స్థానం దక్కింది.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

30 నెలల్లో మీరాలం వంతెన

- హైదరాబాద్‌కే తలమానికంగా ఉండాలి
- చిన్నారుల కోసం వంతెన పరిసరాలను ఆహ్లాదంగా రూపొందించండి
- పురపాలకశాఖ అధికారుల సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మీరాలం చెరువుపై నిర్మించనున్న వంతెన హైదరాబాద్ నగరానికే తలమానికంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పురపాలకశాఖ అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు సంబంధించిన పనులపై పురపాలకశాఖ ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో శనివారం సీఎం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మీరాలం చెరువు వద్ద నిర్మించే వంతెనకు సంబంధించి డీపీఆర్‌ను 90 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. 30 నెలల్లో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, హైదరాబాద్‌లో అత్యంత ప్రముఖ ప్రాంతంగా మీరాలం వంతెనను తీర్చిదిద్దాలని సూచించారు. చిన్న పిల్లలను దృష్టిలో ఉంచుకుని వంతెన పరిసరాలను ఆహ్లాదంగా రూపొందించాలని ఆదేశించారు. 2.425 కి.మీ వంతెన నిర్మాణం కోసం మూడు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా నిర్మిస్తున్న వంతెనల మీద లోతుగా అధ్యయనం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశించారు. రహదారుల విస్తరణపై పలు సూచనలు చేశారు. రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలతో రావాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్‌కు సీఎం ఘన నివాళులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతించారు. శనివారం ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, మల్లు రవి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటం ఫలించింది

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

నల్లగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీతో న్యాయం జరిగిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొండేటి మల్లయ్య పేర్కొన్నారు. నల్లగొండలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను నిలబెట్టుకున్నారన్నారు. వర్గీకరణపై నలుగురు మంత్రులతో కమిటీ, హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్‌తో ఏకసభ్య కమిషన్ వేశారని, కమిషన్ నివేదిక ఇచ్చిన వెంటనే ఈనెల 4న ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి మాదిగలకు న్యాయం చేశారని చెప్పారు. దేశంలోనే తెలంగాణలో మొట్టమొదటగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, మంత్రి దామోదర రాజనర్సింహకు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు విద్యఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

మాంగ్‌లను గ్రూప్-బీలో చేర్చాలి

- వర్గీకరణ లోపాలను సవరించాలి: మందకృష్ణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వృత్తిపరంగా మాంగ్, మాదిగలు ఒక్కటైనప్పటికీ.. మాంగ్‌లను వేరే గ్రూప్‌లో ఎందుకు వేశారని మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. మాంగ్‌లను గ్రూప్ బీలో చేర్చాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాంగ్ కులస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్ట రూపం దాల్చేలోపు నివేదికలోని లోపాలను సవరించాలని సీఎం, మంత్రులకు లిఖితపూర్వకంగా నివేదిక అందజేస్తామని తెలిపారు.

హైదరాబాద్.. వైద్య రాజధాని!

చికిత్స కోసం నగరానికి ఏటా వేలాది మంది విదేశీయులు.. అత్యంత క్లిష్టమైన వైద్య సమస్యలకూ పరిష్కారం

- నగరంలో నిష్ణాతులైన వైద్యులు, సాంకేతిక సదుపాయాలు
- విదేశాలతో పోల్చుకుంటే ఖర్చు తక్కువ..సక్సెస్ రేటు ఎక్కువ
- కీళ్ల మార్పిడి, వెన్నెముక ఆపరేషన్లకు ఎక్కువ మంది రాక
- కఠినమైన వీసా నిబంధనలతో కొంతమంది చికిత్సకు దూరం
- వీసా రూల్స్‌ను సులభతరం చేయాలంటున్న ఆస్పత్రులు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి హైదరాబాద్ వైద్య రాజధానిగా మారుతోంది. ఏటా వేలాది మంది విదేశీయులు హైదారాబాద్‌కు వచ్చి చికిత్సలు పొందుతున్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో ఉన్న వైద్య నిపుణులు ఎంతో కఠినమైన, సున్నితమైన శస్త్ర చికిత్సలు చేసి వారికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ఒకప్పుడు దేశంలో ప్రముఖులు ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్య వస్తే అమెరికా, ఐరోపా దేశాలకు వెళ్లేవారు. అలాంటిది అక్కడి వారే మొండిరోగాలకు చికిత్స కోసం హైదరాబాద్ వస్తున్నారంటే వైద్యపరంగా నగరం ఎంత ప్రముఖ స్థానం సంపాదించిందో అర్థం చేసుకోవచ్చు. నగరంలోని వైద్య సదుపాయాలు, స్పెషలిస్టు వైద్యులు, అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో ఉండటం, అక్కడితో పోలిస్తే చికిత్సకు తక్కువ వ్యయం కావడం విదేశీయులను ఆకర్షిస్తున్నాయి. అయితే విదేశీ రోగులు హైదరాబాద్‌లో చికిత్స పొందడానికి వీసా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆస్పత్రుల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. వీసా నిబంధనలను సడలించి సులభతరం చేస్తే విదేశాల నుంచి వచ్చే రోగుల సంఖ్య ఇంకా పెరుగుతుందని అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం 'హీల్ ఇన్ ఇండియా' పేరిట మెడికల్ ఈ-వీసాలను ప్రారంభించింది. విదేశీయులు ఎక్కువగా వెన్నెముక శస్త్రచికిత్స, కీళ్ల మార్పిడి, గుండె, ఎముక, కంటి, న్యూరో, మూత్రపిండాలు, కాలేయ మార్పిడి చికిత్సల కోసం వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ శస్త్ర చికిత్సల కోసం విదేశాల్లో కనీసం ఆరు నెలల పాటు వెయిటింగ్ లిస్టు ఉంటుందని తెలిపారు. మరోవైపు కార్పొరేట్ ఆస్పత్రులు కూడా విదేశీ రోగుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఆస్పత్రిలో ఇంటర్నేషనల్ పేషంట్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాయి.

ఒక్కో ఆస్పత్రిలో కనీసం 2వేల మంది

విదేశాల్లో వెన్నెముకకు శస్త్ర చికిత్స చేసుకుంటే ఎంత లేదన్న రూ.40 లక్షలు అవుతుంది. హైదరాబాద్‌లో కేవలం రూ.2లక్షలతో పూర్తి చేయగలమని వైద్యులు తెలిపారు. కీళ్ల మార్పిడికి విదేశాల్లో రూ.15లక్షలు ఖర్చు అవుతుంటే ఇక్కడ లక్షన్నర నుంచి రెండు లక్షలకు మించి ఉండదన్నారు. విదేశాల్లో బైపాస్ సర్జరీకి రూ.15లక్షలకు మించి వ్యయం అవుతుందని, ఇక్కడైతే రెండు నుంచి నాలుగు లక్షల రూపాయల్లో పూర్తవుతుందని వైద్యులు తెలిపారు. మరోవైపు, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సల్లో సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటోందని చెప్పారు. "క్లిష్టమైన వ్యాధులకు హైదరాబాద్‌లో చికిత్సలు చేసి నయం చేసిన కేసులు అనేకం ఉన్నాయి. ఇక్కడి వైద్యులు రోగులతో ఎక్కువ సమయం గడుపుతారు. దీని వల్ల రోగుల్లో ఒక నమ్మకం ఏర్పడుతుంది" అని వివరించారు. ఉగాండా, నైజీరియా, టాంజానియా, మొజాంబిక్, కెన్యా, దుబాయ్, సౌదీ అరేబియా, శ్రీలంక, బంగ్లాదేశ్ మాల్దీవుల నుంచి ఎక్కువ మంది హైదరాబాద్‌కు చికిత్స కోసం వస్తున్నారు. కార్పొరేట్, సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రుల్లో విదేశీ రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. ఒక్కొక్క కార్పొరేట్ ఆస్పత్రిలో ఏడాదిలో కనీసం 2వేల మంది విదేశీ రోగులు అడ్మిట్ అవుతున్నట్లు అంచనా.

అన్ని ఎంబసీల్లో ఒకే తరహా రూల్స్ ఉండాలి



విదేశాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగుల విషయంలో భారతప్రభుత్వం అన్ని దేశాల్లోని రాయబార కార్యాలయాల్లో ఒకే తరహా నిబంధనలు అమలు చేయాలి. అలా చేయడం వల్ల వీసాలు సులభంగా దొరికి, వైద్యం కోసం భారత్‌కు వచ్చేవారి సంఖ్య ఇంకా పెరుగుతుంది. దీని వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. కొన్ని దేశాల నుంచి హైదరాబాద్‌కు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడం వల్ల కూడా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- పీ హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మెడికవర్ హాస్పిటల్స్ గ్రూప్

వీసాలకు ఇబ్బందులున్నాయి



విదేశాల నుంచి వచ్చే రోగులకు వీసా ఇబ్బందులున్నాయి. జబ్బు పేరుతో నకిలీ రోగులు విదేశాల నుంచి వస్తున్నారని, దీనివల్ల భద్రతాపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్‌కు వచ్చిన రోగుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వారి వివరాలను సేకరించి వారి వివరాలను ఫారెన్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు(ఎఫ్ఆర్ఆర్ఓ)కు పంపిస్తున్నాం. రోగుల వివరాలను ప్రతి వారం అందించడానికి సిద్ధంగా ఉన్నాం. వీసా నిబంధనలు విషయంలో ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులను కలిసే ఆలోచన ఉంది.

- భాస్కర్‌రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, స్టార్ ఆస్పత్రి



హైదరాబాద్ సీతాఫల్‌మండిలోని ఓ మీసేవ కేంద్రం

రేషన్ కార్డుల దరఖాస్తులు బంద్

- శనివారం అర్జీల కోసం జనం పడిగాపులు

హైదరాబాద్/సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ప్రభుత్వం బంద్ చేసింది. కొత్త రేషన్ కార్డులతోపాటు ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను జత చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రభుత్వ ప్రకటన వెలువడిన వెంటనే సాయంత్రం నుంచి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని ప్రసార మాధ్యమాల్లో చూసిన ప్రజలు శుక్రవారం సాయంత్రం నుంచి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తుండటంతో అనేక కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు నమోదు ప్రక్రియ కొనసాగింది. అయితే అకస్మాత్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శుక్రవారం అర్ధరాత్రి మీసేవ నుంచి వెబ్ లింక్‌ను తొలగించారు. ఒకేసారి అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో సర్వర్‌పై భారం పడి ఉండొచ్చని, శనివారం నుంచి వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందని ప్రజలు భావించారు. అయితే శనివారం దరఖాస్తుల ప్రక్రియ పునరుద్ధరణ కాలేదు. శాసనసమండలి ఎన్నికల ప్రవర్తన నియామావళి అమల్లో ఉన్నందున ఈ ప్రక్రియను నిలిపివేశారంటూ వార్తలు వెలువడ్డాయి. అయితే దీనిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఖండించింది. రేషన్ కార్డుల దరఖాస్తుల గురించి పౌరసరఫరాల శాఖ గానీ, మీసేవ గానీ తమను సంప్రదించలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు దరఖాస్తుల కోసం శనివారం రోజంతా ప్రజలు మీ సేవ కేంద్రాల వద్ద నిరీక్షించారు.

కులగణనతో బీసీలకు సామాజిక న్యాయం

- బీసీ కమిషన్, సంఘాల ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీల సాధికారితపై వారి సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ



హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కులగణన ద్వారా బీసీలకు సామాజిక న్యాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీ కమిషన్, బీసీ సంఘాల ప్రతినిధులు, బీసీ మేధావులతో ప్రభుత్వ సలహాదారు కేశవరావుతో కలిసి శనివారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన కులగణన సర్వేపై కొన్ని ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు లేవనెత్తి సర్వేను తప్పుపడుతున్నందున వాస్తవ పరిస్థితి వివరించేందుకే ఈ సమావేశమని తెలిపారు. అనంతరం బీసీ సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సర్వే పూర్తిగా జరగలేదంటూ వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో కులగణనను అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు విమర్శలు చేస్తున్నాయని పొన్నం పేర్కొన్నారు. కాగా, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశానికి చట్టబద్ధత కల్పించాలని, తమిళనాడు తరహా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా మంత్రిని కోరారు. అలాగే, కులగణనలో జరిగిన పొరపాట్లను సరిచేసేందుకు, మిగిలిన సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా కంటే తక్కువ జనాభా లెక్కలపై పరిశీలించి రీ-సర్వే చేయాలని కోరారు. బీసీల జనాభా తగ్గించిన పక్షంలో రిజర్వేషన్లపై ప్రభావం ఉంటుందని, అస్పష్టతతో స్థానిక ఎన్నికలకు వెళితే బీసీల రిజర్వేషన్లకు విఘాతం కలిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం.. బీసీ డిక్లరేషన్ అమలు, కులగణన అంశంలో బీసీ సంఘాల ప్రతినిధులు చేసిన సూచనలు, ప్రతిపాదనలు, లేవనెత్తిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి.. వాటిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జస్టిస్ షమీమ్ కమిషన్ నివేదిక తప్పుల తడక

- 4 నుంచి 14 వరకు నిరసనలు
- 15న సదస్సుల నిర్వహణ
- త్వరలో లక్షలాది మందితో భారీ సభ
- మాల సంక్షేమ సంఘం, సమతా సైనిక్ దళ్, మాల సంఘాల జేఏసీల ప్రకటన



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక తప్పుల తడకని, మూడు గ్రూపులుగా వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని మాల సంక్షేమ సంఘం, సమతా సైనిక్ దళ్, మాల సంఘాల జేఏసీ ప్రతినిధులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై రేవంత్ రెడ్డి పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమతా సైనిక్‌దళ్ నేత మార్షల్ దిగంబర్ కాంబ్లే, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, వివిధ సంఘాల నేతలు.. జస్టిస్ షమీమ్ కమిషన్ నివేదిక ప్రతులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ ఈ నెల 4న సామాజిక న్యాయ దినం పేరుతో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, కులగణన నివేదికలు ఏకపక్షంగా ఆమోదించి గొప్పలు చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. ఆ రోజును చీకటి రోజుగా, సామాజిక న్యాయ విద్రోహ దినంగా నిర్వహించుకోవాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. ఈనెల 4 నుంచి 14 వరకు జస్టిస్ షమీమ్ కమిషన్ నివేదికను తగలబెడుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, 15న సామాజిక న్యాయ విద్రోహ దినం పేరిట సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే లక్షలాది మంది మాలలతో బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో నేతలు భావనా సాహెబ్, రావుల అంజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సలేశ్వర క్షేత్ర దర్శనం.. ఇక నవ మాసాలు !

- లింగమయ్య దర్శనానికి అటవీశాఖ సన్నాహాలు
- ససేమిరా అంటున్న ఆదివాసీ సంఘాల నేతలు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దట్టమైన నల్లమల అడవుల్లో కొలువై ఉన్న సలేశ్వరం లింగమయ్యను ఏడాదిలో తొమ్మిది నెలల పాటు భక్తులు దర్శించుకునేలా అటవీ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. ఈ సమయంలో భక్తుల నుంచి వచ్చే ఆదాయంలో 30 శాతం అక్కడున్న చెంచులకు ఇస్తామని అటవీ శాఖ చెబుతుండగా, చెంచు సంఘాలు ఆమోదించడం లేదు. చైత్ర పౌర్ణమి నాడు సలేశ్వరం ఉత్సవాలు ప్రారంభం కావాలనేది ఆదివాసుల అభిమతమని, అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిని వ్యతిరేకిస్తామని ఆదివాసీ సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు 2,611 చదరపు కి.మీ. విస్తరించి ఉంది. ప్రతీ ఏటా చైత్ర పౌర్ణమి నాడు పరహాబాద్‌కు 19 కి.మీ. దూరాన ఉన్న సలేశ్వరం లింగమయ్యను దర్శించుకోవడానికి లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తారు. ఈ సమయంలో కొన్నిసార్లు తొక్కిసలాట జరిగి భక్తులు మృతి చెందిన, గాయపడిన ఘటనలు అనేకం జరిగాయి. 1990 దశకం వరకు సలేశ్వరాన్ని దర్శించుకునేందుకు 11 రోజుల పాటు అటవీశాఖ అనుమతించేది. ఆ తర్వాత 7 రోజులకు, 5 రోజులకు, చివరికి దాన్ని 3 రోజులకు కుదించారు. అసంఖ్యాకంగా భక్తులు వస్తుండటంతో వన్య ప్రాణులకు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ అటవీశాఖ.. ఆంక్షలను విధించింది. టోల్ టాక్స్, పార్కింగ్ ఫీజుల పేరిట అధిక మొత్తాన్ని వసూలు చేయడం వివాదాస్పదంగా మారింది. దీంతో జిల్లా ఫారెస్టు అధికారులు కొత్త ప్రతిపాదనను తెరమీదకు తెచ్చారు. ఏడాదిలో 3 రోజులే అనుమతిస్తుండడంతో భక్తుల రద్దీ పెరగడంతో తొక్కిసలాట జరుగుతోందని, అందువల్ల అటవీ ప్రాంతంలో పులులు గర్భం దాల్చే జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలు మినహాయించి మిగతా తొమ్మిది నెలలు సలేశ్వరం దర్శించుకునే విధంగా సన్నాహాలు చేస్తున్నారు. కాగా, నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఆదివాసీ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే ఎలాంటి ప్రయత్నాలను సహించేది లేదని చెంచులోకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల గురువయ్య హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణ పేరిట చెంచులను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న ప్రభుత్వం.. ఈ విషయంలో మాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యమం తప్పదు.



సలేశ్వరం లింగమయ్య మూల విరాట్

కులగణన రీసర్వేకు బీఆర్ఎస్ డిమాండ్

» బీసీలకు 42 % రిజర్వేషన్‌తో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సీఎస్‌కు విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, కులగణనపై రీసర్వే చేయించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు కోరుతూ శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మీడియా పాయింట్‌లో మధుసూదనాచారి మాట్లాడుతూ తమిళనాడులో బీసీలకు 69% రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, అదే తీరులో తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కులగణన సర్వే పూర్తి స్థాయిలో జరగలేదని, రీ-సర్వే చేసి వాస్తవ గణాంకాలను బయటపెట్టాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను అణగదొక్కే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దోమ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలం మల్లెపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బంటు యాదయ్య(38) తండ్రి ఏడాది క్రితం మృతి చెందాడు. దాంతో కుటుంబ బాధ్యతలను తాను చూసుకునేవాడు. తండ్రి మరణించాక ఆయన పేరిట ఉన్న భూమిని తల్లి పేరిట మార్పించలేదు. తన పేరిట, తన తమ్ముడి పేరిట విరాసత్ చేయించుకోలేదు. తండ్రి పేరిట బ్యాంకులో ఉన్న రూ.లక్షకు పైగా పంట రుణం కూడా మాఫీ కాలేదు. పొలంలో రెండు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. ఈ క్రమంలో దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఈ అప్పులెలా తీర్చాలంటూ భార్య జ్యోతి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



బంటు యాదయ్య(ఫైల్)

చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టం!

» తెచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

» ఆక్రమణలో 5వేలకుపైగా చెరువులు

» హైదరాబాద్ పరిధిలో 44 చెరువులు పూర్తిగా కనుమరుగు



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జలవనరుల సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. చెరువుల ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టాలులేకపోవడం, వాల్టా వంటి చట్టాలున్నా ప్రభావవంతంగా పని చేయకపోవడంతో జలవనరుల సంరక్షణ సవాలుగా మారుతోంది. చెరువు భూములను ఆక్రమిస్తే ఇప్పటికీ 1905 నాటి భూ ఆక్రమిత చట్టం కిందే చర్యలు తీసుకునే పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చెరువుల సంరక్షణకు సమగ్రమైన ప్రత్యేక చట్టం తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇందు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కర్ణాటక, రాజస్థాన్‌లో చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. మనదగ్గర లేకపోవడంతో వేలాది ఎకరాల శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో 127 చెరువులు పాక్షికంగా, 44 చెరువులు పూర్తిగా కనుమరుగయ్యాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో చెరువుల్లోనే నివాస, వాణిజ్య భవనాలు నిర్మించిన దాఖలాలు ఉన్నాయి. రాష్ట్రంలో 63,063 జలవనరులు (కుంటలు, చెరువులు, జలాశయాలు, చెక్‌డ్యామ్‌లు వంటివి) ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖ తాజా సర్వేలో వెల్లడైంది. చెరువుల సంరక్షణకు వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ (వాల్టా) ఉంది. దీంతోపాటు తెలంగాణ మునిసిపల్ చట్టం కూడా చెరువుల సంరక్షణకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉంది. అయితే ఈ చట్టాలు బలంగా లేకపోవడంతో ఆక్రమణలను అడ్డుకునే పరిస్థితి లేకుండాపోతోంది. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో 920 చెరువులు ఉంటే 2014 వరకు 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. 2014 నుంచి 2023వరకు మరో 44 చెరువులు పూర్తిగా కనుమరుగు కాగా 127 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. 2014 నుంచి 2023 వరకు 171 చెరువులు ఆక్రమించినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే చెరువుల ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చెరువుల పరిరక్షణకు గత ప్రభుత్వ హయాం లో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, జలవనరుల పెంపునకు చర్యలు చేపట్టారు. ఇక ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 5వేలకుపైగా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పట్టణీకరణలో వేగం ఇందుకు ప్రధాన కారణంగా గుర్తించారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నివేదికల ప్రకారం హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో 2014 నాటికి 3,245 ఎకరాల చెరువుల భూములు ఆక్రమణలకు గురికాగా 2023నాటికి 4,000 ఎకరాలకు చేరాయి. రాష్ట్రవ్యాప్తం గా సుమారు 20వేల ఎకరాలకు పైగా చెరువుల భూ ములు ఆక్రమణకు గురైనట్టు మిషన్ కాకతీయ పథకంలో చేపట్టిన సర్వేలో వెలుగుచూసినట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయతో గత ప్రభుత్వ హయాంలో 5వేల ఎకరాలను ఆక్రమణల చెర నుంచి విడిపించగా ఇంకా 15 వేల ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోనే ఉన్నాయి. చెరువుల సంరక్షణలో అనుకున్న ఫలితాలను పొందాలంటే కర్ణాటక, రాజస్థాన్ తరహాలో బలమైన ప్రత్యేక చట్టాన్ని తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక 2016లో ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కూడా రద్దవడంతో జలవనరుల సంరక్షణకు పటిష్ఠ చట్టం తీసుకురావడంతోపాటు చెరువుల పర్యవేక్షణకు ఒక అథారిటీని ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది.

భూముల సరిహద్దుల ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించండి

» రెవెన్యూ, సర్వే అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు భూముల సర్వే, హద్దుల గుర్తింపు కోసం భూయజమానులు పెట్టుకునే ఎఫ్-లైన్ (క్షేత్రస్థాయి కొలత) సర్వే దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్-1317 ఫసలీ, తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ యాక్ట్- 1923 ప్రకారం సరైన విధానంలో ఉన్న దరఖాస్తులను చట్టప్రకారం పరిష్కరించాలని పేర్కొంది. ప్రభుత్వ సర్క్యులర్లలో పేర్కొన్న ప్రకారం 45 రోజుల్లో దరఖాస్తులను పరిష్కరించే బాధ్యత సర్వే, రెవెన్యూ అధికారులపై ఉంటుందని స్పష్టం చేసింది. చుట్టుపక్కల భూయజమానులు హద్దులను చెడగొడుతుండటంతో ములుగు జిల్లా వెంకటాపూర్ శివారు గ్రామానికి చెందిన కే రమేశ్, కే లక్ష్మన్న తమ భూమి సర్వే చేసి హద్దురాళ్లు పాతాలని కోరుతూ సర్వే, రెవెన్యూ అధికారులకు ఎఫ్-లైన్ దరఖాస్తు చేసుకున్నారు. నిర్ణీత పద్ధతిలో దరఖాస్తు చేసుకుని, రుసుములు చెల్లించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. సరిగా ఉన్న దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. చట్టప్రకారం చుట్టపక్కల భూయజమానులకు నోటీసులు జారీచేసి.. అన్ని అభ్యంతరాలు పరిశీలించిన మీదట సర్వే చేయాలని పేర్కొంది.

మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆదుకోండి

» పునరావాస కాలనీలకు మహర్దశ పట్టిస్తానన్న మాట ఏమైంది?: హరీశ్

హైదరాబాద్, సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులను ఆదుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం సీఎంకు రాసిన లేఖలో నిర్వాసితుల తరఫున వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు అండగా ఉంటానని ఆనాడు సీఎం రేవంత్ రెడ్డి ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరాహార దీక్ష చేపట్టారని గుర్తుచేశారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిర్వాసితులు ఆయనపైనే ఆశలు పెట్టుకున్నారన్నారు. కాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ నదిలోకి గోదావరి జలాలను తరలించడానికి మల్లన్నసాగర్‌పై ఆధారపడ్డారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, దాంతో ప్రయోజనం లేదని సీఎం స్వయంగా విమర్శలు చేశారని, మరి అదే ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నీళ్ల కోసం ఎందుకు తాపత్రయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయండి: కవిత

రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయకుండా పేదలకు విదేశీ విద్యను దూరం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎంపికై వివిధ దేశాల్లో చదువుకుంటున్న తెలంగాణకు చెందిన విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. పేద విద్యార్థులకు విదేశీ విద్య అందాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

కుంభమేళా సందర్భంలో మేడారం ముచ్చట!

ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. దేశంలోనే ఆ మాటకొస్తే ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతరకు కేవలం నాలుగురోజుల్లోనే కోటిన్నర మంది భక్తులు హాజరవుతారు. వీరిలో దాదాపు 60శాతం మంది గిరిజనులు, 30శాతం మంది అట్టడుగు వర్గాల వారు ఉంటారు. కనీస సౌకర్యాలు లేకున్నప్పటికీ కేవలం గిరిజన దేవతలైన సమ్మక్క సారాలమ్మ, గోవిందరాజు పగిడిద్ద రాజు, జంపనల ఆత్మబలిదానాలను గుర్తు చేసుకుంటూ వారిని దర్శించుకునే అపురూప ఘట్టం రెండేళ్లకో సారి ఆవిష్కృతమవుతుంది. ఫిబ్రవరి 12 నుంచి సంక్షిప్తరూపంలో మినీజాతర జరుగుతుంది.

మేడారం జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రాంతాలతో పాటు, ఛత్తీస్‌గఢ్ నుండి గుత్తి కోయలు, ఆదివాసీలు; జార్ఖండ్, మహారాష్ట్ర నుంచి గోండులు, కోయలు, లంబాడా; మధ్యప్రదేశ్ నుంచి బిల్లులు, రతీసాగర్ గోండులు; ఒరిస్సా నుంచి సవర ఆదివాసీలు కూడా పెద్ద ఎత్తున తరలివస్తారు. ప్రపంచంలో ఆదివాసీలు ఇంత పెద్ద ఎత్తున హాజరయ్యే వేడుక మరొకటి లేదు. ఆదివాసీలు కాకుండా ఇతర మత, వర్గ, వర్ణాల వారు కోట్లాదిగా హాజరయ్యే ప్రార్థనాలయాలు, పూజా స్థలాలు–శబరిమల, మక్కా, జెరూసలేం, కుంభమేళా, తిరుపతి వంటివి–ఉన్నాయి. కానీ ఏమాత్రం కనీస సౌకర్యాలు లేకుండా, దట్టమైన అటవీ ప్రాంతంలో, కేవలం కొయ్యలను కోయ దేవతలుగా భావిస్తూ పూజించడానికి కోటిన్నరమంది రావడం ప్రపంచంలోనే మరెక్కడా కానరాదు. అందుకే, దీనిని, అత్యంత అరుదైన జన జాతరగా భావించవచ్చు.



మహాకుంభమేళా వల్ల యూపీ ప్రభుత్వానికి 25 వేల కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పిస్తే గిరిజన జిల్లాగా పేరొందిన ములుగు జిల్లా రూపురేఖలు మారడమే గాక, ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తాయి.

ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7500కోట్లతో వివిధ సౌకర్యాలను కల్పించింది. ఈ మహామేళావల్ల ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి 25 వేల కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు కూడా జాతీయ హోదా కల్పిస్తే గిరిజన జిల్లాగా పేరొందిన ములుగు జిల్లా రూపురేఖలు మారడమే గాక, ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తాయి. జాతర మేడారం కుగ్రామంలో సాగడం, నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు కోటిన్నర మంది హాజరు కావడం, పూర్తిగా గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలను ఈ జాతరలో అనుసరించడం తదితర కారణాలు దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి అనువుగా ఉన్నాయి. ఇటీవలే మన రాష్ట్రంలోని సుప్రసిద్ధ కాకతీయ కట్టడం రామప్ప రుద్రేశ్వరాలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఇదే కోవలో యునెస్కో ఇంటాంజిబుల్ కల్చరల్ విభాగం క్రింద మరో అద్భుతమైన గిరిజన సాంస్కృతిక వేడుకగా నిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయి.

మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు తాడ్వాయి మండలానికి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టింది. ఈ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆదివాసీ, గిరిజన సంఘాలు ఎంతోకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అటు చారిత్రక శిల్పసంపద ఉన్న రామప్ప దేవాలయం, ప్రకృతి సౌందర్యంతో అలరాడే లక్నవరం చెరువు, విస్తారమైన అటవీప్రాంతం, వేలసంవత్సరాల నాటి శిలాజాలు ఉన్న పాండవుల గుట్ట, సహజంగా పారే గోదావరీ నదీ... ఇలా ప్రతీ అంశంలోనూ ప్రత్యేకత గాంచిన ములుగు జిల్లాలోని మేడారం జాతరకు కూడా జాతీయ గుర్తింపు లభించేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ గుర్తింపు లభిస్తే మేడారం జాతరపై అధ్యయనం చేయడానికి, ఇక్కడి గిరిజన, ఆదివాసీ సంస్కృతిని తెలుసుకోవడానికి వివిధ దేశాల నుండి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. రామప్పకు వరల్డ్ హెరిటేజ్ హోదా దక్కడంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర వహించింది. ఇప్పుడు మేడారం జాతరను జాతీయ పండగగా ప్రకటిస్తే దేశంలోని ఆదివాసీ గిరిజనుల పూర్తిస్థాయిలో మద్దతు లభించే అవకాశం కూడా ఉంటుంది.

• కన్నెకంటి వెంకటరమణ


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆప్ ఓటమి ఏ భవితకు విఘాతం?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ (ఆప్) పార్టీ ఓడిపోవటం ఊహించనిది ఏమీ కాదు. ఇతర రాజకీయ పార్టీల సంస్కృతికి భిన్నంగా రంగంపైకి వచ్చి ఎన్నో ఆశలురేపిన పార్టీ క్రమేపీ అదే సంస్కృతిని పూర్తిగా ఒంటబట్టించుకున్న తర్వాత ఏ జరుగుతుందో అదే జరిగింది. కానీ, ఆప్ ఓటమిని ఈ కోణం నుంచి చూడటంలో కొత్తేమి ఉండదు. పుట్టుక, ఉన్నతి, క్షీణత అనేవి ప్రతి రాజకీయ పార్టీకీ తప్పవనుకుంటే ఆప్‌కి ఈ పరిణామసూత్రమూ వర్తిస్తుందని తేలికగానే సరిపెట్టుకోవచ్చు. కానీ కొన్ని పతనాలనూ క్షీణతలనూ సాధారణ దృష్టితో చూడలేం. కొన్నిటిని భవిష్యత్తు కోణం నుంచే చూడగలం. అప్పుడే దాని ప్రాధాన్యత సరిగా అర్థమవుతుంది.

దేశంలో ప్రజాస్వామ్యం బాగా వేళ్లూనుకున్నదనీ ఈ కారణం రీత్యానే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్‌కు సరితూగగల దేశమేదీ లేదని మనం అందరమూ నమ్ముతాం. ప్రపంచంలో పేరెన్నికగల విశ్వవిద్యాలయాల్లో రాజనీతి శాస్త్రంపై ఉద్దండులని పేరు తెచ్చుకున్న మహామహులందరూ భారత ప్రజాస్వామ్యంతో పోల్చగల నమూనా ప్రపంచంలో ఎక్కడా లేదని గొప్పగానూ చెప్పారు. ఒక వెనుకబడిన దేశంలో, అధిక సంఖ్యాకులు నిరక్షరాసులైన చోట, సంప్రదాయాలే ఆలోచనలను శాసిస్తున్న చోట, ఆధునిక భావాల వ్యాప్తికోసం పెద్దఎత్తున మేధోరంగంలో సంఘర్షణలు జరగని చోట– కిందా మీదాపడి ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవటం వారికి వింతగానూ విశిష్టతగానూ అనిపించింది. మనతో పాటు స్వాతంత్ర్యం పొందిన దేశాలు ప్రజాస్వామ్యంగా పతనమైపోయిన నేపథ్యంలో వారికి అలా కనపడటంలో అసహజం ఏమీలేదు. ఇతర దేశాల్లోని పరిస్థితులతో పోల్చిచూసుకుంటే మనకూ ఇదే అభిప్రాయం కలగకమానదు. లోపాలెన్ని ఉన్నప్పటికీ ఏడు పదులు నిండిన మన ప్రజాస్వామ్యంపై ఆ అభిప్రాయాన్ని ఏర్పరచుకోకుండా ఉండలేం.

మతం, ప్రాంతం, భాష, కులం లాంటి వాటిమీద విపరీత ప్రేమతో, హద్దులు దాటిన తాదాత్మ్యంతో వ్యవహరించితే ఇక్కడైనా ఎక్కడైనా ప్రజాస్వామ్యం పలచబడిపోతుంది. ఈ వైపరీత్యం మన దేశంలో 1990ల నుంచి బాగా పెరుగుతోంది. జాతీయ, ప్రాంతీయ పార్టీలు విజయావకాశాల కోసం సందర్భాన్ని బట్టి మతం, ప్రాంతం, కులం, భాషలను ఉపయోగించుకుని ప్రజాస్వామిక స్ఫూర్తిని అడుగడుగునా గండికొడుతున్న నేపథ్యంలో ఆప్ రాజకీయరంగంలోకి రావటం ఒక కొత్త ఆశను కల్పించింది. 21వ శతాబ్దంలో మతం, ప్రాంతం, కులం, భాషల పేరెత్తకుండా ప్రభుత్వాల్లో పాతుకుపోయిన అవినీతిపై పోరాటాన్ని ప్రధాన అస్త్రంగా చేసుకుని ఢిల్లీలో ఆప్ అధికారాన్ని చేజిక్కించుకోవటం రాజకీయరంగంలో సంచలనమనే చెప్పాలి. దేశంలో గణనీయ సంఖ్యలో ఉన్న మధ్యతరగతి ఆప్‌కూ, కేజ్రీవాల్‌కూ జేజేలు కొట్టింది. మన మధ్యతరగతికి అవినీతిలో భాగం లేదని చెప్పలేం. అనేక ప్రలోభాలకు అది దూరంగా ఉందనీ చెప్పలేం. కానీ విధిలేని పరిస్థితిలో వాటిల్లో చిక్కుకుపోయామనే భావన అంతర్లీనంగా ఎంతో కొంత బలంగానూ ఉంది. వాటి నుంచి బయటపడేసే రాజకీయాలొస్తే భవిత ఇంకా బాగుంటుందనే ఆశ కూడా వారిలో గట్టిగానే ఉంది. ఆ ఆశతోనే ఆప్‌కు వెన్నుదన్నుగా నిలబడ్డారు. ఢిల్లీలో అధికారం రావటానికి తోడ్పడిన అజెండాతో దేశవ్యాప్తంగా ఆప్ విస్తరిస్తుందనే భరోసా చాలా మందికి కలిగింది. ముఖ్యంగా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతికి చెందిన బుద్ధిజీవులు కొత్త రాజకీయ ప్రయోగంలో పాలుపంచుకోటానికి ముందుకు వచ్చారు. ఎటువంటి రాజకీయ అనుభవం లేని వారూ, జీవితంలో ఇతరత్రా స్థిరపడి మంచి జీవితాన్ని అనుభవించగలిగే సామర్థ్యం ఉన్న వారూ ఆప్ వైపు ఆకర్షితులయ్యారు. ఒకమోస్తరు రాజకీయ నేపథ్యంలేని వాళ్లు ఎమ్మెల్యేలు అయ్యారు. మంత్రులయ్యారు.



> ప్రత్యామ్నాయ రాజకీయాలతో వచ్చే ఏ పార్టీనైనా పాపపంకిలంలోకి లాగే స్థాయికి మన ప్రజాస్వామ్యం వెళ్లిపోయింది! ధనబలం ముందు ఏ పార్టీ అయినా మోకరిల్లాల్సిన పరిస్థితి వచ్చేసింది. ఆప్ తొక్కిన అడ్డదారులూ అందులో భాగమే. అందుకే భవిష్యత్తు దృష్టి నుంచి చూస్తే ఆప్ ఓటమిని ప్రత్యామ్నాయ రాజకీయాలకు జరిగిన నష్టంగానే భావించాలి.

Saidesh

ఢిల్లీ కేంద్రంగా ఊపిరిపోసుకున్న కొత్త రాజకీయ సంస్కృతి క్రమేపీ దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనే ఆశ కొన్నాళ్లు బలంగానే ఉండేది. అందుకే కేజ్రీవాల్ పేరు దేశవ్యాప్తంగా మధ్యతరగతిలో బాగా ప్రాచుర్యం పొందింది. కీలక అధికారాలన్నీ కేంద్రం చేతుల్లో ఉన్న ఢిల్లీలో ముఖ్యమంత్రికే కాదు మొత్తం అక్కడి ప్రభుత్వానికీ అనేక పరిమితులు ఉన్నాయి. అయినప్పటికీ ఒక కొత్త రాజకీయ సంస్కృతికీ, పరివర్తనకూ ప్రతీకగా కేజ్రీవాల్‌ను పరిగణించటంతోనే ఆ ప్రాచుర్యం లభించింది. అందుకే ఆప్ ఎన్నికల్లో ఎక్కడ నిలబడితే అక్కడ దాని ప్రభావం మీద ఎన్నో అంచనాలూ విశ్లేషణలూ వెల్లువెత్తాయి.



■ రాహుల్ కుమార్

1989 నుంచి దేశంలో కొనసాగుతున్న సంకీర్ణ రాజకీయాలను నిలువరించి 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో బీజేపీ సంపూర్ణ మెజారిటీని సంపాదించిన నేపథ్యంలో ఆయనకు ప్రత్యామ్నాయం అసాధ్యం అనుకున్న పరిస్థితి నెలకొంది. సర్వం మోదీమయం అనుకున్న వాతావరణంలో 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 70కు 67 స్థానాలు సంపాదించి చరిత్రను సృష్టించింది. ఆర్థిక, పాలనపరమైన సమస్యల అజెండాను ప్రధానంగా చేసుకుని మధ్య, దిగువతరగతి ప్రజల మద్దతుతో రాజకీయాలను నడపవచ్చనే ధీమాను కల్పించింది. నిజానికి ఈ రెండు వర్గాలను కలుపుకొని మత, ప్రాంత, కుల, భాషా దురభిమానాలు లేని కొత్త రాజకీయ సంస్కృతినీ, ఆర్థిక విధానాలనూ దేశమంతా విస్తరించే అవకాశం అప్పట్లో కొంత స్పష్టంగా కనపడింది. కానీ, ఆ విస్తరించే క్రమంలో పాత రాజకీయ సంస్కృతితో సంఘర్షించటం కంటే సర్దుకుపోవటం ఆప్ ప్రారంభించింది. అన్ని విషయాల్లోనూ అది మొదలైంది. దాంతో పాటూ క్షీణతా మొదలైంది.

రాజకీయ విస్తరణకు ప్రజాబలాన్ని మాత్రమే నమ్ముకోకుండా ఇతర రాజకీయ పార్టీల్లాగా ధనబలం కోసం అడ్డదారులు తొక్కటం, మతపరంగా అపరిమిత హిందూ అభిమానాన్ని ప్రదర్శించటం మొదలుపెట్టటంతోనే ఆప్‌కూ ఇతర పార్టీలకూ పెద్ద తేడా లేకుండా పోయింది. స్థిర అభివృద్ధి కంటే తాయిలాలతోనే ఓటర్లను ఆకర్షించగలమనే నిర్ణయానికి వచ్చేసింది. ఒకరకంగా తనకీ ఇతర పార్టీలకూ మధ్యనున్న విభజన రేఖలను ఆప్ తనంతటతానే చెరిపివేసుకుంది. మద్యం కుంభకోణంలో ఇరుక్కోవటం దీనికొక ఉదాహరణ మాత్రమే. ఇతర రాజకీయపార్టీలకు భిన్నమైన అస్తిత్వాన్ని కోల్పోయిన తర్వాత ఆప్ విస్తరణ ఆగిపోయింది. పంజాబ్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మరోచోట ఎక్కడా గట్టిపోటీని ఇచ్చే పరిస్థితిని తెచ్చుకోలేక పోయింది.

ప్రాంతీయ, జాతీయ పార్టీలు నాయకుడి చుట్టూ కేంద్రీకృతమై అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఎలా నామమాత్రం చేశాయో కేజ్రీవాల్ కూడా ఆప్ విషయంలో చాలా మేరకు అలాగే చేశారు. వ్యక్తిపూజ హద్దులు మీరినచోట జనాకర్షణ భారమంతా అధినాయకుడి మీదే పడుతుంది. క్రమేపీ ఇతర నాయకులు జీరోలు అవుతారు. మహా అయితే నియోజకవర్గాలకే పరిమితం అవుతారు. ఏకవ్యక్తిదే సర్వాధికారమైన పార్టీలో రాజకీయ వ్యూహాలు కూడా గాడితప్పుతాయి. అనేక స్థాయిల్లో చర్చల్లేకుండా తీసుకునే నిర్ణయాలు అనర్థాలే ఎక్కువ తెస్తాయి. ఇతర పార్టీలతో పొత్తులపై అరమరికల్లేని చర్చలు ఆప్‌లో జరిగాయని విశ్వసించలేం. పొత్తులే లేకుండా ఒంటరిగా వెళ్లాలన్న కేజ్రీవాల్ నిర్ణయాలు సొంతపార్టీకే గాక మిత్రపార్టీలకూ పలు సందర్భాల్లో నష్టాలను తెచ్చాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని కొత్త రాజకీయ సంస్కృతి కోసం నిజాయితీగానే ఒకప్పుడు ప్రయత్నించిన చరిత్ర మరీ పాతది కాకపోవటం వల్ల ఆప్ నాయకుల్లో కొందరైనా ఇంకా కొట్లాడే స్థితిలో ఉన్నారు. భవిష్యత్తులో కేజ్రీవాల్ వేసే అడుగులను బట్టి వీళ్లల్లో ఎంతమందిని నిలుపుకుంటారన్నది ఆధారపడి ఉంటుంది.

ఆప్ ప్రస్థానాన్ని నిశితంగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టం అవుతుంది. బలమైన సంస్థాగత నిర్మాణాన్ని, సిద్ధాంతబలాన్ని కలిగి ఉన్న బీజేపీ లాంటి పార్టీని ఎదిరించి నిలబడటం చాలా కష్టమని తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్న అసాధారణ బలాన్ని ఉపయోగించిన బీజేపీ.. ఆప్‌ని అన్నిరకాలుగా ఉక్కిరిబిక్కిరి చేసిన విషయాన్నీ తోసిపుచ్చలేం. అన్ని నిర్ణయాలను లెఫ్టినెంట్ గవర్నర్ వీటో చేసే అధికారాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి అధికారాలేమిటో స్పష్టంచేయాలని సుప్రీంకోర్టు గడపను తొక్కాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు ఆ విషయంలో కొంత వెసులుబాటు కల్పించినా ఇతర మార్గాల్లో ఆప్‌ను చాలవరకూ బీజేపీ కట్టడి చేయగలిగింది. బీజేపీ ప్రచారయుద్ధ ధాటిని కూడా ఆప్ తట్టుకోలేకపోయింది. రాజకీయాల్లో బయటి ప్రత్యర్థులు ఎప్పుడూ ఉంటారు. వాటిని దీటుగా ఎదుర్కొనటం ప్రజాస్వామ్యంలో అత్యవసరం. ఆప్ దాన్ని సమర్థంగా ఎదుర్కోలేక పోయింది. అది ఈ ఎన్నికలకే పరిమితమైతే పర్వాలేదు. ప్రతిపక్ష పాత్రనే పోషించలేని స్థాయికి అది వెళితే ప్రత్యామ్నాయ రాజకీయ ప్రయోగాలపైనే నమ్మకం పోతుంది. ప్రధాని మోదీతో పాటు బీజేపీ కేంద్ర నాయకత్వం మొత్తం ఢిల్లీ ఎన్నికల్లో గెలుపుకోసం సర్వశక్తులూ కేంద్రీకరించిన నేపథ్యంలో ఒక పార్టీగా నిలబడటమే ఆప్ ముందున్న పెనుసవాల్. ప్రత్యామ్నాయ రాజకీయాలతో వచ్చే ఏ పార్టీనైనా పాపపంకిలంలోకి లాగే స్థాయికి మన ప్రజాస్వామ్యం వెళ్లిపోయింది! ధనబలం ముందు ఏ పార్టీ అయినా మోకరిల్లాల్సిన పరిస్థితి వచ్చేసింది. ఆప్ తొక్కిన అడ్డదారులూ అందులో భాగమే. అందుకే భవిష్యత్తు దృష్టి నుంచి చూస్తే ఆప్ ఓటమిని ప్రత్యామ్నాయ రాజకీయాలకు జరిగిన నష్టంగానే భావించాలి. దాని నుంచి గుణపాఠం నేర్వగలిగితేనే ప్రజాస్వామ్యానికి ఎంతో కొంత రక్ష!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

తెలంగాణ ఫిల్మ్ పాలసీ ఏదీ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అన్నింట్లో స్పష్టత ఉంది కానీ, విచిత్రంగా ఒక్క సినీ రంగం విషయంలో మాత్రం ఇంకా అస్పష్టతే కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తమ తెలుగు చిత్రాలకు, కళాకారులకు ఉగాది పర్వదినాన నంది అవార్డులు ఇచ్చే సంస్కృతి చాలాకాలం కొనసాగింది. సినిమావాళ్లు వాటిని సగౌరవంగా స్వీకరించేవారు. ఉత్తమ చిత్రాలను, కళాకారులను, సాంకేతిక నిపుణులను గుర్తించి ప్రభుత్వాలు ప్రోత్సహించడం మంచి సంప్రదాయమే. ఈ గౌరవం జాతీయస్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో జరుగుతున్నదే. అందులో ఎలాంటి అనుమానం లేదు. మన విషయానికొస్తే ఇంత కాలం తెలుగు సినిమానే వినోదాన్ని పంచుతోంది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా తెలుగు సినిమా వటవృక్షంలా ఎదిగింది. ఎదుగుతోంది. ఏడాదికి ఎంత లేదన్నా వందకు పైగా సినిమాలు నిర్మాణం అవుతున్నాయి. ప్రధాన స్రవంతిలో తెలుగు సినిమా 'పాన్ ఇండియా' స్థాయికి వెళ్లడం... వందలు, వేల కోట్ల వసూళ్లు సాధించడం అందరూ హర్షించదగిన విషయమే. అయితే ఈ వటవృక్షం కింద 'తెలంగాణ' ప్రాంతీయ సినిమా ఎదుగుదల ఎలా? అనేదే ప్రధాన ప్రశ్న.

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా సరే సాహిత్యం, సంస్కృతికి కొనసాగింపుగా వివిధ కళారూపాలు... వాటికి కొనసాగింపుగా సినిమా పుట్టుకొస్తుంది. బెంగాలీ, మరాఠీ, ఒరియా, కన్నడ, తమిళ, మలయాళం వంటి అనేక ప్రాంతీయ భాషా చిత్రాలకు మూలం అక్కడి సంస్కృతీ సాహిత్యాలే. తెలంగాణకు కూడా ప్రత్యేకమైన సాహిత్యం, సంస్కృతి ఉంది. కాబట్టి ఇక్కడ కూడా తెలంగాణ సినిమా రావాల్సిందే. కానీ ఎప్పటినుంచో అభిమానులను ఆకట్టుకున్న తెలుగు సినిమా నుంచి వేరుపడి... తెలంగాణ సినిమా తనదైన అస్తిత్వాన్ని చాటుకోవాలంటే తప్పకుండా తెలంగాణ సోయితో ఆలోచిస్తే కానీ కొత్త సినిమా రూపుదిద్దుకోదు (ఇప్పటికే హైదరాబాద్ 'దక్కనీ సినిమా' కనుమరుగైంది). ఇది ఏ ఒక్క వ్యక్తితోనో, దర్శకుడితోనో, నిర్మాతతోనో అయ్యే పని కాదు. ప్రభుత్వమే ప్రత్యేకంగా 'తెలంగాణ ఫిల్మ్ పాలసీ'ని రూపొందించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

> ఇప్పుడున్న పరిస్థితుల్లో కమర్షియల్ తెలుగు సినిమాను తట్టుకుని తెలంగాణ సినిమా మనగలగాలంటే తప్పకుండా ప్రభుత్వం చేయూత కావాల్సిందే. తెలంగాణ సినిమా అభివృద్ధికి అతి ముఖ్యమైన పది పాయింట్ల పాలసీని తక్షణమే రూపొందించి అందుబాటులోకి తేవాలి.



తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటింది. గత ప్రభుత్వం ఈ దిశగా ఏమాత్రం చొరవ చూపలేకపోయింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు భయపడి తెలంగాణ సినిమాకు తీరని అన్యాయం చేశారు. అయినప్పటికీ వ్యక్తిగత ప్రతిభ, ఆసక్తితో కొందరు తెలంగాణ సినిమాలు తీసి, అస్తిత్వం చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారికి ప్రభుత్వం నుంచి అందిన సహకారం శూన్యం. ఇప్పుడున్న పరిస్థితుల్లో కమర్షియల్ తెలుగు సినిమాను తట్టుకుని తెలంగాణ సినిమా మనగలగాలంటే తప్పకుండా ప్రభుత్వం చేయూత కావాల్సిందే. తెలంగాణ సోయితో చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఆలోచిస్తేనే అందుకు బాటలు పడతాయి. తెలంగాణ సినిమా అభివృద్ధికి అతి ముఖ్యమైన పది పాయింట్ల పాలసీని తక్షణమే రూపొందించి అందుబాటులోకి తేవాలి. ప్రధాన స్రవంతిలో తెలుగు సినిమా ఎలాగూ ఉంటుంది. అయితే తెలంగాణ సినిమా ఒక పాయగా ఉండాల్సిందే. అందుకు 'తెలంగాణ ఫిల్మ్ పాలసీ' ఒక్కటే పరిష్కారం. అది జరగకుండా 'గద్దర్' అవార్డులను హఠాత్తుగా తెరమీదకు తీసుకొచ్చారు. ఇటీవల దీనికి సంబంధించిన మీటింగులు కూడా నిర్వహించారు. మొక్కుబడిగా సాగిన ఈ మీటింగుల్లో గత నంది అవార్డుల తరహాలోనే 'గద్దర్' అవార్డులు ఉగాదికి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. కాకపోతే ఆయా కేటగిరీలకు నగదు పారితోషికాలను పెంచాలనుకుంటున్నారు. అదొక్కటే తేడా.

మరోవైపు సినిమాలకు 'గద్దర్' అవార్డుల పట్ల సినిమా రంగంతో పాటు తెలంగాణ సమాజంలో కూడా మిశ్రమ స్పందన ఉంది. తీరా ప్రభుత్వం వాటిని ప్రకటించిన తర్వాత... అవార్డు తీసుకునేందుకు సినీరంగానికి చెందిన వారు ఆసక్తి చూపకపోతే ప్రభుత్వం నవ్వులపాలు కాక తప్పదు. ప్రస్తుతానికి సంఖ్యాపరంగా తెలంగాణ సినిమాలు అంతంత మాత్రమే. పైగా అర్హత (నాణ్యత) లేకున్నా ఒత్తిడులకు లోనై, కొన్ని తెలంగాణ సినిమాలకు కూడా అనివార్యంగా అవార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంటారు. దీనివల్ల తెలంగాణ సినిమాకు తీవ్ర నష్టమే తప్ప ఏమాత్రం ప్రయోజనం ఉండదు. అందుకే మొక్కుబడిగా అవార్డులు ప్రకటించి, అభాసుపాలు కావడం కన్నా... ప్రభుత్వం చిత్తశుద్ధితో 'తెలంగాణ ఫిల్మ్ పాలసీ' కోసం కృషి చేస్తే, తెలంగాణలో సినిమా కలలు కంటున్న యువతరానికి ఒక దిశ, మార్గనిర్దేశం చూపించిన వాళ్లవుతారు. తెలంగాణ సాహిత్యం, సంస్కృతి విశ్వవ్యాప్తం కావాలంటే వాటికి కొనసాగింపుగా సినిమాను తెలంగాణ ఆత్మతో ఆవిష్కరించాల్సిందే. ఏడాదికి వంద తెలుగు సినిమాలతో పాటు.. ఫిల్మ్‌పాలసీ ప్రయోజనాలు పొంది పదో, ఇరవయ్యో తెలంగాణ సినిమాలు కూడా రూపొందితే సినీరంగంలోని కళాకారులకు, టెక్నీషియన్లకు, స్టూడియోలకు ఆ మేరకు మేలే జరుగుతుంది కదా!

○ చల్లా శ్రీనివాస్
ఫిల్మ్ క్రిటిక్

కాలం కడలిలో ఒప్పంద కార్మిక స్త్రీలు

'ఎక్కడికి పోవాలో తెలియక ఫిజీకి వెళ్లారు. ఎన్నో మూగజీవాల మాదిరిగా వారిని తోటలకు కేటాయించారు. ఇచ్చిన పని సంతృప్తికరంగా చేయకపోతే, వారిని తిట్టడం, కొట్టడం, జరిమానా వేయడం, జైలుకు పంపడం జరుగుతోంది. తోటల జీవితం వారి ప్రవర్తనను వారి ఆకారాల్ని సైతం మారుస్తోంది. కొందరు నలిగిపోయి, పగిలిన హృదయంతో, మరికొందరు నీరసంగా, మరికొందరు కఠినంగా చెడుగా తయారవుతున్నారు. ఒప్పంద స్త్రీలు వారి పని ముగించుకొని తిరిగి వెళ్తున్నప్పుడు, మొదటిసారి నేను చూసిన దృశ్యాన్ని ఎన్నటికీ మరచిపోలేను. ఆ స్త్రీల ముఖాలు నన్ను వెంటాడుతున్నాయి' అని మెథడిస్ట్ మిషనరీ హన్నా డడ్లీ బాధపడ్డారు.

బ్రిటిష్ సామ్రాజ్య చరిత్రలో బానిసత్వం ఏదో ఒక రూపంలో ఎక్కువ భాగం ఆఫ్రికా, కరేబియన్ దేశాలలోనే కొనసాగింది. అది ఒక సంస్థగా 1572–1834ల మధ్య, దాదాపు రెండున్నర శతాబ్దాలు నడిచింది. బానిసత్వం రద్దయాక దాదాపు 80 సంవత్సరాలు 1838–1917ల మధ్య, బ్రిటిష్ ప్రభుత్వ సమయంలో, ప్రపంచంలో 20 దేశాలకు, 13 లక్షల మంది ఒప్పంద కార్మికులుగా మనదేశం నుంచే పంపించబడ్డారు. ఒప్పంద కార్మికులుగా వెళ్లిన వారిలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరూ ఉన్నారు. వారందరూ కనీసం అయిదేళ్లు అక్కడ చెరకు తోటల్లో పని చేసేందుకు ఒప్పందం మీద వెళ్లినవారు. సాధారణంగా తమ ఒప్పందాలను పూర్తి చేసి తిరిగి వెళ్లే ఒంటరి పురుషులనే తోటల యజమానులు, వ్యవసాయ కార్మికులుగా ఇష్టపడ్డారు. మొత్తం కుటుంబాల నియామకాలను కూడా వారు వ్యతిరేకించారు. మహిళా ఒప్పంద కార్మికులకు వ్యతిరేకంగా ఉండేవారు. ప్రధానంగా శారీరకంగా బలమైన స్త్రీ కార్మికుల కోసమే వెతికేవారు. తొలి రోజుల్లో కారణాలు ఏమైనప్పటికీ, కార్మికులుగా మహిళలు ఎంత ఉపయోగకరంగా ఉంటారనే దాని గురించి యజమానులు ఆందోళన చెందారు. వారి పనుల దృష్ట్యా స్త్రీని ఒక ప్రమాదకారిగా కూడా భావించారు. ఎందుకంటే గర్భం, పిల్లలను కనడం మూలాన, తక్కువ ఉత్పాదకతకు వారు కారణం అవుతారని. అయినా కార్మిక శక్తిని 'స్థిరపరచడానికి' వారికి స్త్రీ అవసరం అయింది. ఏది ఏమైనా స్త్రీలు ఎవరైనా, ఏ పరిస్థితుల్లో ఉన్నా వారికి కావలసింది ఉత్పాదక కార్మికులు మాత్రమే.

ఒప్పంద కార్మికులందరిలోనూ స్త్రీల పాత్ర, ఎక్కువైనది ముఖ్యమైనది కూడానూ. ఉద్యోగిగా, భార్యగా, తల్లిగా, లేదా ఒంటరి మహిళగా, తోటలలో పని చేయడంతో పాటు ఇంటి పని కూడా చేసుకోవాలి. రోజంతా, అలా వారికి రెట్టింపు పని. అంతే కాకుండా తెలియని ప్రదేశంలో, కొత్త వాతావరణంలో, ఇంతకు ముందెన్నడూ తెలియని ఇతర ఒత్తిడులనూ అనుభవించాలి. ఒప్పంద కార్మికులలో చాలా మంది ఒంటరి మహిళలు, యువ వితంతువులు, యుక్తవయస్సులో ఉన్న బాలికలు, ఇతర నిరాశ్రయులైన మహిళలు వారి కుటుంబాల చేత విడిచిపెట్టబడ్డ వారు, లేదా వివిధ కారణాలతో వారే కుటుంబాల నుండి దూరమైనవారు. సాధారణంగా సామాజికంగా పితృస్వామ్య కట్టుబాట్ల మూలాన విడదీయబడ్డవారే అందులో ఎక్కువ. వారు ఒప్పంద మార్గాన్ని ఎంచుకున్నందుకు వివిధ కారణాలు ఉన్నాయి. కొంతమంది స్త్రీలకు, అది కొత్త జన్మ, కొత్త గుర్తింపును కోరుకునే ప్రయత్నం. ఇక్కడి వింత మనుషుల ప్రపంచం నుండి తప్పించుకునే మార్గం. వితంతువులు సతి నుండి తప్పించుకున్నారు, మరి కొందరు బలవంతపు వివాహాల నుండి తప్పించుకున్నారు. సాంస్కృతిక అణచివేత, పితృస్వామ్యం, కుల ఆధారిత సమాజపు కట్టుబాట్ల నుండి తప్పించుకోవడానికి, భారతీయ స్త్రీలు మెరుగైన జీవితపు ఆశతో ఒప్పందాన్ని ఎన్నుకున్నారు. అయితే అది ఎవరికీ తెలియకుండా జరిగిన వ్యవహారం.

> సాంస్కృతిక అణచివేత, పితృస్వామ్యం, కుల ఆధారిత సమాజపు కట్టుబాట్ల నుండి తప్పించుకోవడానికి, అభాగ్య భారతీయ స్త్రీలు మెరుగైన జీవితపు ఆశతో ఒప్పందాన్ని ఎన్నుకున్నారు. బతుకు చీకటిలో బాధల నావలో ఏ దరికో, ఏ దెసకో సాగిపోయారు. చరిత్ర వారిని నిర్దాక్షిణ్యంగా విస్మరించింది. వారి విషాద గాథలూ విస్మృతమయ్యాయి.



దేశాంతర గమన డిపోలకు చేరిన దగ్గరనుంచి, ఇరుకైన చెక్క ఓడలలో ప్రయాణం మొదలుకొని, చేరినచోటవరకూ మహిళలు ఊహించలేని కష్టాలు, వేధింపులు సవాళ్లను ఎదుర్కొన్నారు భరించారు. చాలా మందికి, కాలా పానీగా పిలుచుకున్న పిచ్చి సముద్రమే వారు చూసిన మొదటి దృశ్యం. ఓడ కెప్టెన్, ఓడలో వైద్యుడు లేదా సిబ్బంది భారతీయులను దుర్భాషలాడడం అవమానించడం లాంటి అనేక ఉదంతాలు వెలుగుచూసాయి. మహిళలు, ముఖ్యంగా ఒంటరి మహిళలు, ఎలాంటి అవకాశం వారు తీసుకుంటారోనన్న భయంతో పయనించేవారు. ఓడ అధికారులు కోరిన ఒక నిర్దిష్ట పనిని నిర్వహించడానికి నిరాకరించినందుకు గొలుసులతో బంధించబడిన ఒక మహిళ గొలుసుల నుంచి బయటపడ్డాక సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. చాలా మంది యువతులు ఓడలో అలా అమానవీయమైన ప్రవర్తన, చిత్రహింసలు భరించలేక సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మంచి భవిష్యత్తు కోసం వెతుకుతున్న ఆ యువతుల జీవితాలు క్రూరంగా ఆగిపోవడమే కాదు, అది ఒక దారుణమైన విషయంగా వారు చరిత్ర పుస్తకాల నుండి కూడా అదృశ్యమయ్యారు. వలస అధికారుల మనస్సులో, ఒప్పంద కార్మికులు ప్రత్యేకించి స్త్రీలు, కేవలం సరకులు లేదా వస్తువులు, సంఖ్యలుగా పరిగణించబడ్డారు తప్ప మానవులుగా కాదు. వారి దుర్బలత్వం తీవ్రంగా దుర్వినియోగమయింది. అలాంటి దాడులకు వ్యతిరేకంగా ఎలాంటి రక్షణా వారికి లేకుండా పోయింది.

ఒప్పంద కార్మికులుగా చేరిన ప్రదేశంలో, జాత్యహంకారంతో పాటు స్త్రీవివక్షను కూడా స్త్రీలు భరించారు. స్త్రీల కొరత మూలంగా అనధికారిక బహుభార్యత్వ వ్యవస్థ, సాంప్రదాయ విలువలను సవాలు చేసి, మహిళలకు తప్పించుకోలేని పోటీని, తోటల పనులలో చాలా బలంగా అక్కడ ఉండింది. కానీ భార్య వైవాహిక విశ్వసనీయత ఆమె భర్తకు తప్పనిసరి కావడం, ఒక భార్య వ్యభిచారం చేసినట్లు అనుమానించినట్లయితే, అది క్రూరమైన పరిణామాలకు దారి తీసేది. తోటలలో పని చేసే పురుషుల అనాగరిక, రక్త దాహంతో కూడిన స్వభావానికి రుజువుగా 'భార్య' హత్యలతో, మహిళలు 'బహుళ అణచివేతలకు' గురయ్యారు. 'లైంగిక దోపిడీకి, అతి దోపిడీకి, స్వేచ్ఛ నిరాకరణ'కు, ఒప్పంద వ్యవస్థలో మహిళలు, విస్తృత స్థాయిలో బాధితులయారు. తోటల్లో పరిస్థితులు, స్త్రీలను పురుషుల మీద ఆధారపడేలా చేసాయి.

మహిళా కార్మికులు తోట యజమానుల దోపిడీకీ సైతం గురయ్యారు. నివసించడానికి వారికి సరైన స్థలాలు లేవు. గర్భధారణ సమయంలో ఎటువంటి సెలవులూ లేవు. వారు పురుషుల గుడిసెలలో ఉండాలి లేదా వారి జీవన భాగస్వాములను మార్చుకోవాలి. అనేక సందర్భాల్లో వారు పునరుత్పత్తి రూపాలుగా భావించబడ్డారు. ఫిజీ, సురినామ్ మొదలైన దేశాల్లో కార్మికులు లైంగిక అసూయతో హత్యలు, భార్యను నరకడం, ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి కారణాలను చూపించిన సందర్భాలు అనేకం. చాలా అత్యాచారాలు, ఇతర రకాల లైంగిక బలవంతాలు జరుగుతున్నాయనే వాస్తవాన్ని, తోటల యజమానులు ఎన్నడూ అంగీకరించలేదు.

మహిళలు చెరకు పొలాల్లో లేదా యూరోపియన్లకు గృహ కార్మికులుగా ఎక్కువ గంటలు పనిచేసేవారు. రోజుకు తొమ్మిది గంటలు ఉండాల్సిన వారి పని, రోజుకు పదమూడు గంటలకు పొడిగించారు. ముఖ్యంగా మహిళల పట్ల వారు కఠినంగా వ్యవహరించేవారు. చాలా మంది క్రైస్తవ మిషనరీలు, పగటి నుండి చీకటి పడే వరకు ఎక్కువ గంటలు చెరకు పొలాల్లో మహిళలు పని చేయడాన్ని తరచుగా ఖండిస్తూనే ఉండేవారు. పాలిచ్చే పిల్లలతో ఉన్నవారు 11 గంటల పాటు పొలాల్లో ఉంటున్నారని ఆధారాలు సమర్పించారు. స్త్రీలు ఎక్కువగా పని చేయలేరు అని వాదించినా, చెరకు పొలాల్లో ఎక్కువ గంటలు పని చేయడం, కలుపు తీయడం వల్ల వారి మీద హానికరమైన ప్రభావాన్ని కొందరు తప్పించుకోలేకపోయారు. అయినా అవేవీ యజమానుల మీద పనిచేసేవి కావు.

గర్భిణీ స్త్రీలు ఏడు నెలల పాటు పని చేయడం కొనసాగించారు. ఆ తర్వాత మళ్లీ పనిని ప్రారంభించే వరకూ వారి రేషన్ నిలిపివేసేవారు. పని చేయలేని లేదా అనారోగ్యంతో ఉన్న వారికి కూడా రేషన్ నిరాకరించారు. సామాజిక–ఆర్థిక పరిస్థితులు కుటుంబ జీవితాన్ని అనిశ్చితంగా మార్చేవి. మహిళలు తరచుగా అన్నింటికీ బాధ్యులయేవారు. తమ పిల్లలకు ఆహారం అందించడంలో నిరంతరం కష్టాలను వారు ఎదుర్కొనేవారు. రక్షణ కోసమో, జీవనాన్ని సాగించుకునేందుకో స్త్రీలు, కొన్నిసార్లు పురుషులకు దగ్గర కావల్సి వచ్చేది. బతకడానికి తీరని లోటుతో ప్రవర్తించిన అలాంటి స్త్రీలను పురుషులు 'రైస్–కుక్కర్లు' అని పేరు పెట్టారు. చెరకు తోటలలో పనిచేయడానికి, స్త్రీలకు అవకాశాలు ఉన్నప్పటికీ, చెరకు పరిశ్రమ బయట, మగవారికి ఉన్నన్ని అవకాశాలు స్త్రీలకు లేవు. 1880లలో స్త్రీలు నానీలుగా, టాయిలెట్లను శుభ్రం చేసే వారిగా, ఇంటి పనుల కోసం నియమించబడ్డారు. దారుణమైన పరిస్థితుల్లో భారతీయ స్త్రీలు జీవించారు. వారి వేతనాలు తక్కువగా ఉండేవి, కొన్నిసార్లు చెల్లించబడేవే కావు. ఆ ఇంటి యజమానులు వారిని బానిసలుగా చూసేవారు.

ఒప్పందానికి సంబంధించిన రెండు అత్యంత మొండి సమస్యలకు మహిళలు బాధ్యత వహించారు. ఒకటి హృదయాన్ని కదిలించే అధిక శిశుమరణాలు, ముఖ్యంగా 1890లలో, దాదాపు నాలుగింట ఒక వంతు మంది పిల్లలు, పుట్టిన మొదటి సంవత్సరంలోనే మరణించారు. అధికారులు దానికి భారతీయ తల్లుల మీదే నిందలు వేశారు. వారి చెడు నడవడిక, ప్రబలమైన వ్యభిచారం, పేలవమైన పరిశుభ్రత కారణంగా 'మాతృ ప్రవృత్తి' లోపించిందని వారు ఆరోపించారు. కఠినమైన తోటల పెంపకంలోని దినచర్యే ఈ విపత్తుకు కారణమని మరి కొందరు అన్నారు. అనేక సందర్భాల్లో సౌకర్యమైన వసతే కాదు, స్నాన సదుపాయాలు కూడా ఉండేవి కాదు. ఒప్పంద కార్మికులు బహిరంగ స్నానం చేయవలసి వచ్చేది. కనీస వసతిలేని సౌకర్యాలులేని మురికివాడల్లో గుడిసెల్లాంటి ఇళ్లల్లో పిల్లల పెంపకం, స్త్రీలు ప్రసవించిన వెంటనే తిరిగి పొలాల్లోకి పనికి వెళ్లాలని ఒత్తిడి చేయడం, కొంకి పురుగు విరేచనాలు, రక్తహీనత వంటి బలహీనపరిచే అంటు వ్యాధుల ప్రాబల్యం మూలంగా చాలా మంది తల్లులు, పిల్లలతో సహా భారీ సంఖ్యలో మరణించేవారు. తోటల మీద మానవ జీవితాలను అత్యధికంగా ఈ వ్యాధులు బలి తీసుకునేవి. భారతీయ స్త్రీలు స్వదేశానికి తిరిగి వచ్చి ఉంటే, వారు వెళ్ళే ముందు అనుభవించిన కళంకం, అణచివేత, కష్టాలూ మరింత ఎక్కువ అయి ఉండేవి. 'అనాగరిక పర్యాటకుల్లా లేదా యాత్రికుల్లా' ఒప్పంద వలస స్త్రీ కార్మికుల కథలూ వారూ మరుగున పడిపోయారు.

◆ ముకుంద రామారావు



అవినీతి మయం

- అందినకాడికి దోచుకుంటున్న రవాణా శాఖ అధికారులు
- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకుంటున్న వైనం
- ఏసీబీకి చిక్కి.. ఊచలు లెక్కపెడుతున్నా మారని తీరు
- డీటీసీ శ్రీనివాస్ పట్టుబడటంతో మరోసారి చర్చ
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఖమ్మం జైలుకు పుప్పాల
- విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ డీటీవో లక్ష్మిపై వేటు
- చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు


ఏసీబీకి చిక్కి జైలుపాలైన డీటీసీ పుప్పాల శ్రీనివాస్


సస్పెన్షన్‌కు గురైన డీటీవో లక్ష్మి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రవాణాశాఖ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ముడుపులు ముడితే తప్ప పనులు చేయడం లేదు ఆర్టీఏ అధికారులు. వాహనదారులు ఏ పని కోసం వచ్చిన మామూళ్లు చెల్లించుకోవాల్సిందేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజురోజుకు వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయాలకు సేవల కోసం వచ్చే వాహనదారుల సంఖ్య కూడా పెరుగుతోంది. దానికి తగ్గట్టు ఆర్‌టీఏ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు కాసుకు కూర్చుంటున్నారనే చర్చ జరుగుతోంది. కోడ్ భాషతో రూ.కోట్లు వెనుకేస్తుకుటుంటన్నారని బాధితులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఆర్టీఏ కార్యాయాలకు వెళితే పైస లేనిదే పని కాదని పలువురు వాహనదారులు అంటున్నారు. ఈ తరహాలోనే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు డిప్యూటీ కమిషనర్ అయిన పుప్పాల శ్రీనువాస్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారని, ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యారని, ఇదే రీతిలో ఆర్టీఏ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది అవినీతి పెచ్చుమీరిపోయిందన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో అలసత్వం వహించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ డీటీవో లక్ష్మిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేయడం, ఏసీబీ దాడులు, డీటీసీ శ్రీనివాస్ అరెస్టు క్రమంలోనే ఇది కూడా జరగడం ఆ శాఖలో తీవ్ర కలవరం రేపుతోంది. అవినీతికి అలవాటు పడిన అధికారులు, సిబ్బందిలో వణుకుమొదలైంది. ఎన్ని సార్లు, ఎంతమంది అధికారులు అవినీతి కేసుల్లో దొరుకుతున్నా ఊచలు లెక్కపెడుతున్నా ఆర్టీఏ కార్యాలయాల్లో అవినీతి జాడ్యం మాత్రంపీడటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవినీతికి మరిగి... ఊచలు లెక్కపెడుతున్నారు...

నెలనెలా వచ్చే జీతం చాలదన్నట్టు అవినీతి సొమ్ముకు తెగపడి వాహనదారుల నుంచి

మిగతా 7లో



స్థానికానికి ముమ్మర కసరత్తు

ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం

- పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- ఈనెల 15లోపు సిబ్బందికి ఎన్నికల శిక్షణ పూర్తి
- ఇప్పటికే స్వతంత్రులకు కేటాయించే ఫ్రీ సింబల్స్ ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో తగ్గనున్న జీపీలు, ఎంపీటీసీలు.. పెరుగనున్న జడ్పీటీసీ స్థానాలు
- మొత్తం 1,678 జీపీలు, 774 ఎంపీటీసీలు, 75జడ్పీటీసీలు
- ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్

7

జిల్లా, మండల ప్రాథేశిక నియోజకవర్గాలు, గ్రామ పంచాయతీలకు త్వరలోనే ఎన్నికలు జరగబోతున్నాయి. ఇందుకోసం యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించే ఫ్రీ సింబల్స్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బందిని గుర్తించాలని ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయగా.. ఆ మేరకు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. ఈనెల 10వ తేదీ లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు, పోలింగ్ సిబ్బందిని ఖరారు చేసి.. 15వ తేదీ లోపు శిక్షణ పూర్తి చేసేలా ఉత్తర్వులు అందాయి. అయితే తొలుత జిల్లా, మండల పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించే యోచనలో సర్కారు ఉందని సమాచారం. దాంతో పాటు పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల తుది జాబితాల ఖరారు లాంటి వాటికి కూడా మార్గదర్శకాలిచ్చింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్త మునిసిపాలిటీలు, కొత్త మండలాల ఏర్పాటుతో జీపీలు, ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గనుండగా, జడ్పీటీసీ స్థానాలు పెరుగనున్నాయి. కాగా, స్థానిక సమరంలో తలపడేందుకు రె'ఢీ' అంటున్న ఆశావహులకు రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీలు, మండల, జిల్లా ప్రాథేశిక నియోజకవర్గాల వివరాలు..

జిల్లా	జీపీల సంఖ్య	ఎంపీ టీసీలు	జడ్పీ టీసీలు
వరంగల్	316	130	11
హనుమకొండ	210	129	12
జనగామ	279	122	12
మహబూబాబాద్	456	193	18
భూపాలపల్లి	247	109	12
ములుగు	170	83	10
మొత్తం	1,678	766	75

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి


సీడీఎంఏతో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్, అధికారులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ బల్దియా పరిధిలో వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి గ్రేటర్ వరంగల్ బల్దియా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు అధికారులు హాజరై సీడీఎంఏ అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. వరంగల్‌లోని అన్ని డివిజన్‌లలో నీటి సమస్య రాకుండా ముందస్తుగా పైపులైన్ నిర్మాణ ప్రక్రియ, లీకేజీలపై దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికి కమిషనర్ స్పందించి వివరణ ఇచ్చారు. నగరంలో నీటి సరఫరా లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం జరుగుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించి అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. తాగు నీటి సమస్య ఉన్న ప్రాంతాలను వార్షిక ప్రణాళికలో భాగంగా గుర్తించడం జరిగిందని, నగరంలో ఎక్కడా పైపులైన్ లీకేజీలు లేకుండా చూస్తున్నామని అన్నారు. ఒక వేల ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉంటే త్వరితగతిన మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. నూతన పైపులైన్‌ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ టెండర్ల వద్దనే ఉందని అది పూర్తి కాగానే పనులు షురూ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ సంతోష్‌బాబు, ఐటీ అధికారి హరికుమార్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా పర్యాటక ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని మొగిలిచర్ల గ్రామంలో ఏకవీర దేవాలయాన్ని పునరుద్ధరించి యునెస్కో గుర్తింపు పొందే స్థాయికి తీసుకురావాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పురావస్తు శాఖ, కుడా అధికారులు, చరిత్రకారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చేపట్టాల్సిన పనులు, కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. దేవాలయ స్థలానికి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసినందున ప్రహరీని నిర్మించాలని, పురాతన బావిని శుభ్రం చేయాలని సూచించారు. సమీపంలో ఉన్న 55 శిల్పాలను దేవాలయ ప్రాంగణంలోకి తరలించి వాటి కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాకుండా జిల్లాలోని మరో ఐదు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పాకాలలో బోటింగ్, బటర్‌ఫ్లై పార్కు, కాటేజ్‌లను ఏర్పాటు చేసి ఇప్పటికే ఎకో టూరిజంగా అభివృద్ధి చేశామని, ప్రత్యేకంగా పక్షుల పార్కు, పురావస్తు శాఖ మ్యూజియం కూడా ఏర్పాటు చేసి మరింత బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. పాకాల సమీపంలో కోయ తెగ ఉన్న గ్రామాన్ని గుర్తించాలని అటవీశాఖ అధికారులను, జిల్లాలో శిల్పారామం ఏర్పాటుకు 3 నుంచి 5 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఇంటాక్ కో కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కోట చెరువు శుద్ధీకరణకు చర్యలు

నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు కోట చెరువు శుద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ కోట చెరువు సుందరీకరణ, ఫెన్సింగ్, ఎఫ్‌టీఎల్ హద్దులు, బండ్ బలోపేతం కోసం తీసుకున్న చర్యలపై ఈ నెల 25వ తేదీన విచారణ జరగనున్న నేపథ్యంలో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జిల్లా ఇరిగేషన్ అధికారి శంకర్, ఆర్‌డీవో సత్యపాల్‌రెడ్డి, బల్దియా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నేడే మహా కుంభాభిషేకం

- కాళేశ్వరానికి భారీగా తరలొస్తున్న భక్తులు
- రెండురోజుల పాటు వైభవంగా సాగిన హోమాలు, ప్రత్యేక పూజలు
- ప్రధాన ఘట్టంలో పాల్గొననున్న మంత్రులు సురేఖ, పొన్నం, శ్రీధర్‌బాబు

7


శివలింగం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

పోలీసుల కనుసన్నల్లో వర్సిటీ క్యాంపస్

ఘర్షణల నేపథ్యంలో బందోబస్తు

- త్వరలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం
- విచారణ కమిటీ ఏర్పాటు
- డీన్లు, విభాగాధిపతులతో వీసీ, రిజిస్ట్రార్ సమావేశం

6



ఇనుపరాతి గుట్టల్లో.. ఎకో పార్క్

నాలుగువేల ఎకరాల్లో అటవీప్రాంతం

- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి కుడా ప్రణాళిక
- శరవేగంగా జరుగుతున్న సర్వే
- పర్యాటకుల కోసం సౌకర్యాల కల్పనకు చర్యలు
- అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ

7

అవి హనుమకొండ జిల్లా కేంద్రానికి 20 కిమీ దూరంలో ఉన్న ఇనుపరాతి గుట్టలు. వీటిని దేవునూరి గుట్టలని కూడా పిలుచుకుంటారు. ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో సుమారు 4,866.17 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ గుట్టలు ఎన్నో ఔషధ మొక్కలు.. రకరకాల చెట్లు, జంతువులకు ఆలవాలంగా ఉంది. అంతేకాదు ఇక్కడ విలువైన ఖనిజ నిక్షేపాలున్నట్టు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలోనే గుట్టలపై కన్నేసిన కొందరు వ్యక్తులు అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో ప్రకృతి అందాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం ఇనుపరాతి గుట్టలను ఎకోటూరిజం పార్క్‌గా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. కుడా ఆధ్వర్యంలో అటవీ ప్రాంత రూపురేఖలను మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది ఇందుకోసం ఈ ప్రాంతంలో సర్వే కూడా నిర్వహిస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే.. రాష్ట్రంలోనే అతిపెద్ద పార్క్‌గా ఆవిర్భవిస్తుంది.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

నిబంధనలు పాటిస్తేనే

అనుమతులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- భవన నిర్మాణ అనుమతుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ పరిధిలో నిర్మిస్తున్న భవన నిర్మాణాలు నిబంధనల ప్రకారం నిర్మిస్తేనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో నిర్మాణం జరుగుతున్న పలు కట్టడాలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. హంటర్‌రోడ్డు, కాకతీయ యూనివర్సిటీ, శ్రీసాయి కాలనీ, ఆరెపల్లి, ఖిలావరంగల్ మెట్టబావి ప్రాంతాల్లో బల్దియా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగర ప్రజలు ఇండ్ల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో టీజీ- బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు వివరాలను బట్టి అనుమతులు జారీ చేయడం జరుగుతుందన్నారు. నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తే భవన నిర్మాణాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో పాటు అనుమతులు మంజూరు చేయడం జరుగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీ రజితతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.


హంటర్‌రోడ్డులో నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

పోలీసుల కనుసన్నల్లో వర్సిటీ క్యాంపస్

విద్యార్థుల దాడుల నేపథ్యంలో బందోబస్తు ● త్వరలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ● విచారణ కమిటీ ఏర్పాటు ● డీన్లు, విభాగాధిపతులతో వీసీ, రిజిస్ట్రార్ సమావేశం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యార్థుల గొడవల నేపథ్యంలో క్యాంపస్‌లో పోలీసుల బందోబస్తును పెంచారు. కేయూ పరిపాలన అధికా రులు, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్ వర్సిటీ కామన్ మెస్, గణపతిదేవా-2 హాస్టల్‌తో పాటు ఇతర సమస్మాత్మక ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ ప్రత్యేక పోలీసుల బృందాలతో శనివారం వర్సిటీలో పర్యవేక్షించారు. శుక్రవారం వర్సిటీ క్యాంపస్‌లోని విద్యార్థులు మాటామాట పెరిగి పరస్పర దాడులకు దిగి గాయపడిన ఘటనలో పోలీసులు 22 మందిపై కేసులు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్‌తో విద్యార్థులను విడుదలయ్యారు. అయితే విద్యార్థులు పాత గొడవలు, దాడులను దృష్టిలో పెట్టుకుని క్యాంపస్‌లో మళ్లీ లొల్లి, దాడులకు దిగే అవకాశం ఉండటంతో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంల సూచనలతో వర్సిటీలో అధికారులు, పోలీసులు ప్రత్యేక నిఘా పెంచారు.


డీన్లు, విభాగాధిపతుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

విద్యార్థుల తల్లిదండ్రులతో త్వరలో సమేశం..

కాకతీయ యూనివర్సిటీలో గొడవలకు పరస్పరం దాడులకు పాల్పడిన విద్యార్థుల తల్లిదండ్రులతో త్వరలో వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. గొడవలతో వర్సిటీలో ప్రశాంత వాతావరణం దెబ్బతినడంతో పాటు ఇతర విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారుతున్న విషయాన్ని వారికి వివరించనున్నారు. ఉన్నత చదువుల కోసం క్యాంపస్‌కు వచ్చిన విద్యార్థులు గొడవలు పడి పోలీస్ కేసులతో జీవితాన్ని పాడుచేసుకోవడం, పోలీసు కేసుల దుష్ప్రభావాలను వారికి వివరించనున్నారు. కేయూ క్యాంపస్‌లో భోజనం చేసే క్రమంలో విద్యార్థులలో చోటు చేసుకున్న గొడవ, దాడులు, పోలీసు కేసులు విషయాలను వర్సిటీ ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిణించారు. అలస్యం చేయకుండా వర్సిటీ నిబంధనలను ఉల్లంగించి గీత దాటి దాడులకు దిగిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్‌తో పాటు మరో ఇద్దరూ, ముగ్గురితో విచారణ కమిటీని నియమించి వారు చేసిన సిఫార్సుల మేరకు చర్యలు తీసుకుంటామని వర్సిటీ అధికారులు ప్రకటించారు.

చైర్మన్ సహా ఏడుగురితో కమిటీ

యూనివర్సిటీలో దాడులకు పాల్పడిన ఘటనపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ చైర్మన్‌గా, సభ్యులుగా కేయూ ఆర్ట్స్, సోషల్ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ .జి.హన్మంతు, డీఫో, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, డాక్టర్ కె.సుజాత, క్యాంపస్‌కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్ మెంబర్, కన్వీనర్‌గా కమిటీని నియమించారు. కమిటీ వారం రోజుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమవేశం నిర్వహించి రిపోర్టును సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించాలని కోరారు.

అనధికారికంగా ఉంటున్న వారి ఏరివేతకు కసరత్తు..

వర్సిటీ క్యాంపస్‌లోని అన్నీ హాస్టల్‌లో అనధికారికంగా కొందరూ విద్యార్థులు తిష్టవేసినట్లు వర్సిటీ హాస్టల్స్ అధికారులు గుర్తించారు. విద్యార్థుల గొడవలు, దాడులలో నాన్ బోర్డర్ల పాత్ర ఉందని సమాచారం. శుక్రవారం జరిగిన దాడుల ఘటనలో ముగ్గురు నాన్ బోర్డర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నాన్ బోర్డర్లను తక్షణమే వర్సిటీలో ఏరివేసేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు చర్యలకు దిగారు. శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్ని హాస్టల్స్‌లో అనధికారికంగా ఉన్న నాన్ బోర్డర్లు వెంటనే ఖాళీ చేసి వేళ్ళిపోవాలని సర్క్యూలర్ జారీ చేశారు.

గొడవల నేపథ్యంలో వీసీ సమావేశం

వర్సిటీలో విద్యార్థుల గొడవల నేపథ్యంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు శనివారం కేయూ కమిటీ హాల్‌లో వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ఇతర జేడీలతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ విద్యార్థుల గొడవలను ప్రస్తావించారు. పూర్వపరాలను చర్చించారు. ఘటనపై వర్సిటీ అధ్యాప కులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కమిటీ నిర్ణయం మేరకు విద్యార్థులపై చర్యలుంటాయని వెల్లడించారు. నాన్ బోర్డర్లను ఖాళీ చేయించేందుకు పోలీసులతో చర్చిస్తామన్నారు. వర్సిటీలో సమస్మా త్మకమైన ప్రదేశాల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచుతామని చెప్పారు. క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండేలా చూడా లని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి. తిరుపతి , కేయూ స్కాలర్స్ అసోసియేషన్ నేత బాసికే నాగరాజుల నేతృత్వంలో విద్యార్థులు శనివారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందచేశారు.


వర్సిటీ క్యాంపస్‌లో బందోబస్తు పర్యవేక్షిస్తున్న కేయూ ఎస్సై శ్రీకాంత్ తదితరులు

రేపు అరుణాచలానికి.. సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు వరంగల్ -1 డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ. 3 వేలు కాగా, ఫిబ్రవరి 10న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయల్దేరుతుందని భక్తులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.ఇతర వివరాలకు సెల్ నంబర్లు: 99592 26047 /94941 07944 లకు సంప్రదించాలన్నారు.

మావోయిస్టులు నాపై ఆరోపణలు చేయడం తగదు

న్యాయవాది చిక్కుడు ప్రభాకర్

వరంగల్‌సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అజంజాహి మిల్లు కార్మికులకు సంబంధించిన భవనం, స్థలం గురించి వాస్తవాలు తెలుసుకోకుండా మావోయిస్టులు తనపై ఆరోపణలు చేయడం తగదని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అజంజాహి మిల్లు స్థలం వ్యవహారంలో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ స్థలం అమ్మినవారు, కొన్నవారు ఎవరో కూడా తనకు తెలియదని, నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో గాని, న్యాయవాద వృత్తిలో గాని ఎప్పుడూ ప్రజల వైపు నిలబడ్డానే తప్ప దోపిడీ వర్గాల వైపు ఎన్నడూ నిలబడలేదని పేర్కొన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు దిగమింగుదామని చూస్తే కాపాడింది తానేనని గుర్తుచేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రి, ఎర్రమంజిల్ భూములను కాపాడానని, గత రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేస్తే కార్మికులకు తాను అండగా నిలబడ్డానని తెలిపారు. అజంజాహి కార్మికులకు ఇండ్ల స్థలాల విషయంలో అత్యున్నత న్యాయస్థానంలో కార్మికుల పక్షాన పోరాడానని పేర్కొన్నారు. అజంజాహి మిల్లు కార్మిక భవనం, స్థలం అమ్మకం, కొనుగోలు విషయంలో విషయంలో మీరు వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేయడం వ్యక్తిగతంగా నాకు నష్టం కలిగించిందని, ఆ ప్రకటనపై మావోయిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కావ్యశ్రీరెడ్డి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన పిన్నింటి కావ్యశ్రీరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు నియామక పత్రం శనివారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తానన్నారు. తనకు సహకరించిన రాష్ట్ర కోఆర్డినేటర్ నీలం పద్మ, జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరకు కృతజ్ఞతలు తెలిపారు


నియామకపు పత్రం అందుకుంటున్న కావ్యశ్రీరెడ్డి

రేపు కేయూలో మహిళల ఆరోగ్యంపై సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం, వర్సిటీ మహిళ అధ్యాపకుల సంఘం, వాసవి ఆస్పత్రులు సంయుక్తంగా సోమవారం వర్సిటీలో మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి మెంబర్ ప్రొఫెసర్ ఎన్. ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సీజే శ్రీలత, ప్రొఫెసర్ జె. కృష్ణవేణి, డాక్టర్ బి. రాధికలు సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 10 సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఆరోగ్య కేంద్రంలో జరిగే ఉమెన్స్ వెల్‌నెస్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, హెల్త్ క్యాంపులో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు స్కాలర్స్, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

లా సెట్-25 ప్రవేశాల షెడ్యూల్ విడుదల

కేయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్-2025 ప్రవేశాల పరీక్షల షెడ్యూల్ శనివారం రాష్ట్ర ఉన్నతా విద్యామండలి సమావేశంలో విడుదల చేసినట్లు కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, టీఎస్-25 లా సెట్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతా విద్యామండలి కార్యాలయంలో జరిగిన లాసెట్ షెడ్యూల్ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా, లాసెట్ కమిటీ సభ్యులుగా సమావేశంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 25న లా సెట్-25 షెడ్యూల్‌ను విడుదల చేస్తారని, అలాగే మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. మే 25 వరకు ఆలస్య రుసుంతో ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. జూన్ 6న లాసెట్ ప్రవేశాల పరీక్ష జరుగుతోందని వెల్లడించారు. రాష్ట్ర ఉన్నతా విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం, ప్రొఫెసర్ మహ్మద్, సెక్రటరీ శ్రీరాంవెంకటేశ్, కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, లాసెట్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ జీబీ రెడ్డి, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ పాల్గొన్నారు.

అరూరికి ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ


అరూరి రమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను శనివారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ తూర్పు, పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయభాస్కర్, టి.రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లులో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, వాసుదేవరెడ్డి, గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్లు జన్ను శోభారాణి అనిల్, దివ్యరాణి నాయక్, రాధికారెడ్డి, జక్కుల రజిత, ఈదురు అరుణ, గుజ్జుల వసంత, మునిగాల సరోజన, మాజీ కార్పొరేటర్ శ్రీలేఖ, సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సోమయ్య, జఫర్‌గఢ్ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, కాట సుధాకర్, రాజేశ్‌నాయక్, మహేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

తల్లీకూతురు నుంచి గంజాయి పట్టివేత


గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్న ఎస్ఐ

రఘునాథపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తల్లీకూతరు కలిసి అక్రమంగా తరలిస్తున్న రూ.3.43లక్షల విలువైన 13కిలోల730 గ్రాముల గంజాయిని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం పట్టుకు న్నారు. పోలీసుల కథనం ప్రకారం. ఒరిస్సాకు చెందిన తల్లీకూ తుర్లకు శంకర్ అనే వ్యక్తి రెండు గంజాయి సంచులను ఇచ్చి సూరత్‌లో అప్పగిస్తే రూ.10వేలు ఇస్తానని ఒప్పందం కుదు ర్చుకున్నాడు. దాంతో ఈనెల 5న ఒరిస్సాలో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించాడు. తెనాలిలో దిగిన ఇద్దరు సూరత్‌కు వెళ్లేందుకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఒరిస్సా రాష్ట్రం గంజామ్ జిల్లా గంగాపూర్ మండలం మునిగడి కేసరపల్లి గ్రామా నికి చెందిన నవిత బిషోయితో పాటు ఆమె కూతురు మీనాకి బిషోయి ఇద్దరు కలిసి సూరత్‌కు ఎండు గంజాయితో ఉన్న రెండు బ్యాగులను శుక్రవారం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలను గమనించి, వెంటనే రైలు దిగారు. శనివారం సికింద్రబాద్‌కు వెళ్లే కాకతీయ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఇందులోనూ తనిఖీలు నిర్వహి స్తున్నారని తెలిసి రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో దిగారు. పక్కా సమాచరంతో ఎస్ఐ డి.నరేష్ నేతృత్వంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి తమ వద్ద ఉన్నట్లు ఒప్పుకున్నా రు. దాంతో నమిత బిషోయి,మీనాకి బిషోయిలపై కేసు నమోదు చేశారు.

ఘన్‌పూర్‌లో పట్టుబడ్డ మహిళ

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా 12కిలోల గంజాయిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ జి.వేణు తెలిపిన వివరాల ప్రకారంసూరత్‌కు చెందిన బిస్వాల్ విఎనంతి అనే మహిళ ఓరిస్సా రాష్ట్రంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి సూరత్‌కు తీసుకువెళ్లుతుంది. సూరత్‌కు వెళ్లే క్రమంలో ఓ రైలులో వచ్చి ఘన్‌పూర్ రైల్వే స్టేషన్‌లో దిగి స్టేషన్ బయటకు వచ్చింది. అప్పటికే స్టేషన్ ఎదుట ఉన్న పెట్రోలింగ్ పోలీసులకు చేతిలో బ్యాగుతో మహిళ అనుమానస్ప దంగా కనబడింది. వెంటనే ఆమెను పోలీసులు విచారించి, బ్యాగును తనిఖీ చేశారు. బ్యాగులో ప్యాక్‌చేసిన 12 కిలోల గంజాయి కనిపించింది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 21, 22 తేదీల్లో కేయూలో సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌తో కలిసి సదస్సు పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకట్ సదస్సు వివరాలను తెలిపారు. 'కోరిలేషన్స్ పాలిటిక్స్ అండ్ డెమోక్రసీ ఇన్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై సదస్సు జరుగుతోందని పేర్కొన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు, భారత సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్యం, జాతీయ ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలపై సదస్సులో కీలక ప్రతిపాదనలు చేస్తామని వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఐసీఎస్ఆర్, తెలంగాణ ఉన్నత విద్యామండలి, కేయూ యూజీసీ సహకారంతో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో మేధావులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థుల ందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగం బీవోఎస్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, సంజీవచ లక్ష్మినారాయణ, స్కాలర్స్ బి.నరసింహరావు, కేతపాక ప్రసాద్, రూబీనా, కళ్ళెపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విభాగంలో మార్చి 12, 13 తేదీల్లో

మార్చి 12, 13 తేదీల్లో కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు గోడపత్రికను శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రిన్సిపాల్ అమరవేణిలు ఆవిష్కరించారు. న్యూ అర్జెన్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21 సెంచరీ- చాలెంజేస్ అండ్ అపర్చూనీటిస్ అనే అంశంపై సదస్సు జరుగు తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి,డాక్టర్ ఫణింద్రకుమార్, డాక్టర్ ప్రగతి, ఏఆర్ డాక్టర్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆర్టీఏ.. అవినీతి మయం

(5వ పేజీ తరువాయి)

రవాణా శాఖాధికారులు డబ్బులు గుంజి.. తమ ఆస్తులు పెంచుకుంటున్నారు. అవినీతి అధికారుల ఆగడాలు పెచ్చుమీరిపోయి ఏసీబీ అధికారులకు చిక్కి జైలులో ఊచలు లెక్కపెడుతున్నారు. మహబూబాద్ జిల్లా ఎంవీఐ గౌస్‌పాషా అవినీతి శ్రుతిమించిందని, ఆస్తులు విచ్చలవిడిగా సంపాదించారని ఏసీబీ అధి కారులకు సమాచారం రావడంతో గతేడాది మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాల యాల్లో తనిఖీలు చేయగా గౌస్‌పాషా ప్రైవేట్ డ్రైవర్ నుంచి గౌస్ పాషాకు సంబంధించిన రూ2.94కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలింది. ఈ విషయంలో మాహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయం నుంచి ఆరుగురి వ్యక్తులపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అదే విధంగా పలు అవినీతి ఆరోపణలు నేపథ్యంలో మాహబూబాబాద్ ఆర్టీవో భద్రునాయక్‌ను హైదరాబాద్ ఆర్టీవోకు సరెండర్ చేసినట్టు సమాచారం.

ఖమ్మం జైలుకు డీటీసీ శ్రీనివాస్.. భారీగా ఆస్తుల గుర్తింపు..

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడని డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌పై వచ్చిన ఫిర్యాదులతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య శ్రీనివాస్ కిరాయికి ఉంటున్న హనుమకొండలోని ఇంటితో పాటు ఆయన కార్యాలయం, హైద్రాబాద్‌లోని సొంత నివాసం, సొంత ఊరైన జగిత్యాలలో శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులను కలిగి ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏసీబీ అధికారుల గుర్తించిన ఆస్తుల విలువ రూ.5కోట్లు ఉండగా మార్కెట్ విలువ ప్రకారం రూ.20కోట్ల వరకు ఉంటుందని అంచనా. హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాలలో తనిఖీలు చేయగా 15 ఎకరాల 20 గుంటల వ్యవసాయభూమితో పాటు, 16 ఓపెన్ ప్లాట్లు, బ్యాంకుల్లో సుమారు 6లక్షలు నగదు, అలాగే రూ.50 లక్షల విలువచేసే మూడు ఫోర్ వీలర్లు, ఒక టూ వీలర్ వాహనాలు, రూ.5.29 లక్షల విలువచేసే 23 విదేశీ మద్యం బాటిళ్లు, 20 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు పట్టుబడ్డట్టు తెలిపారు. కాగా మద్యం బాటిళ్ల పట్టుబడటంతో హైదరాబాద్ శంకర్‌పల్లి ఎక్సైజ్ పోలీసుల కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రంతా ఏసీబీ కస్టడీలో ఉన్న డీటీసీని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి.. న్యాయమూర్తి ఆదేశాలతో ఖమ్మం జైలుకు తరలించారు.

డీటీవో గంధం లక్ష్మి సస్పెన్షన్

ఖిలావరంగల్ : విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో వరంగల్ డీటీవో గంధం లక్ష్మిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. లక్ష్మి 2024 ఫిబ్రవరిలో విధుల్లో చేరగా.. గత నెలలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో తన కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని, ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తూ కలెక్టర్ సత్యశారదతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సీరియస్ అయిన కలెక్టర్ ఆమెకు షోకాజ్‌నోటీస్ ఇచ్చారు. దానికి సమాధానం ఇవ్వకపోగా నెల రోజులుగా లక్ష్మి తన కార్యాలయంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వరంగల్ అదనపు డీటీవోగా శోభన్‌బాబు



వరంగల్ డీటీవో గంధం లక్ష్మిని సస్పెండ్ చేసిన అధికారులు ఆమె స్థానంలో అదనపు డీటీవోగా ఆర్.శోభన్‌బాబును నియమించారు. దాంతో ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. 2024 మార్చి 20న వరంగల్ ఆర్టీవోలో ఎంవీఐగా బాధ్యలను స్వీకరించిన శోభన్‌బాబు వరంగల్ డీటీవోగా అదనపు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇనుపరాతి గుట్టల్లో.. ఎకో పార్క్



ఇనుపరాతి గుట్టలను అనుకొని ఉన్న ధర్మసాగర్ చెరువు మధ్యలోని ఐలాండ్

- నాలుగు వేల ఎకరాల్లో అటవీప్రాంతం
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి కుడా ప్రణాళిక
- శరవేగంగా జరుగుతున్న సర్వే
- పర్యాటకుల కోసం సౌకర్యాల కల్పనకు చర్యలు
- అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ

హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కేంద్రానికి 20 కి.మీ దూరంలో ఉన్న ఇనుపరాతి గుట్టలను (దేవునూరి గుట్టలు) ఎకో టూరిజం పార్క్‌గా అభివృద్ధి చేసేందుకు కసరత్తు మొదలైంది. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో ఈ గుట్టలు, వీటిని ఆవరించి ఉన్న అడవి ప్రాంతాన్నంతటినీ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సర్వే జరుగుతోంది. గుట్టలు, చుట్టూ అడవి ఎంత మేరకు ఉన్నది పరిధిని నిర్ధారించేందుకు కుడా, అటవీ శాఖ, సర్వే శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన జరుపుతున్నారు. ఎకో టూరిజం పార్క్‌లో ఏమేం ఉండాలనే దానిపై బ్లూ ప్రింట్‌ను తయారుచేసే బాధ్యతను ఓ కన్సల్టెన్సీ సంస్థకుఅప్పగించాలని యోచిస్తున్నారు. పార్క్ అభివృద్ధికి అయ్యే ఖర్చు, నిధుల సమీకరణపై కుడా అధికారులు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చారు. నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందా? లేక మొత్తం వ్యయం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భరిస్తుందా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. పరిస్థితులను బట్టి చూస్తే మొత్తం వ్యయం కుడానే భరించే సూచనలు కనిపిస్తున్నాయి. పర్యాటక శాఖ సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు.

కడియం శ్రీహరి చొరవ

ఇనుపరాతి గుట్టలను ఎకో టూరిజం పార్క్‌గా అభివృద్ధి చేసే విషయంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి పట్టుదలతో ఉన్నారు. ఈ ప్రతిపాదనను రాష్ట ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఇటీవల ఎకో పార్క్ విషయమై సంబంధిత అధికారులతో సూచన ప్రాయంగా చర్చించారు. దీనిపై సమగ్ర చర్చకు త్వరలోనే మంత్రి హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

నాలుగు వేల ఎకరాల్లో..


ఇపుపరాతి గుట్టలు ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో ఉన్నాయి. 4,866.17 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ గుట్టలను అటవీ రక్షిత ప్రాంతంగా, రిజర్వు ఫారెస్టుగా కూడా ప్రకటించాలని పర్యావరణ పరిరక్షణ సంస్థలు చాలా కాలంగా కోరుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక అటవీ ప్రాంతం ఇది. నిజాం కాలంలోనే దీన్ని అటవీ భూమిగా గుర్తించారు. వివిధ రకాల జంతువులు, ఔషధ మొక్కలు ఇందులో ఉన్నాయి. గుట్టపై విలువైన నిక్షేపాలు ఉండడంతో అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. దొంగచాటుగా ఇక్కడ మైనింగ్ జరుగుతోంది. పెద్ద ఎత్తున మట్టిని తవ్వుకపోతున్నారు. ఖని జాలను గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. ఈ గుట్టల్లో బలపాలొద్ది, తీగలొద్ది, జాలులా అనే మూడు జలపాతాలు కూడా ఉన్నాయి. ఈ నీటితో చుట్టు పక్కల ఉన్న దాదాపు 400 ఎకరాలు సాగవుతున్నది. దేవునూరు గ్రామ సమీపంలోని జాలు పక్కనే దాదాపు ఆరేడు ఎకరాల్లో బటర్‌ఫ్లై జోన్ ఉంది. ఇక్కడ వివిధ రకాల సీతాకోక చిలుకలు సందడి చేస్తుంటాయి. గుట్ట మీద మునుల విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ ఏటా కార్తీక పౌర్ణమి రోజు చుట్టు పక్కల ప్రజలు జాలు మల్లన్న జాతర నిర్వహిస్తుంటారు. పూర్వ కాలంలో ఇక్కడ ఏనుగులు సంచరించేవని చెబుతుంటారు. అందుకే ఇక్కడ ఏనుగుల మడుగు అనే ప్రాంతం ఉంది. ఒక ప్పుడు నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. ఇందుకు ఆనవాలుగా అమరవీరుల స్థూపం కనిపిస్తుంది. గుట్టల సమీపంలో దేవునూరు, దామెర, కొత్తపల్లి, ఎర్రబెల్లి, నరహరి తండా, ముత్తారం తదితర గ్రామాలు ఉన్నాయి.

పరుచుకున్న పచ్చదనం..

గుట్టల ప్రాంతాన్ని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంత కాలంలో ఇక్కడ 30 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం జరగ్గా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. అటవీ శాఖ ఈ స్థలంలో ప్లాంటేషన్ చేసింది. ఇపుపరాతి గుట్టల ప్రాంతం దట్టమైన చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పరిసరాలు ఎంతో మనోహరంగా ఉండి మనసుకు ఉల్లాసం కలిగిస్తాయి. ఈ గుట్టలను అనుకొని ధర్మసాగర్ చెరువు ఉండడంతో ప్రకృతి రమణీయత ఉట్టిపడుతుంటుంది. పర్యావరణ ప్రేమికులు దేవునూరి గుట్టను తరుచూ సందర్శిస్తుంటారు. తరుచూ ఇక్కడ ట్రెకింగ్ నిర్వహిస్తుంటారు. ఆమ్రపాలి కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఇపుపరాతి గుట్టలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కొంత మేరకు చొరవ చూపారు. ఇందులో భాగంగా ఇక్కడ అడవి మధ్యలో పర్యాటక శాఖ కొద్ది రోజులు నైట్ క్యాంపులను కూడా నిర్వహించింది.

ఎకో పార్క్..

ఎకో పార్క్‌లో భాగంగా మొదట ఒక బేస్ క్యాంపును ఏర్పాటుచేస్తారు. రోప్‌వేను నిర్మిస్తారు. ట్రెక్కింగ్ కోసం గుట్టల మధ్య నుంచి దారిని అభివృద్ధి చేస్తారు. నైట్ క్యాంపుల కోసం ప్రత్యేకంగా షెడ్డులను, వాటి చూట్టు రక్షణ కోసం పటిష్ఠమైన ఫెన్సింగ్‌ను, నైట్ క్యాంపులకు వీలుగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తారు. ఎకో పార్క్‌కు వచ్చిన వారు ఒకటి రెండు రోజులు విశ్రాంతిగా గడిపేందుకు గుట్టలపైన వెదురు హట్‌లను, లేదా శాశ్వతంగా హోటల్‌ను నిర్మిస్తారు. కెఫెటేరియాను అందుబాటులో ఉంచుతారు. పిల్లలు ఆడుకునేందుకు ప్లేజోన్‌ను, పెద్దల వినోదానికి వివిధ ఆటలకు సంబంధించిన కోర్టులను, పర్యాటకుల భద్రతకు పోలీస్ క్యాంపును ఏర్పాటు చేస్తారు. ధర్మసాగర్ చెరువును సుందరీకరిస్తారు. బండ్‌ను అభివృద్ధి చేస్తారు. చెరువులో విహారానికి బోటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తారు. మానసిక ప్రశాంతత కోసం ధ్యాన మందిరాన్ని, యోగా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇనుపరాతి గుట్టల ప్రాంతాన్ని ఎకో టూరిజం పార్క్‌గా అభివృద్ధి చేస్తే ఇది తెలంగాణలోనే అతిపెద్ద పార్క్ అవుతుంది. పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.



కనులవిందుగా ఇనుపరాతి గుట్టల పరిసరాలు

అభివృద్ధిపై కలెక్టర్ సమావేశం

ఇనుపరాతి గుట్టలను ఏకో టూరిజం పార్క్‌గా అభి వృద్ధి చేసే విషయమైన కలెక్టర్ ప్రావిణ్య గత నెల 31న సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్క్ ఏర్పాటుకు అధికారులు సమన్వయంతో పని చేయా లని కోరారు. అటవీ, రెవెన్యూ, కుడా అధికారులు కలిసి స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. స్థలాన్ని సాధ్యమైనంత త్వరగా కుడాకు అప్పగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అటవీ అధికారి లావణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్‌డీవో రమేష్ రాథోడ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు ఇనుపతి రాతి గుట్టలను ఏకో టూరిజం పార్క్‌గా తీర్చి దిద్దేందుకు తీసుకోవలసిన చర్యలను కలెక్టర్‌కు వివరించారు.

స్థానికానికి ముమ్మర కసరత్తు


- ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- ఈనెల 15లోపు సిబ్బందికి ఎన్నికల శిక్షణ పూర్తి
- ఇప్పటికే స్వతంత్రులకు కేటాయించే ఫ్రీ సింబల్స్ ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో తగ్గనున్న జీపీలు, ఎంపీటీసీలు..పెరుగనున్న జడ్పీటీసీ స్థానాలు
- మొత్తం 1,678 జీపీలు, 774 ఎంపీటీసీలు, 75 జడ్పీటీసీలు
- ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమవుతోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కావటంతో ప్రత్యేక పాలన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో లోకల్‌బాడీస్‌కు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించే ఫ్రీ సింబల్స్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బందిని గుర్తించి, ఈనెల 15వ తేదీన సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే తొలుత పార్టీ గుర్తుపై ఎన్నికలు జరిగే పరిషత్తు ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్త మునిసిపాలిటీలు, కొత్త మండలాల ఏర్పాటుతో జీపీలు, ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గనుండగా, జడ్పీటీసీ స్థానాలు పెరుగనున్నాయి. కాగా, స్థానిక సమరంలో తలపడేందుకు రెడీ అంటున్న ఆశావాహులకు రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది.

ఏర్పాట్లలో ఎన్నికల సంఘం..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. ఈనెల 10వ తేదీ లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు, పోలింగ్ సిబ్బందిని ఖరారు చేయాలని ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది. అలాగే 12వ తేదీలోపు ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు శిక్షణ ఇచ్చేందుకు టీవోటీ(ట్రైనర్స్ ఆఫ్ ట్రైనీస్)లు, మాస్టర్ ట్రైనీస్‌కు శిక్షణ ఇవ్వాలని, 15వ తేదీలోపు పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. అలాగే పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ప్రకటన 11వ తేదీన జారీ చేసి, అదే రోజు నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 14వ తేదీన పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే పరిష్కరించి, 15వ తేదీన పోలింగ్ బూత్‌ల తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీలకు సంబంధించిన ఫ్రీ సింబల్స్‌ను ప్రకటించగా.. జాతీయ, ప్రాంతీయ పార్టీల గుర్తులతో పాటు మరో 30 ఫ్రీ సింబల్స్‌ను కేటాయించింది. స్వతంత్రులుగా పోటీ చేసేవారు ఈ గుర్తులను ఎంపిక చేసుకోవచ్చు. జాతీయ, ప్రాంతీయ, రిజిస్టర్ పార్టీల గుర్తులు కాకుండా, ఇండిపెండెంట్ల కోసం ఎయిర్ కండిషనర్, ఆపిల్, పండ్ల బుట్ట, బెల్ట్, బైనాక్యులర్, కెమెరా, క్యారమ్ బోర్డు, చపాతీరోలర్, కోటు, ఫుట్‌బాల్ ఆటగాడు తదితర గుర్తులు కేటాయించారు. అలాగే గ్రామ పంచాయతీ, వార్డు సభ్యులకు పార్టీలరహితంగా ఎన్నికలు జరుగనున్నాయి. వీటికి కూడా గుర్తులు కేటాయించారు. రింగు, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడి పర్సు, టీవీ రిమోంట్, టూత్ పేస్టు, గౌను,



గ్యాస్ పొయ్యి, గ్యాస్ సిలిండర్, బీరువా తదితర గుర్తులను కేటాయించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు రంగంలోకి దిగారు. ఎన్నికల సిబ్బంది నియామకంతో పాటు పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. దీంతో ఈ నెల 15వ తేదీ తరువాత ఎప్పుడైనా స్థానిక సంస్థలకు ఎన్నికల నగారా మోగవచ్చనే ప్రచారం జరుగుతోంది.

పెరుగనున్న జడ్పీటీసీలు.. తగ్గిన జీపీలు, ఎంపీటీసీలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామపంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు భారీగా తగ్గనున్నాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా మూడు మునిసిపాలిటీలను ఏర్పాటు చేసింది. దీంతో మునిసిపాలిటీలుగా ఏర్పడిన గ్రామాలు, విలీనమైన గ్రామాలు పంచాయతీ హోదాతో పాటు ఎంపీటీసీ స్థానాలను కోల్పోనున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఇటీవల మునిసిపాలిటీగా ప్రకటించారు. కేసముద్రం మునిసిపాలిటీలో కేసముద్రం విలేజ్, టౌన్, అమీనాపురం, దన్నసరి, సబ్‌స్టేషన్ తండా పంచాయతీలు విలీనం కానున్నాయి. దీంతో మానుకోట జిల్లాలో 461 పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం 456 జీపీలకు తగ్గింది. అలాగే ఐదు ఎంపీటీసీ స్థానాలు కూడా రద్దు కానున్నాయి. దీంతో జిల్లాలో మొత్తం 193 ఎంపీటీసీలకు తగ్గనుంది. అలాగే వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీలో ఏడు గ్రామ పంచాయతీలను ఇటీవల విలీనం చేశారు. దీంతో వరంగల్ జిల్లాలో 323జీపీల నుంచి 316 పంచాతీలకు తగ్గనుండగా, ఎంపీటీసీలు కూడా నాలుగు తగ్గనున్నాయి. దీంతో వరంగల్‌లో 130 ఎంపీటీసీలకే పరిమితం కానున్నాయి. అలాగే జనగామ జిల్లాలో స్టేషన్‌ఘనపూర్ ఇటీవల మునిసిపాలిటీగా ప్రకటించారు. స్టేషన్‌ఘనపూర్‌తో పాటు శివునిపల్లి, చాగల్ పంచాయతీలను విలీనం చేశారు. దీంతో జనగామ జిల్లాలో పంచాయతీల సంఖ్య 279కి తగ్గగా, మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఆరు ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయి. దీంతో జిల్లాలో మొత్తం 122 ఎంపీటీసీ స్థానాలు ఉండనున్నాయి. అలాగే ములుగు జిల్లా కేంద్రం కూడా మునిసిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ములుగుతో పాటు ఇందులో విలీనమయ్యే నాలుగు పంచాయతీలు, నాలుగు ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయి. దీంతో ములుగు జిల్లాలో 170 జీపీలు, 83 ఎంపీటీసీ స్థానాలే ఉండనున్నాయి. ఇక మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి, సీరోలు, భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి, ములుగు జిల్లా మల్లంపల్లి కొత్తగా మండల కేంద్రాలుగా ఏర్పడ్డాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 71 జడ్పీటీసీలకు గాను, కొత్త మండలానికో జడ్పీటీసీ చొప్పున నాలుగు పెరుగటంతో ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 75కు చేరనున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 18 జడ్పీటీసీలు ఉండగా, ములుగులో అతితక్కువగా 10జడ్పీటీసీలే ఉండనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,678 జీపీలు, 774 ఎంపీటీసీలు, 75జడ్పీటీసీలున్నాయి. వీటికి తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజకీయ పార్టీల సింబల్‌తో పరిషత్ ఎన్నికలు జరుగనున్నాయి. వీటి ఫలితాల తరువాత పార్టీల రహితంగా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందనే టాక్ వినబడుతుంది. గత 2019 ఎన్నికల్లో ఆరు జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలను బీఆర్ఎస్ గెలుచుకుంది. కాంగ్రెస్ కూడా 2019 ఎన్నికలను పునరావృతం చేసి, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆశావహులకు రిజర్వేషన్ టెన్షన్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఉత్సాహంగా ఉన్న ఆశావాహుల్లో రిజర్వేషన్ టెన్షన్ పట్టుకుంది. పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా లేదంటే కొత్త రిజర్వేషన్లను అమలు చేస్తారా అనే ఉత్కంఠ నెలకొంది గత ప్రభుత్వం 10ఏళ్ల పాటు ఇవే రిజర్వేషన్లు ఉంటాయని గతంలో ప్రకటించింది. అయితే 2019 ఎన్నికల్లో బీసీలకు 22శాతమే రిజర్వేషన్ కల్పించారు. ఈసారి 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర బీసీ కులగణనలో బీసీలు 50శాతానికి పైగా ఉండటంతో ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లకు ఒకే చెప్పుతుందనే ప్రచారం జరుగుతుంది. దీంతో తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని జనరల్ సీటుపై ఆశపెట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కొత్తగా రిజర్వేషన్లు ప్రకటిస్తే, తమ సీటు ఏ వర్గానికి రిజర్వు కోటాలో వెళుతుందో అనే ఉత్కంఠ కూడా వారిలో కనిపిస్తోంది. ఇప్పటికే ఊళ్లలో స్థానిక ఎన్నికల జోష్ నెలకొనగా.. ఆశావాహులు నజరానాలతో ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే రిజర్వేషన్లు మారితే మాత్రం తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉన్నారు. మొత్తానికి ఈ నెల 15వ తేదీ తరువాత లోకల్ నగారా మోగుతుందనే జోష్‌లో ఆశావాహులున్నారు.





భక్తులతో సందడిగా ముక్తీశ్వరాలయం, శివలింగం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నేడే మహా కుంభాభిషేకం

- కాళేశ్వరానికి భారీగా తరలొస్తున్న భక్తులు
- రెండురోజుల పాటు వైభవంగా సాగిన హోమాలు, ప్రత్యేక పూజలు
- నేటి ప్రధాన ఘట్టంలో పాల్గొననున్న మంత్రులు సురేఖ, పొన్నం, శ్రీధర్‌బాబు



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు



ప్రవచనాలిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

మహదేవపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన భూపాల పల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాల యంలో ఆదివారం మహాకుంభాభిషేకం అట్టహసంగా జరగనుంది. శుక్రవారం ఈ వేడుకలు ప్రారంభ మవగా.. రెండోరోజైన శనివారం వేద పండితులు, అర్చకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించా రు. ప్రాతః సూక్త మంత్ర పఠనం, ప్రాతఃకాల పూజలు, చండీ పారాయణం, సహస్ర ఘటాభిషేకం, చండీహోమం, ప్రదోషకాల పూజలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద సేవలు జరిగాయి. ఈ మహత్కార్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన రుత్వికులు భాగస్వాములయ్యారు. మంచి ర్యాల జిల్లా అర్చనాపురం వేద పండితుడు మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది అర్చకులు పాల్గొంటున్నారు. కాళేశ్వరంలో 1982 ఫిబ్రవరిలో మహ కుంభాభిషేకం జరగ్గా 42 ఏళ్ల అనంతరం జరుగుతున్న ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో కాళేశ్వరానికి చేరుకుంటున్నారు. అయితే మహ కుంభాభిషేకంతో యంత్ర శక్తి పెరుగుతుందని భక్తులు నమ్ముతున్నారు. ఆదివారం ఉదయం 10.42 గంటలకు ఏపీలోని తుని తపోవన పీఠాదిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి నేతృత్వంలో నిర్వహించనుండగా.. ఆదివారం సాయంత్రంతో ఈ ఉత్సవం ముగియ నుంది. భక్తులు భారీగా తరలొస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఇక కుంభాభిషేకం మహ ఘట్టానికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారు. వారికి రాక నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశామని ఈవో మహేష్ తెలిపారు.

కాళేశ్వరం చేరుకున్న సచ్చిదానంద సరస్వతి

కాళేశ్వరానికి ఏపీలోని తుని తపోవన పిఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి శనివారం సాయంత్రం చేరుకున్నారు. ఆదివారం 10.42 గంటలకు జరిగే మహ కుంభాభిషేకం ప్రధాన ఘట్టం ఆయన చేతుల మీదుగా జరగనుంది. కాళేశ్వరం చేరుకున్న సచిదానంద స్వామికి వేదపండితులు మంత్రోచ్చరణలు, మహిళలు కోలాటాలు, మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ గర్భగుడిలో సచ్చిదానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. పానవట్టంపై ఉన్న లింగాలకు అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రవచనాలు బోధించారు. ఆలయ విశిష్టత, గోపురం తదితర అంశాలు వివరించారు. ముక్తీశ్వరుడిని పూజిస్తే ముక్తి లభిస్తుందన్నారు. మహ కుంభాభిషేకం చేయడం వల్ల ఆలయ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు ఆశీస్సులు ఇచ్చారు.





సచ్చిదానంద స్వామికి స్వాగతం పలుకుతున్న వేదపండితులు, ఆలయ సిబ్బంది, ఆలయం వద్ద పోలీసు బందోబస్తు

కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించి సోమవా రం కలెక్టరేట్‌కు వి నతులతో రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంసీపీఐ (యూ), ఆర్ఎంపీఐ కమ్యూనిస్టు కోఆర్డినేటర్ జాతీయ కమిటీ పిలుపు మేరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్న వర్గాల కోసమే పెట్టిందని దుయ్యబట్టారు. నిరసన ప్రదర్శనలో ఎంసీపీఐ (యూ), ఆర్ఎంపీఐ జిల్లా నేతలు నీల రవీందర్, వక్కల కిషన్, దామెరకొండ రమేష్, మట్టెడ మొగిలి, శ్రీకాంత్, శిరీష, సిద్దూ పాల్గొన్నారు.

హనుమకొండలో బీజేపీ సంబరాలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ గెలుపుపై హసన్‌పర్తిలో శనివారం బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై స్వీట్లు పంచి సంబురాలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకుడు పెద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుజ్జుల సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రైల్వే బోర్డు మెంబర్లు మేకల హరిశంకర్, దాసరి రాజు పాల్గొన్నారు.

మడికొండలో బీజేపీ శ్రేణుల సంబరాలు

మడికొండ, ఫిబ్రవరి 8(ఆంధ్ర జ్యోతి): ఆప్ పార్టీని చీపురుతో సహా ఊడ్చేసి 26 ఏండ్ల తర్వాత వికసిత్ భారత్‌కు జైకొట్టి బీజేపీకి ఢిల్లీ అధికార పీఠాన్ని అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మడికొండ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, నాయకులు బొల్లికొండ వినోద్‌కుమార్, దార ధనుంజయ్, ఎలగొండ శివ, మాచర్ల రంజిత్, వస్కుల మౌళి, బుర్ర నరేష్, పల్లకొండ రాజేందర్, గడ్డం కిరణ్, పండుగ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట : ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకుగాను శనివారం కాజీపేట చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణా సంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు చిర్ర నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన నాయకులు గిరి తిరుపతి, టి. కృష్ణం రాజు, బాలాజీ నాయక్, హరీష్ పాల్గొన్నారు.

● రాంనగర్ : ఢిల్లీ అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంపై హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ చౌరస్తాలో బాణ సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పగడాల కాశీప్రసాద్, రావుల సుదర్శన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు ముత్యాల శ్రీనువాస్, రవీందర్‌రెడ్డి, శ్రీనువాస్‌రావు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శనివారం కేయూలో విద్యార్థులు డిమాండ్ చేశారు. వర్సిటీ పరిపాలన భవనం ఎదుట బైఠాయించారు. కొద్దిసేపు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రం చాంబర్‌లో కలిసి తమ సమస్యలను విన్నవించారు. హాస్టల్స్‌లో వైఫై సౌకర్యాలను కల్పించాలని, పోటీ పరీక్షల దృష్ట్యా సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. న్యూ పీజీ హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక మెస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ విద్యార్థులను సముదాయించారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని విద్యార్థులకు చెప్పారు. పోటీ పరీక్షల షెడ్యూల్ వివరాలను అందచేసినట్లయితే పరీక్షల వాయిదాపై ఆలోచిస్తామని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల వద్దకు వచ్చారు. పోలీసులు ఏలాంటి గొడవలు తలెత్తకుండా జాగ్రలు వహించారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ



నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ

రెడ్డికాలనీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం హనుమకొండ చౌరస్తా నూతన కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించగా 124 ఓట్లు పోల్ కాగా మాజీ అధ్యక్షుడు కురిమిళ్ల రమేశ్‌కు 40 ఓట్లు, సింగారపు శ్యామ్‌కు 84 ఓట్లు లభించాయి. అధ్యక్షుడిగా సింగారపు శ్యామ్, గౌరవ అధ్యక్షులుగా తూముల సదానందం, శ్రీరాముల సుదర్శన్, గౌరవ సలహాదారుడిగా గజవెల్లి యాదగిరి, ఉపాధ్యక్షులుగా మొగిలిచర్ల ప్రసాద్, తక్కెళ్లపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా జంపాల వేణు, కోశాధికారిగా చందర్లపాటి మణికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎనగందుల సతీష్, జంపాల సుధాకర్, సభ్యులుగా వంగపల్లి హరీష్, మురహరి రాకేశ్, జంపాల రాజయ్య ఎన్నికయ్యారు.

స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన

మడికొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మడికొండలోని పలు కాలనీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బల్దియా అధికారులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వాల్మీకి నగర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిందర్, జవాన్ మల్లయ్య ప్రజలతో సమావేశమై తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి విడివిడిగా మున్సిపల్ సిబ్బందికి అందించాలని తెలిపారు. వీలైనంత మేరకు తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసుకోవాలని అలాగే పొడి చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'ను సక్సెస్ చేయడమే ధ్యేయం

● బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి

● మోడల్ డివిజన్‌లలో స్వచ్ఛతా కార్యక్రమాలు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్‌లలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అన్ని ప్రాంతాలలో శానిటేషన్ సమస్య లేకుండా చేస్తామని బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని 6, 26, 49 డివిజన్‌లలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు నిర్వహించారు. వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. పైలెట్ ప్రాజెక్ట్ కింద ముందుగా ఎంపిక చేసిన మూడు డివిజన్‌లలో పూర్తి స్థాయి శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ -2025 లో భాగంగా సూల్ విద్యార్థులకు, నగర ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విడతల వారీగా ఆయా డివిజన్‌లలో బల్దియా బృందాలు పర్యటిస్తాయని, సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించడం జరుగుతుందని గుర్తు చేశారు. తడి చెత్తనే కంపోస్ట్ యూనిట్‌కు పొడి చెత్తను డీఆర్‌సీసీ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. ఇంకా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా వ్యాధులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్‌తో పాటు జవాన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రామన్నపేటలో అవగాహన కల్పిస్తున్న బల్దియా సిబ్బంది


మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దంత వైద్య పరీక్షలు



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఫ్లోరా డెంటల్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. మానసిక దివ్యాంగులైన చిన్నారులు సొంతంగా దంతాలను శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోరా డెంటల్ కేర్ వైద్యులు ముక్తిక ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తన, మాజీ కార్పొరేటర్ కేశిరెడ్డి మాధవరెడ్డి, ప్రొఫెసర్ పద్మ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు బండ రామలీల, కోడం కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా ఉడుమల బాల



కాజీపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 13 సంత్సరాలు వరంగల్ డయాసిస్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన ఉడుమల బాలను విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా ఎంపిక చేస్తూ ఇటలీ నుంచి పోప్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లా జాఫర్‌ఘడ్ మండలం గూడూరుకు చెందిన డా. ఉడుమల బాలశౌరి రెడ్డికి ఇద్దరు తమ్ముళ్లు, ఐదుగురు అక్క, చెల్లెలు. ఈయన 1979- 80 డోర్నకల్ చర్చి, 80- 87 వరకు ఖమ్మం, ప్రొద్దుటూరు, చెరువుమాదారం చర్చిలో ఫాదర్‌గా పనిచేశారు. 87-90 వరకు హైదరాబాద్ సేయింట్ జాన్స్ సెమినరీ ట్రెజరర్‌గా పనిచేశారు. 90- 94 వరకు ఇటలీ రోమ్‌లో ఉన్నత చదువులు చదివారు. 94- 2006 హైదరాబాద్‌లో తర్వాత బెంగళూరు డయాసిస్‌లో వివిధ విభాగాల్లో పనిచేశారు. 2013 నుంచి 2025 వరకు వరంగల్ డయాసిస్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేస్తూ ప్రస్తుతం విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా ఎంపికయ్యారు. ఆయనను శనివారం సాయంత్రం ఫాతిమాచర్చిలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో అభినందించారు. ఆయన హయాంలో వరంగల్‌లో ఫాదర్ కొలంబో మెడికల్, ప్యారా మెడికల్, నర్సింగ్ కళాశాలలు సాధన, మెడికేర్ ఆసుపత్రి నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషిచేసినట్లు క్రైస్తవసంఘాలు బాధ్యులు తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమ లక్ష్యాలను వంద శాతం సాధించాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవాఖానా, బస్తీ దవాఖాన వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో సాధించిన ప్రగతిపై పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రోగ్రాంల వారిగా ఎక్కడ వెనుకబడి ఉన్నారో అందుకు కారణాలు తీసుకొని ఏఎన్ఎంలు, ఆశల వారీగా సమీక్షలు నిర్వహించాలన్నారు. అందరూ వైద్యాధికా రులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. మాతా, శిశు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు 12 వారాలలోపే గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ప్రతీ రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలు ప్రతి రోజు నమోదు చేయాలన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీల వారిగా లింగ నిష్పత్తి రేట్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ నెల 10న నిర్వహించాల్సిన నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్‌రావు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇఫ్తాదర్ అహ్మద్, డాక్టర్ మంజుల, వి.అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

పెంబర్తిలో కుక్కల స్వైర విహారం

మహిళకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన మహిళ

హసన్‌పర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంబర్తిలో కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతోందని ప్రజలు భయాందోలనకు గురవుతున్నారు. శనివారం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ చిర్ర అండమ్మ కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా కొంత మంది కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రుల పాలైనట్లు పలువురు ఆవేదనకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా కుక్కల దాడిలో గాయపడిన బాధితురాలికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనలో కడియం పాత్ర కీలకం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధనలో మాజీ డిప్యూటీ సీఎం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర ఎంతో కీలకమైందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ నివేదిక అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కడియం శ్రీహరిని కలిసిన వారిలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్కపల్లి రాజేందర్ మాదిగ, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపల్లి సుధాకర్, అరూరి సాంబయ్య, తాళ్లపల్లి మేరి, భీమా వినయ్, మహేందర్ ఉన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జనవరి 26న న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు శనివారం వర్సిటీ క్యాంపస్‌లో అభినందించారు. 10 (బీ) బీఎన్ ఎన్‌సీసీ ఆర్మీకంపెనీతో పాటు వివిధ ఈవెంట్లలో క్యాడెట్లు, అధికారులు బి. ప్రశాంత్, ఎం. భవన, కె.నివేదిత, డి. దినేశ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, డాక్టర్ స్వామి, ప్రసాద్, డీన్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ డిమాండ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టి.లింగారెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, భోగేశ్వర్‌లు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రకటించడం జరిగిందన్నారు. కానీ అందుకు భిన్నంగా విద్యారంగానికి 7.3 శాతం మాత్రమే నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఎం.గంగాధర్, రమేశ్; రవీందర్, బి.నర్సిం గరావు, కె.శ్రీనివాస్, సత్యనారాయణ, అశోక్, గోవిందరావు, యాక య్య పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ నేతలు

సాంస్కృతిక ఉత్సవాన్ని జయప్రదం చేయాలి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి దివ్యాంగుల సాంస్కృతిక ఉత్సవాన్ని జయప్రదం చేయాలని విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి.మహేందర్ కోరారు. దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపడం, వారి కళలను ప్రోత్సహించే ఆశయంతో ఉభయ తెలుగు రాష్ట్రాల దివ్యాంగ కళాకారులతో సాంస్కృతిక ఉత్సవం - 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో గణేష్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కళాకారులు ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వయో వృద్ధులకు తగిన ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో వైవి.గణేష్

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి) : వయో వృద్ధులకు తగిన ప్రాధాన్యమివ్వాలని డీఆర్‌వో వైవి.గణేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి వయో వృద్ధుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వయోవృద్ధులకు ప్రాధాన్యం, ప్రత్యేక సేవలు అందించాలన్నారు. ప్రతీ గురువారం ఎంజీఎం ఆస్పత్రిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ సేవలు అందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ క్షమాదేశ్‌పాండే, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డాక్టర్ గౌతమ్ చౌహాన్, ఇఫ్తాకర్ అహ్మద్, రవికృష్ణ, అనితారెడ్డి, యుగంధర్, నరసయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సర్వేలో మున్నూరుకాపులకు అన్యాయం


సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. దేవయ్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల సర్వేలో మున్నూరుకాపులకు తీరని అన్యాయం జరిగిందని మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గైనేని రాజన్ మాట్లాడారు. అన్ని బీసీ కులాలలో జనాభాను తగ్గించినట్లుగానే మున్నూరుకాపు జనాభాను తగ్గించారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా అడ్డువచ్చేది మున్నూరు కాపులే కాబట్టి వారిని రాజకీయంగా దెబ్బతీయడానికి జనాభాను తగ్గించి చూపించారని ఆరోపించారు. రెడ్డి, వెలమ కులస్థులు 8 శాతం జనాభా కంటే తక్కువ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం 13 శాతం పెంచి జనాభాను చూపించిందని దుయ్యబట్టారు. మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి సమస్యల ప రిష్కారానికి పోరాడాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కటకం పెంటయ్య, కనుకుంట్ల రవికుమార్, బండి కుమారస్వామి, పి. కుమారస్వామి, పి. సత్యనారాయణ, బి. రాజ్‌కుమార్, కె.సృజన్‌కాంత్, కె. కనకరాములు, మనోజ్, సతీష్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కొండా దేవయ్య

క్రీడలతోనే సత్ప్రవర్తన అలవడుతుంది : ఎస్సై



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రవి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే క్రమశిక్షణతో పాటు సత్ప్రవర్తన అలవడుతుందని హసన్‌పర్తి ఎస్సై రవి అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీల ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలు బానిసలు కాకుండా సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు బానిలై తమ విలువైన జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సత్ప్రవర్తన కలిగిన యువకులుగా తీర్చిదిద్దేందుకు గురువులతో సమన్వయం చేసుకునేవిధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం పూర్వ వాలంటీర్ మండ రాజేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునిత, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు పార్థసారథి, వాసుదేవరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, ఎరుకల కార్పొరేషన్‌కు రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి లంబాడ, కోయ, గోండు తెగలకు మాత్రమే అధిక ప్రాధాన్యతనిస్తూ ఆదివాసీ ఎరుకల జాతిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ట్రైకార్ సంస్థకు 2024 -25 సంవత్సరానికి గాను రూ. 360 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే ఇప్పటి వరకు ఎరుకల సమాజానికి ఒక్క రూపాయి కూడా అందలేదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కొంత మేరకు ఎరుకల జాతికి న్యాయం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆదివాసీ ఎరుకల జాతిని గుర్తించి గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అభ్యర్థిని ప్రకటించినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల అవకాశం రాకుండా పోయిందన్నారు. టీపీసీసీ నేత రాయపురం సాంబయ్య మాట్లాడుతూ ఎరుకల సమాజాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మానుపాటి రమేష్, లోకిని చందర్, పులిచేరు రవీందర్, దేవరాయ సమ్మయ్య, కోనేటి సమ్మయ్య, ఓని సదానందం, పాలకుర్తి నారాయణ, పల్లకొండ సతీష్, పులిచేరి సారయ్య, కూతాటి శ్రీనివాస్, కేతిరి సుభాష్, అంగడి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకిని రాజు, రాయపురం సాంబయ్య

కటక్‌లోనే కొట్టేస్తారా?

సిరీస్ లక్ష్యంగా టీమిండియా

ఒత్తిడిలో ఇంగ్లండ్

నేడు రెండో వన్డే



బరిలో కోహ్లీ

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కటక్: ఓవైపు కెప్టెన్ రోహిత్ శర్మ వైఫల్యంతో ఆందోళన నెలకొనగా, మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రాకతో తుది కూర్పు ఎలా? అనే తర్జనభర్జన పడుతోంది టీమిండియా. ఈనేపథ్యంలో సిరీసే లక్ష్యంగా ఆదివారం ఇంగ్లండ్‌తో రెండో వన్డే బరిలోకి దిగబోతోంది. ఇప్పటికే నాగ్‌పూర్‌లో ఘన విజయంతో భారత్ 1-0 ఆధిక్యంలో ఉండడంతో సిరీస్ పట్టేందుకు మన జట్టుకు మరో విజయం చాలు. ఇక, పేలవ ఆట తీరుతో విమర్శలపాలవుతూ తీవ్ర ఒత్తిడిలో ఉన్న బట్లర్ సేనకు ఇది కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్. అందుకే ఎలాంటి అలక్ష్యం లేకుండా ఆ జట్టు ఆటగాళ్లంతా సత్తా నిరూపించుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇదిలావుండగా కటక్‌లో ఆడిన 17 వన్డేల్లో భారత్ 13 గెలిచింది. అలాగే 2003 నుంచి ఇక్కడ జరిగిన ఏడు మ్యాచ్‌ల్లోనూ జట్టుకు ఓటమి లేకపోవడం విశేషం.

జైస్వాల్ అవుట్!



మోకాలి గాయంతో తొలి వన్డేకు దూరమైన విరాట్ కోహ్లీ రెండో మ్యాచ్‌లో ఆడడం ఖాయమే. అతను ఫిట్‌గానే ఉన్నాడని టీమిండియా బ్యాటింగ్ కోచ్ కోటక్ కూడా స్పష్టం చేశాడు. అయితే విరాట్ రాకతో జట్టులో చోటు కోల్పోయేదెవరనేది చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే.. కోహ్లీ స్థానంలో నాగ్‌పూర్‌లో బరిలోకి దిగిన శ్రేయాస్ అయ్యర్ మెరుపు అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అసలే ఫామ్‌లో లేని విరాట్ కోసం ఇప్పటికిప్పుడు అయ్యర్‌ను తొలగించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇప్పుడందరి చూపు ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌పై పడనుంది. పైగా నాగ్‌పూర్‌లో వన్డే అరంగేట్రం చేసిన అతను 15 పరుగులే చేశాడు. దీంతో విరాట్ కోసం జైస్వాల్ పక్కకు తప్పుకోక తప్పదేమో! అదే జరిగితే రోహిత్‌కు జతగా తిరిగి గిల్ ఓపెనింగ్ చేయనున్నాడు. కానీ కోచ్ గంభీర్ వ్యూహమైన కుడి-ఎడమ కాంబినేషన్ మిస్ అవుతుంది. ఒకవేళ శ్రేయాస్‌నే తప్పిస్తే గిల్ వన్‌డౌన్‌లో, విరాట్ నెంబర్-4లో ఆడతాడు. మరోవైపు విరాట్ వీలైనంత త్వరగా ఫామ్‌ను అందుకోవాల్సి ఉంది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు అతడికి రెండు వన్డేలు మాత్రమే మిగిలాయి. అందుకే కటక్‌లో తానేంటో నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోహిత్ ఈసారైనా..



ఫార్మాట్ ఏదైనా కెప్టెన్ రోహిత్ మాత్రం విఫలమవుతూనే ఉన్నాడు. తొలి వన్డేలో రెండు పరుగులే చేసి వెనుదిరిగాడు. గతేడాది ఆగస్టు నుంచి ఏ ఫార్మాట్‌లోనూ అతడు కనీసం అర్ధసెంచరీ చేయకపోవడం గమనార్హం. షాట్ల ఎంపికలోనూ ఆత్మవిశ్వాసం లోపిస్తోంది. మిగిలిన రెండు వన్డేల్లోనూ విఫలమైతే అతడి వన్డే భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నట్టే. బౌలింగ్ విభాగం మాత్రం పటిష్టంగా కనిపిస్తోంది. కమ్‌బ్యాక్ పేసర్ షమి అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. తొలి మ్యాచ్‌లో అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా ఆదిలో పరుగులిచ్చుకున్నా ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను గట్టి దెబ్బ తీశాడు. కానీ మ్యాచ్ ప్రాక్టీస్ కోసం అతడి స్థానంలో మరో పేసర్ అర్ష్‌దీప్‌ను ఆడించే అవకాశం ఉంది. స్పిన్నర్లు జడేజా, అక్షర్ ప్రభావం చూపిస్తున్నారు. కుల్దీప్ కూడా మెరుగ్గా రాణిస్తే ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేయవచ్చు.

చావోరేవో..




ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ చావోరేవోలాంటిది. ఇందులోనూ ఓడితే వరుసగా రెండు సిరీస్‌ల ఓటమితో చాంపియన్స్ ట్రోఫీ ముందు జట్టు ఆత్మవిశ్వాసం సన్నగిల్లే అవకాశం లేకపోలేదు. ప్రతీ బంతిని బాదే ఉద్దేశంతో కాకుండా ఇంగ్లండ్ ఆటగాళ్లు ప్రత్యర్థి జట్టు నాణ్యమైన స్పిన్నర్లను వ్యూహాత్మకంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముందు ఎవరో ఒకరు క్రీజులో నిలదొక్కుకుంటే మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లవచ్చు. కానీ కోచ్ మెకల్లమ్ ఆధ్వర్యంలోని ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌నే ఎక్కువగా నమ్ముకుంటోంది. సాల్ట్, డకెట్, బ్రూక్, బట్లర్ రాణిస్తున్నా.. లివింగ్‌స్టోన్, రూట్ బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. పేసర్ సకీబ్ స్థానంలో ఉడ్ ఆడే అవకాశం ఉంది. గెలిచి తీరాల్సిన ఈ మ్యాచ్‌లో భారత్‌కు చెక్ పెట్టేందుకు ఇంగ్లండ్ ఎలాంటి ప్రణాళికలతో ఆడనుందో చూడాలి.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, శ్రేయాస్, రాహుల్, అక్షర్, హార్దిక్, జడేజా, రాణా/అర్ష్‌దీప్, కుల్దీప్, షమి.

ఇంగ్లండ్: సాల్ట్, డకెట్, రూట్, బ్రూక్, బట్లర్ (కెప్టెన్), బెథెల్, లివింగ్‌స్టోన్, కార్స్, రషీద్, ఆర్చర్, సకీబ్/ఉడ్.

పిచ్



ఆరేళ్ల క్రితం ఇక్కడ జరిగిన చివరి వన్డేలో వెస్టిండీస్‌పై భారత్ 316 పరుగులను ఛేదించింది. ఆ మ్యాచ్‌లో విరాట్, రోహిత్, రాహుల్ హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈసారి కూడా పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. కానీ మంచు ప్రభావంతో.. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే చాన్స్ ఉంది. బౌలింగ్‌లో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారు.

నాకౌట్‌కు గుకేష్

ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్

వీసెన్‌హాస్ (జర్మనీ): వరల్డ్ చాంపియన్ గుకేష్ ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీ నాకౌట్‌కు చేరాడు. అయితే శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్ చివరి, తొమ్మిదో గేమ్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో భారత గ్రాండ్‌మాస్టర్ ఓడిపోయాడు. హోరాహోరీ పోరులో నల్లపావులతో ఆడిన మాగ్నస్ 46 ఎత్తుల్లో గుకేష్‌పై గెలుపొందాడు. ఇక తొమ్మిది రౌండ్లలో..రెండింటిలో ఓడిన గుకేష్ ఏడు గేమ్‌లు డ్రా చేశాడు. క్వాలిఫయింగ్ తొమ్మిది గేమ్‌ల ద్వారా మొత్తం 3.5 పాయింట్లు సాధించిన గుకేష్ నాకౌట్‌కు క్వాలిఫై అయ్యాడు. రౌండ్ రాబిన్‌లో తలపడిన మొత్తం 10 మంది ఆటగాళ్లలో గుకేష్, కార్ల్‌సన్ సహా ఎనిమిదిమంది నాకౌట్‌కు అర్హత సాధించారు.

స్ప్రింటర్ నిత్యకు రజతం

వాటర్ స్పోర్ట్స్‌లో ఆంధ్ర జట్టుకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ యువ స్ప్రింటర్ జి. నిత్య జాతీయ క్రీడల్లో రజత పతకంతో మెరిసింది. ఇక, వాటర్ స్పోర్ట్స్‌లో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు కాంస్య పతకం దక్కించుకొంది. డెహ్రాడూన్‌లో శనివారం జరిగిన మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో నిత్య 11.79 సెకన్లలో రేసును పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. వాటర్ స్పోర్ట్స్ డౌన్ రివర్ పురుషుల ఈవెంట్‌లో సచిన్, అఖిలేష్, ప్రకాష్, రాజ్ కుమార్, వినీత్ కుమార్‌లతో కూడిన ఏపీ బృందం 33 నిమిషాల 38.975 సెకన్లలో రేసును పూర్తి చేసి మూడోస్థానంలో నిలిచింది. ప్రస్తుతానికి పట్టికలో ఏపీ 10 పతకాలతో 19వ స్థానంలో నిలవగా.. తెలంగాణ 7 పతకాలతో 29వ స్థానంలో కొనసాగుతోంది.

రన్నరప్ సాకేత్ జోడీ



చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ సాకేత్ మైనేని/రామ్‌కుమార్ రామనాథన్ జోడీ చెన్నై ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయింది. శనివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో తెలుగు కుర్రాడు సాకేత్, చెన్నైకి చెందిన రామ్ ద్వయం 4-6, 4-6తో జపాన్ జంట షింటారో మొచిజుకి/కైటో యుస్‌యుగి చేతిలో ఓటమిపాలైంది. సింగిల్స్‌లో అన్‌సీడెడ్ ఎలియాస్ మెర్ (స్వీడన్), కిరియాన్ జాక్వెట్ టైటిల్‌ఫైట్‌కు సిద్ధమయ్యారు.

ఇక నుంచి.. జూనియర్లకు నజరానాల్లేవ్!

న్యూఢిల్లీ: దేశంలోని జూనియర్ అథ్లెట్లకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. జూనియర్ స్థాయి క్రీడాకారులు అంతర్జాతీయ పతకాలు సాధించినా, వారికి ఇక నుంచి ఎటువంటి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చేది లేదని క్రీడా మంత్రిత్వ శాఖ తేల్చిచెప్పింది. ఆ మేరకు సవరణలు చేసిన పాలసీ ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. క్రీడారంగంలో పెడ ధోరణులుగా మారిన డోపింగ్, వయసుకు సంబంధించిన అవకతవకలకు చెక్ చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ప్రభుత్వం తెలిపింది. గత పాలసీ ప్రకారం జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధిస్తే రూ. 13 లక్షలు, ఆసియా, కామన్వెల్త్ క్రీడల విజేతలుగా నిలిస్తే రూ. 5 లక్షలు నజరానాగా ఇచ్చేవారు. జూనియర్ ఈవెంట్లు అనేవి పతకాల కోసం కాదు.. అథ్లెట్ల వికాసం కోసమేననే ఉద్దేశాన్ని తెలియజెప్పడమే ఈ నిర్ణయం వెనుకనున్న ప్రధాన ఉద్దేశమని ఓ అధికారి చెప్పాడు. 'భారత్‌లో మాత్రమే జూనియర్ అథ్లెట్లకు అనవసరమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫలితంగా వారు చిన్న వయసులోనే విపరీతంగా సాధన చేస్తున్నారు. ఎలిట్ స్థాయికి చేరుకొనే సరికి అలసి పోవడమో లేదా వారిలో ఆసక్తి చచ్చిపోవడమో చూస్తున్నామ'ని సదరు అధికారి వివరించాడు.

పాక్‌పై కివీస్ గెలుపు

లాహోర్: ముక్కోణపు సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి వన్డేలో పాకిస్థాన్‌పై 78 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా కివీస్ జట్టు.. గ్లెన్ ఫిలిప్స్ (106 నాటౌట్) అజేయ శతకంతో 50 ఓవర్లలో 330/6 పరుగుల భారీ స్కోరు సాధించింది. మిచెల్ (81), విలియమ్సన్ (58) అర్ధసెంచరీలు సాధించారు. షహీన్ 3 వికెట్లు తీశాడు. ఛేదనలో పాక్ 47.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఫఖర్ జమాన్ (84), సల్మాన్ ఆఘా (40) రాణించారు. శాంట్నర్, హెన్రీకి మూడేసి వికెట్లు దక్కాయి.

స్వల్ప ఆధిక్యంలో లంక

గాలె: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక 54 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసేసరికి లంక రెండో ఇన్నింగ్స్‌లో 211/8 స్కోరు చేసింది. ఏంజెలో మాథ్యూస్ (76) ఆకట్టుకున్నాడు. క్రీజులో కుశాల్ మెండిస్ (48) ఉన్నాడు. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 414 పరుగులకు ఆలౌటైంది. క్యారీ (156), స్మిత్ (131) భారీ శతకాలు సాధించారు. ప్రభాత్‌కు 5, నిషాన్‌కు 3 వికెట్లు దక్కాయి. లంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగులు చేసింది.

జింబాబ్వే లక్ష్యం 292

బులవాయో: ఐర్లాండ్‌తో ఏకైక టెస్ట్‌లో 292 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన జింబాబ్వే మూడో రోజు ఆఖరికి 38/3 స్కోరుతో కష్టాల్లో పడింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 83/1 స్కోరుతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 298 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 260, జింబాబ్వే 267 రన్స్ చేశాయి.

టీపీఎల్‌కు పచ్చ జెండా

- ప్రతి జిల్లాకు రూ.కోటి అభివృద్ధి నిధి
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభ గల యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)ను నిర్వహిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు వెల్లడించాడు. శనివారం ఉప్పల్ స్టేడియంలో జగన్‌మోహన్ అధ్యక్షతన అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. 'ఐపీఎల్ అనంతరం యువ క్రికెటర్ల కోసం టీపీఎల్ నిర్వహణ పనులు ప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి రూ.కోటి ఖర్చు చేయనున్నాం. కొత్త స్టేడియాలను నిర్మిస్తాం. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో సత్తా చాటిన రాష్ట్ర క్రికెటర్లను సత్కరించేందుకు వచ్చే మార్చిలో హెచ్‌సీఏ అవార్డుల వేడుక నిర్వహిస్తాం' అని జగన్‌మోహన్ తెలిపాడు. సమావేశంలో కార్యదర్శి దేవ్‌రాజ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ప్లస్

నయా ఫండ్స్

బజాజ్ ఫిన్‌సర్వ్ మల్టీ క్యాప్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. మల్టీ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. నిఫ్టీ 500 మల్టీక్యాప్ 50:25:25 టీఆర్ఐ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ముగింపు తేదీ ఈ నెల 20.

ఐటీఐ భారత్ కంజంప్షన్ ఫండ్

ఐటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. ఐటీఐ భారత్ కంజంప్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. వినియోగం, ఇతర అనుబంధ రంగాల్లో ఉన్న కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 20.

ఇన్వెస్కో ఇండియా బిజినెస్ సైకిల్ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇండియా బిజినెస్ సైకిల్ ఫండ్ పేరుతో కొత్త ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకాన్ని తీసుకువచ్చింది. వివిధ రంగాల్లో కీలకంగా ఉన్న కంపెనీల్లోని ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. నిఫ్టీ 500 టీఆర్ఐ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ 20. కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో అయితే కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	450
చిత్తూరు	493	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 72	

అనవసర ఖర్చులు వద్దు..!

ఇటీవలి కేంద్ర బడ్జెట్ సామాన్యులకు పెద్దగా న్యాయం చేయలేక పోయినప్పటికీ.. మధ్య తరగతికి ముఖ్యంగా ఉద్యోగులకు మాత్రం పెద్ద మేలే చేసింది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారు చిల్లి గవ్వ కూడా ఆదాయ పన్ను (ఐటీ) భారం లేకుండా బయటపడొచ్చు.

పన్ను ఆదా సొమ్ముతో సంపద పెంచుకోండి..

దీర్ఘకాలిక పెట్టుబడులే ముద్దు



మిగులు ఎంతంటే..

బడ్జెట్ ప్రతిపాదనలతో రూ.12 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి రూ.83,200, రూ.15 లక్షల వార్షికాదాయం ఉన్నవారికి రూ.32,500 చొప్పున పన్ను భారం తగ్గుతుంది. అదే రూ.24 లక్షల వార్షికాదాయం ఉంటే రూ.1.14 లక్షలు, రూ.కోటి ఆదాయం ఉంటే రూ.1,25,840 చొప్పున, రూ.5 కోట్ల వరకు ఉంటే రూ.1.43 లక్షల వరకు పన్ను భారం తగ్గుతుంది. పన్ను పోటు తగ్గింది కదా అని.. మిగిలిన నాలుగు డబ్బుల్ని విచ్చలవిడిగా ఖర్చు చేయడం మంచిది కాదు. ఈ కొద్ది మొత్తాన్ని కూడా దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు వీలుగా మంచి పెట్టుబడి సాధనాల్లో మదుపు చేయడం ఆయా వ్యక్తుల ఆర్థిక భద్రతకు మంచిది.

జర జాగ్రత్త

పైన పేర్కొన్న పన్ను ప్రయోజనాలన్నీ 2020-21లో ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానంలోకి మళ్లిన వారికి మాత్రమే. ఈ కొత్త విధానం ఎంచుకునే వారికి పన్ను ఎగవేత నిరోధక పథకాలు గానీ, పెట్టుబడుల మినహాయింపులుగానీ లభించవు. మధ్య తరగతి ప్రజల్లో చాలామంది ముఖ్యంగా ఉద్యోగులు ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ (ఈఎల్ఎస్ఎస్), పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) వంటి దీర్ఘకాలిక పొదుపు పథకాల్లో మదుపు చేస్తుంటారు. పాత పన్ను విధానంలో కొనసాగే వారికి మాత్రమే ఈ పెట్టుబడులపై ఆదాయ మినహాయింపు లభిస్తుంది. ఈ పథకాలు దీర్ఘకాలిక కుటుంబ ఆర్థిక లక్ష్యాల సాధనతో పాటు ఆయా వ్యక్తులకు క్రమశిక్షణతో కూడిన పొదుపు విధానాలకు అలవాటు పడేలా చేస్తాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, స్వల్పకాలిక పన్ను లాభాలను పక్కన పెట్టి మధ్య తరగతి ప్రజలు ముఖ్యంగా ఈ పథకాల్లో ఇప్పటికే మదుపు చేస్తున్న వ్యక్తులు పాత పన్ను చెల్లింపు విధానంలో కొనసాగడమే మంచిది.

రిటైర్మెంట్ ప్రణాళికలు

నాలుగు రాళ్లు సంపాదించేటప్పుడే రిటైర్మెంట్ ఖర్చులు ప్లాన్ చేసుకోవాలి. లేకపోతే ఆ జీవితమూ నరకంగా మారుతుంది. ఎన్‌పీఎస్ లేదా పెన్షన్ పథకాలు ఇందుకు అత్యంత అనువైనవి. ఇవేవీ వద్దు, మాకు మార్కెట్‌పై మంచి అవగాహన ఉందనకుంటే, ఈ బడ్జెట్‌తో మిగిలే పన్ను మొత్తాన్ని ఏదైనా బ్లూచిప్ కంపెనీల షేర్లలో మదుపు చేయండి. అయితే ఈ పెట్టుబడిలో రిస్క్ ఎక్కువ. మార్కెట్ కలిసి వస్తేనే ఈ పెట్టుబడుల్లో అధిక రాబడులు వస్తాయని మర్చిపోవద్దు. చేతిలో దండిగా నిధులు ఉన్న పన్ను చెల్లింపుదారులు మాత్రమే ఈ రిస్క్ తీసుకోవాలి. సిప్ పద్ధతిలో మదుపు చేస్తే రిస్క్ కూడా తగ్గుతుంది.

దీర్ఘకాలమే బెటర్

అలా అని కొత్త పన్ను చెల్లింపు విధానాన్ని పూర్తిగా పక్కన పెట్టాల్సిన పని లేదు. కొద్దిగా రిస్క్ ఉన్నా మార్కెట్ ఆధారిత రాబడులు కావాలనుకునే మదుపరులు తమ పన్ను పొదుపు మొత్తాలను క్రమానుగత పెట్టుబడుల (సిప్) పద్ధతిలో ఈఎల్ఎస్ఎస్ లేదా మంచి ట్రాక్ రికార్డు ఉన్న ఇతర ఈక్విటీ పథకాల్లో మదుపు చేయడం మంచిది. అయితే ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో పెట్టుబడులకు మూడేళ్ల లాక్-ఇన్-పీరియడ్ ఉంటుందనే విషయం మర్చిపోవద్దు.

పీపీఎఫ్- ఎస్ఎస్‌వై పథకాలు

ఏ మాత్రం రిస్క్ తీసుకోలేని దీర్ఘకాలిక మదుపరులు తమ పన్ను ఆదా పెట్టుబడుల కోసం పీపీఎఫ్ లేదా సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాలను ఎంచుకోవడం మంచిది. ఈ రెండు పథకాల్లో చెల్లింపులకు ప్రభుత్వ హామీ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఈ పథకాలపై లభించే వడ్డీ రేటు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మించి ఉంటుంది. కొత్త పన్ను విధానంలోనూ పీపీఎఫ్‌పై లభించే వడ్డీ ఆదాయానికి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఆడపిల్లల తల్లిదండ్రులకైతే ఎస్ఎస్‌వై అనువైన దీర్ఘకాలిక పెట్టుబడి.

ఎమర్జెన్సీ ఫండ్

ఎప్పుడు ఏ ఖర్చులు వస్తాయో తెలియదు. కొన్ని ఖర్చులు చెప్పి రావు. ఉన్న పళంగా ముంచుకొస్తాయి. లేదా కొన్ని సార్లు ఉద్యోగాలు పోయి రోడ్డున పడొచ్చు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి వ్యక్తి లేదా కుటుంబం కొంత ఎమర్జెన్సీ ఫండ్‌ను ఉంచుకోవడం మంచిది. ప్రైవేటు ఉద్యోగులైతే కనీసం ఆరు నెలల జీతానికి సరిపడా మొత్తాన్ని ఎమర్జెన్సీ ఫండ్‌గా ఉంచుకోవాలి. బడ్జెట్ పన్ను కోతలతో మిగిలే మొత్తాన్ని ఇందుకు మళ్లించడం మంచిదని నిపుణుల సూచన.

ఆరోగ్య బీమాను మరవద్దు


ఈ రోజుల్లో ఆరోగ్య బీమా లేకపోతే మధ్య తరగతి ప్రజల ఆర్థిక భద్రతకూ ధీమా లేదు. మందులు, ఆస్పత్రుల ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఏ చిన్న సమస్య వచ్చి హాస్పిటల్‌కు వెళ్లినా జేబులు ఖాళీ అవుతున్నాయి. రోగాల్లాగే ఈ ఖర్చులూ ఏటికేటికి పెరిగి పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరికి ఆ మాటకొస్తే ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా తప్పనిసరి. లేకపోతే ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఇల్లూ, ఒళ్లూ గుల్లయ్యే ప్రమాదం ఉంది. కాకపోతే క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ ఎక్కువగా ఉన్న కంపెనీ ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడమే మంచిది. కాబట్టి మిగిలే పన్ను ఆదాలో కొంత మొత్తాన్ని ఆరోగ్య బీమా కవరేజీ పెంచుకునేందుకు ఉపయోగించడం తెలివైన పని.

జీవిత బీమా కూడా ముఖ్యమే

ఎవరి జీవితాలూ శాశ్వతం కావు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అసలే తెలియదు. జరగరానిదేదైనా జరిగితే కుటుంబం ఆర్థిక భద్రత లేక రోడ్డున పడాల్సిందే. జీవిత బీమా ద్వారా ఈ పరిస్థితి నుంచి కొంత వరకు ఉపశమనం లభిస్తుంది. టర్మ్ పాలసీలను ఎంచుకుంటే తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ కవరేజీ లభిస్తుంది. పాత పన్ను విధానంలో ఈ ప్రీమియం చెల్లింపులకు పన్ను ప్రయోజనాలూ లభిస్తాయి. కాబట్టి ప్రతి ఒక్కరు బడ్జెట్‌తో మిగిలే తమ పన్ను ఆదాలో కొంత భాగాన్ని తనకు, తన కుటుంబానికి ఆర్థిక భద్రత చేకూర్చే జీవిత లేదా టర్మ్ పాలసీలవైపు మళ్లించడం మర్చిపోవద్దు. ఈ పెట్టుబడి మనం లేకపోయినా మన కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

జీఎస్‌టీకి సంబంధించి బడ్జెట్‌లో చేసిన మార్పులేమిటంటే ?

ఇదీ GST



రాంబాబు గొండాల

ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జీఎస్‌టీకి సంబంధించి కొన్ని మార్పులు ప్రతిపాదించారు. ఆ వివరాలు..

ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్‌కు రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చే అంతఃరాష్ట్ర సరఫరాలు పొందినప్పుడు సంబంధిత క్రెడిట్‌ను పంపిణీ చేసే సదుపాయం ఇప్పటి వరకు ఉండేది కాదు. ఇప్పుడు చేసిన మార్పుతో, ఆ క్రెడిట్‌ను కూడా డిస్టింక్ట్ పర్సన్స్ అంటే అదే పాన్ సంఖ్యతో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందిన ఇతర యూనిట్లకు పంపిణీ చేసే సదుపాయం కల్పించారు.

అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవటానికి వివిధ నిబంధనలు ఉన్న విషయం తెలిసిందే. ఉదాహరణకు నిర్మాణ రంగం ఉపయోగించే సరఫరాల మీద క్రెడిట్ తీసుకోవటానికి ప్రత్యేక పరిమితులు ఉన్నాయి. దీని ప్రకారం అన్ని రకాల సరఫరాల మీద క్రెడిట్ తీసుకోవటం సాధ్యం కాదు. అలాగే దీనికి కొన్ని మినహాయింపులు కూడా ఉండేవి. అంటే పొందిన సరఫరా అనేది ప్లాంట్ 'లేదా' మెషినరీకి సంబంధించినది అయితే క్రెడిట్ తీసుకోవటానికి ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదు. ఇప్పుడు చేసిన సవరణ ప్రకారం తీసుకున్న సరఫరా.. ప్లాంట్ 'మరియు' మెషినరీకి సంబంధించినది అయితేనే క్రెడిట్ తీసుకోవటానికి వీలవుతుంది. అంటే 'లేదా' అనే స్థానంలో 'మరియు' అని పెట్టడం జరిగింది. ఈ మార్పుతో ప్లాంట్, మెషినరీ ఏదో ఒక దాంట్లో కాకుండా రెండింటికి కలిపిన నిర్వచనంలోకి సదరు సరఫరా పడినప్పుడే క్రెడిట్ వస్తుంది. ఈ సవరణ 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చేట్లు (రెట్రోస్పెక్టివ్ ఎఫెక్ట్) ప్రతిపాదించటం జరిగింది.

ఇంకా ఎగవేతకు ఆస్కారం ఉన్న ఉత్పత్తులకు సంబంధించి ఇక మీదట సరఫరాదారులు ప్రత్యేక సంఖ్య లేదా కోడ్ ముద్రించాలి. దీనివల్ల ఆయా ఉత్పత్తుల అమ్మకాలు, రవాణా, నిల్వలను ప్రభుత్వం గుర్తించటానికి వీలు ఉంటుంది. తద్వారా ఎగవేతలను నిరోధించవచ్చు. అయితే దీని పరిధిలోకి వచ్చే ఉత్పత్తులు లేదా వ్యక్తులకు సంబంధించి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది.

ఇకపోతే క్రెడిట్ నోట్స్‌కు సంబంధించి కొన్ని మార్పులు చేశారు. చేసిన సరఫరాలో ఏమేని మార్పులు ఉంటే.. అంటే ఇన్వాయిస్‌లో చూపిన విలువకు, సంఖ్యకు లేదా పన్ను కంటే వాస్తవ సరఫరా తక్కువ ఉంటే, ఆ తక్కువ మేరకు ఒక క్రెడిట్ నోట్‌ను సరఫరాదారుడు కొనుగోలుదారునికి జారీ చేస్తాడు. అలాగే ఇన్వాయిస్ విలువను రిటర్న్‌లో చూపించి పన్ను చెల్లించి ఉంటాడు కాబట్టి, క్రెడిట్ నోట్‌లో చూపిన విలువను తదుపరి రిటర్న్‌లో తగ్గించుకునే సౌలభ్యం అతనికి ఉంటుంది. అయితే తాజాగా చేసిన సవరణ ప్రకారం సదరు కొనుగోలుదారుడు క్రెడిట్ నోట్‌కు సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేసినప్పుడు మాత్రమే ఆ సరఫరాదారుడు క్రెడిట్ నోట్ విలువను తగ్గించుకునే అవకాశం ఉంది.

మరొక ముఖ్య మార్పు అప్పీల్‌కు సంబంధించినది. ఏదేనీ ఆర్డర్ మీద అప్పీల్ దాఖలు చేయాలంటే 'పన్ను' విలువలో 10 శాతం 'ప్రీ డిపాజిట్' చేయాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్డర్‌లో పన్ను, పెనాల్టీ, వడ్డీ కలిపి ఉన్నా పన్ను విలువను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పుడు ప్రతిపాదించిన మార్పు ప్రకారం ఆర్డర్‌లో ఒకవేళ పన్ను లేకుండా 'పెనాల్టీ' మాత్రమే ఉన్నట్లయితే సదరు పెనాల్టీ మీద 10 శాతం ప్రీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పన్ను, పెనాల్టీ ఇంకా ఇతర అంశాలు కలిపి ఉంటే ఇప్పటి ప్రకారమే పన్ను విలువలో 10 శాతం చెల్లిస్తే సరిపోతుంది.

పైన ప్రతిపాదించిన మార్పుల్లో ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్‌కు సంబంధించిన మార్పు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుండగా మిగతా మార్పులు సంబంధిత నోటిఫికేషన్లు జారీ చేసినప్పటి నుంచి అమల్లోకి వస్తాయి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	93
వరంగల్	87	గుంటూరు	100
కరీంనగర్	87	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	86
కర్నూలు	87	నెల్లూరు	91
విశాఖపట్నం	91	అనంతపురం	91
గోదావరి	93		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,670 ▲	79,450 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	82,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	84,990 ▲	77,910 ▲	95,610 ▼
రాజమండ్రి	86,670 ▲	79,450 ▲	98,400 ▼
ప్రొద్దుటూరు	86,200 ▲	79,820 ▼	96,300 ▼
ముంబై	84,699 ▲	77,584 ▲	95,391 ▲

'వేవ్స్'లో భాగమైనందుకు ఆనందంగా ఉంది

● ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన చిరంజీవి



అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చివర్లో 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్)'ను నిర్వహించనుంది. ఆర్థిక రంగానికి సంబంధించి దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎలా జరుగుతుందో...వినోద పరిశ్రమ కోసం అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సుగా 'వేవ్స్'ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భారత సినీ, పారిశ్రామిక ప్రముఖులతో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందులో చిరంజీవి, సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ముఖేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, మోహన్‌లాల్, రజనీకాంత్, ఆమిర్‌ఖాన్, ఏఆర్ రెహమాన్, అక్షయ్ కుమార్, రణ్‌బీర్ కపూర్, దీపిక పదుకొణె తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశం అనంతరం చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ 'ఇంతటి మహోత్తరమైన కార్యక్రమంలో నన్ను భాగస్వామిగా చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. గౌరవ సభ్యులతో నా ఆలోచనల్ని పంచుకోగలిగినందుకు ఆనందంగా ఉంది' అని ట్వీట్ చేశారు.


రీ ఎంట్రీతో సంతోషంగా ఉన్నా

అన్షు

'మన్మథుడు' చిత్రంతో కథానాయికగా తెలుగు ప్రేక్షక హృదయాలపై చెరగని ముద్ర వేశారు అన్షు. ఆమె రీ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్, రావు రమేశ్, రీతూ వర్మ ప్రధాన పాత్రలు పోషించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్.బన్సాల్ నిర్మించారు. ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అన్షు మీడియాతో ముచ్చటించారు. "మన్మథుడు' సినిమా రీ రిలీజ్ నా జీవితాన్నే మార్చేసింది. నటిగా మళ్లీ కెరీర్ మొదలుపెట్టడానికి కావాల్సిన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ టైమ్‌లో నేను ఇండియాకు రావడం.. పలు ఇంటర్వ్యూల్లో పాల్గొనడంతో యాక్టింగ్ ట్రయల్స్‌లో ఉన్నానని దర్శకనిర్మాతలకు అర్థమైంది. అలా, ఈ సినిమాలో అవకాశం వచ్చింది. స్క్రిప్టు వింటున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నాను. ఇందులో నా పాత్ర పేరు 'యశోద'. ఇటువంటి వినోదాత్మక చిత్రంతో 23 ఏళ్ల తర్వాత నేను మళ్లీ తెరపై కనిపిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరినీ అలరించే సినిమా ఇది. ఇందులో నటించిన వారందరికీ గుర్తుండిపోయే పాత్రలు దక్కాయి. దర్శకుడు త్రినాథరావు చాలా ఓపిక గల వ్యక్తి. ఆయనతో పనిచేసినందుకు ఆనందంగా ఉంది. ఓ నటిగా సవాలు విసిరే పాత్రలు పోషించాలని ఉంది" అని చెప్పారు.



అఖండతో ఆది





బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'సరైనోడు' చిత్రంలో ఆది పినిశెట్టి విలనిజం ప్రేక్షకులను మెప్పించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి బోయపాటి దర్శకత్వంలో శక్తిమంతమైన విలన్ పాత్రలో అలరించేందుకు సిద్ధమయ్యారు ఆది. ఈసారి నందమూరి బాలకృష్ణతో ఆయన తలపడనున్నారు. 'అఖండ 2: తాండవం' చిత్రంలో ఆది పినిశెట్టి భాగమవుతున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. బాలకృష్ణ- ఆది పినిశెట్టి పాల్గొంటున్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా కోసం ఆది సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. బాలకృష్ణ, ఆది మధ్య పోరాట సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చిత్రబృందం తెలిపింది. 'అఖండ'కు కొనసాగింపుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదలవనుంది.

లైలా పాత్రలో అదరగొట్టాడు

- సాహు గారపాటి



'మజిలీ', 'ఉగ్రం', 'భగవంత్ కేసరి' వంటి హిట్ చిత్రాలను నిర్మించారు సాహు గారపాటి. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'లైలా'. విష్వక్ సేన్ కథానాయకుడిగా రామ్‌నారాయణ్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ "సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. ఒక హీరో లేడీ పాత్రను చేయడం సవాల్‌తో కూడుకున్న విషయం. విశ్వక్ 'సోనూ'గానే కాకుండా 'లైలా' పాత్రలోనూ అదరగొట్టారు. 'సోనూ' లైలా'గా ఎందుకు మారతాడో ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో ప్రేమ కథతో పాటు హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు ఉంటాయి. ఈ సినిమా యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులనూ అలరిస్తుంది. ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన ప్రయత్నమే 'లైలా'" అని చెప్పారు.



బాలీవుడ్ బాటలో...

'ఉప్పెన' చిత్రం ద్వారా తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టిన కృతి శెట్టి ఆ చిత్రం బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించడంతో వరుస అవకాశాలు చేజిక్కించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన 'బంగార్రాజు', 'శ్యామ్ సింగరాయ్' చిత్రాలు కూడా విజయవంతమయ్యాయి. ఆ తర్వాత ఈ అమ్మడు నటించిన చిత్రాలు డిజాస్టర్‌గానే మిగిలిపోయాయి. దీంతో కృతికి టాలీవుడ్‌లో అవకాశాలు కరవై పోయాయి.



దీంతో ఆమె కోలీవుడ్ బాట పట్టారు. అక్కడ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే బాలీవుడ్ ఆఫర్ ఆమె తలుపు తట్టిందనే మాట వినిపిస్తోంది. ఓ అగ్ర నిర్మాణ సంస్థ నిర్మించే భారీ చిత్రంలో కథానాయికగా కృతికి అవకాశం దక్కిందని కొన్నాళ్ల క్రితం ప్రచారం జరిగింది. అయితే బాలీవుడ్‌లో ఆమెకు వచ్చింది హీరోయిన్ అవకాశం కాదు, ఓ స్పెషల్ సాంగ్ కోసమే ఆమెను సంప్రదించారని తాజాగా కోలీవుడ్ మీడియా వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వస్తే తప్ప ఇందులో వాస్తవం ఏమిటనేది తెలియదు.

షూట్‌కు సిద్ధం



'బబుల్ గమ్' చిత్రంతో హీరోగా తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాడు రోషన్ కనకాల. ఆయన ప్రస్తుతం 'మోగ్లీ 2025' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. అటవీ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలో రోషన్ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు.త్వరలో రెగ్యులర్‌షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుపుతూ మేకర్స్ రోషన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రం

- రాహుల్‌యాదవ్



'మళ్లీరావా', 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'మసూద' చిత్రాలతో మంచి అభిరుచి గల నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నారు రాహుల్‌యాదవ్ నక్కా. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం'. బ్రహ్మానందం, రాజాగౌతమ్, వెన్నెల కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించారు. నూతన దర్శకుడు ఆర్.వీ.ఎస్.నిఖిల్ తెరకెక్కించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. రాహుల్ యాదవ్. "ఇది తాత, మనవడి మధ్య జరిగే ఓ అందమైన కథ. మంచి వినోదం, సందేశంతో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలూ ఉంటాయి. బ్రహ్మానందం లేకుంటే ఈ సినిమా లేదు. ఆయన పాత్రే సినిమాకు ప్రాణం. కథ విన్నాక ఆయనకు నచ్చడంతో ఓ.కే చేసేశారు. ఇంతవరకు మీరు చూడని పాత్రలో ఆయన కనిపిస్తారు. ఈ సినిమాకు అందరూ బ్రహ్మానందం కోసం వస్తారు. కానీ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తూ రాజా గౌతమ్ ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటాడు. మంచి అనుభూతిని ఇచ్చే ఈ సినిమా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది" అని చెప్పారు.











మద్యం కుంభకోణమే ముంచింది!

అదే కేజ్రీవాల్ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చింది

'లిక్కర్', అక్రమార్జనపైనే ఆప్ నేతల దృష్టి

అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలన్నా వినలేదు

కేజ్రీవాల్ మరో మార్గాన్ని ఎంచుకున్నారు: అన్నా హజారే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ, ఆ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ పరాజయం స్వయంకృతం అని సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్యానించారు. ఆప్ నేతలు మద్యం విధానం, అక్రమార్జనపైనే దృష్టి పెట్టి ఓటమి కొని తెచ్చుకున్నారని విమర్శించారు. మద్యం విధానం కుంభకోణంతో కేజ్రీవాల్ ప్రతిష్ఠపై మచ్చ పడిందని, అందుకే ఆ పార్టీకి తక్కువ ఓట్లు పడ్డాయన్నారు. అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని కేజ్రీవాల్‌కు తాను చాలా కాలంగా చెబుతూ వచ్చానని, ఆయన వినిపించుకోలేదని పేర్కొన్నారు. కేజ్రీవాల్ నుంచి తాను ఎంతో ఆశించానని, ఆయన మరో మార్గాన్ని ఎంచుకున్నారని, సమాజహితం గురించి కాకుండా రాజకీయపరంగానే కేజ్రీవాల్ ఆలోచించారని పేర్కొన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలనే బాధ్యతను గుర్తెరగడంలో కేజ్రీవాల్ విఫలమయ్యారని విమర్శించారు. నీతిమంతమైన రాజకీయాల గురించి మాట్లాడే కేజ్రీవాల్ స్వయంగా మద్యం విధానం కుంభకోణంలో ఇరుక్కోవడాన్ని ప్రజలే చూశారన్నారు.



చీపురునే ఊడ్చేసింది!

ఢిల్లీలో ఆప్‌ను మట్టి కరిపించిన బీజేపీ.. 26 ఏళ్ల తర్వాత మళ్లీ అధికార పీఠంపైకి

హరియాణాలో అధికార బీజేపీపై ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉంది! ఈసారి కాంగ్రెస్ గెలుస్తుందన్న అంచనాలూ బలంగానే వచ్చాయి! ఇక్కడ ఆప్ ఉనికి నామమాత్రమే! పొత్తుకు కాంగ్రెస్, ఆప్ ముందుకొచ్చాయి! చర్చలు జరిగాయి! సీట్ల పేచీతో పొత్తును కాంగ్రెస్ వద్దనుకుంది! ఫలితం.. ఓడిపోతుందనుకున్న బీజేపీ మళ్లీ గెలిచింది!

అదీ.. ఆప్ ఓట్ల చీలిక కారణంగా!!

తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ఢిల్లీలో హ్యాట్రిక్ ఖాయమని ఆప్ ధీమాగా ఉంది! ఇక్కడ కాంగ్రెస్ ఉనికి నామమాత్రమే! దాంతో, ఆప్‌తో పొత్తుకు ముందుకొచ్చింది! కాంగ్రెస్‌తో పొత్తును ఆప్ వద్దనుకుంది! ఫలితం.. దేశ రాజధానిలో కమల వికాసం!

అదీ.. కాంగ్రెస్ ఓట్ల చీలిక కారణంగా!!



(మొదటిపేజీ తరువాయి)


జరిగిన సంగతి తెలిసిందే. శనివారం ఫలితాలు వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ ఊహించినట్లు.. కౌంటింగ్ ప్రారంభం నుంచే బీజేపీ తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఆప్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగినట్లు కనిపించినా.. చివరికి, మ్యాజిక్ మార్కు (36) దాటి 48 సీట్లతో కమలం వికసించింది. ఆప్ అభ్యర్థి మహమ్మద్ ఇక్బాల్ అత్యధికంగా 42,724 ఓట్ల ఆధిక్యం సాధిస్తే.. బీజేపీ అభ్యర్థి చందన్ కుమార్ చౌదరి అత్యల్పంగా 344 ఓట్ల మెజారిటీతో బయటపడ్డారు.

మధ్య తరగతి మ్యాజిక్!

దేశ రాజధానిలో మధ్య తరగతి మరీ ముఖ్యంగా వేతన జీవులే ఎక్కువ. ఈసారి ఇక్కడ ఎలాగైనా గెలవాలని కంకణం కట్టుకున్న బీజేపీ మధ్య తరగతి ఓటర్లపై కన్నేసింది. వారిపై వరాల వర్షం కురిపించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించింది. బడ్జెట్లో ఏకంగా రూ.12.75 లక్షల వార్షికాదాయం వరకూ ఆదాయ పన్ను మినహాయింపు ఇచ్చింది. ఫలితంగా.. గత ఎన్నికల్లో ఆప్‌కు మద్దతు ఇచ్చిన వేతన జీవులంతా ఈసారి బీజేపీకి ఓటేశారు. ఇక, తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ఆప్ ధీమాగా ఉంది! ఈసారి మరిన్ని సంక్షేమ పథకాలనూ ప్రకటించింది! కానీ, ఆప్‌ను మించి మ్యానిఫెస్టోలో బీజేపీ హామీలు గుప్పించింది. సంక్షేమ ఓటర్లలో చీలిక తీసుకొచ్చింది! పీఆర్సీ, ఐటీ, హామీల వర్షంతో 58 జనరల్ స్థానాల్లో 44 సీట్లను బీజేపీ గెలుచుకుంటే.. ఆప్ 14 స్థానాలకే పరిమితమైంది. బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించిన మరో వర్గం 'జాట్లు'! హరియాణాలో బీజేపీకి అండగా నిలిచిన జాట్ వర్గం ఢిల్లీలోనూ విజయ తీరాలకు చేర్చింది. కేజ్రీవాల్‌పై ఆ వర్గానికి చెందిన పర్వేష్ వర్మను రంగంలోకి దింపింది. ఫలితంగా జాట్ ప్రాబల్యం ఉన్న పశ్చిమ ఢిల్లీలోని 12 సీట్లలో బీజేపీ ఏకంగా 11 స్థానాల్లో విజయం సాధించింది. ఇక, ముస్లింలు తమకే ఓటు వేస్తారని కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నా.. ఆ వర్గమంతా ఆప్‌నే ఆదరించారు. ఫలితంగా, వారి ప్రాబల్యమున్న 15 నియోజకవర్గాల్లో 12 సీట్లు చీపురు ఖాతాలో పడ్డాయి.

ఓట్ల చీలికతో చెల్లాచెదురు

బీజేపీని ఢీకొట్టాలంటే 15 శాతం ఓట్ల ఆధిక్యం ఇవ్వాలని కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. కానీ, గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతమే ఆరు శాతం తగ్గిపోయింది. ఇక్కడే బీజేపీ గెలుపు కొంత ఖాయమైందని విశ్లేషకులు భావించారు. ఇక, ఫలితాల్లో బీజేపీ, ఆప్ మధ్య హోరాహోరీ నెలకొంది. ఆప్ కంటే బీజేపీ కేవలం 1.99 శాతం ఓట్లనే ఎక్కువ సాధించింది. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా దాదాపు రెండు లక్షలు. కానీ, ఆప్ కంటే బీజేపీ 36 సీట్లను అధికంగా సాధించింది. ఇందుకు ఒక కారణం.. కాంగ్రెస్ చీల్చిన ఓట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల్లో 4.26 శాతం ఓట్లను సాధించిన కాంగ్రెస్.. ఈసారి 6.34 శాతం ఓట్లను సాధించింది. ఆ పార్టీ ఓటు బ్యాంకు 2.18 శాతం పెరిగింది. అదే సమయంలో, ఆప్, బీజేపీ మధ్య ఓట్ల వ్యత్యాసం 1.99 శాతం మాత్రమే. దీనిని బలపరుస్తూ.. ఏకంగా 14 స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల మెజారిటీ కంటే కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. చివరిగా, అధికారంలో ఉన్నప్పుడు అహంకారం ప్రదర్శించిన ముఖ్యమంత్రులు అందరినీ ఓటర్లు ఇంటికి పంపారు! ఇప్పుడు కేజ్రీవాల్ వంతు వచ్చిందంతే! ఢిల్లీలో ఆప్‌ను ఓడించాలంటే మోదీ మరో జన్మ ఎత్తాలంటూ పదే పదే వ్యాఖ్యానించారు. ఓటర్లు ఆ ధీమాకు చెక్ పెట్టారు!!



బీజేపీకి ధనిక, ఆప్‌కు పేద ఓటర్లు జై..!

ఢిల్లీ, ఫిబ్రవరి 8: దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లోని ఆస్తుల విలువ పరంగా పేద, ధనిక, మధ్యస్థాయి అంటూ విభజించి తీసిన లెక్కల్లో.. బీజేపీ ధనిక నియోజకవర్గాల్లో సత్తా చాటగా, ఆప్‌కు పేద నియోజకవర్గాల్లోని ప్రజలు జై కొట్టారు. 2025 ఎన్నికల్లో బీజేపీ ధనిక నియోజకవర్గాల్లో 52.6 శాతం ఓట్లు, పేద నియోజకవర్గాల్లో 42.2 శాతం ఓట్లను సాధించింది. ఇక ఆప్ గత ఎన్నికలతో పోలిస్తే 8.2 శాతం తక్కువగా పేద నియోజకవర్గాల్లో 48.3 శాతం ఓట్లు దక్కించుకోగా, ధనిక నియోజకవర్గాల్లో 12 శాతం తక్కువగా 37.2 శాతం ఓట్లు సాధించింది. ఇక మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ 47.3 శాతం, ఆప్ 45.3 శాతం, కాంగ్రెస్ 1.3 శాతం ఓట్లు దక్కించుకున్నాయి.



ముస్లింల అడ్డాలో ఆప్ జెండా

7 నియోజకవర్గాల్లో 6 చోట్ల విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా ఆ పార్టీ సీనియర్ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ తదితరులు ఓటమి చవిచూసినా... ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఆ పార్టీ పట్టు నిలబెట్టుకుంది. కాంగ్రెస్ ప్రత్యర్థిగా బరిలో ఉండటంతో ఇతర ప్రాంతాల్లో ఓట్ల చీలిక కమలం పార్టీకి లాభించినా... ముస్లింల ప్రాబల్యం ఉన్న చోట్ల మాత్రం ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ముస్లింలు గణనీయ సంఖ్యలో ఉన్న 7 నియోజకవర్గాల్లో 6 చోట్ల ఆప్ అభ్యర్థులు విజయం సాధించారు. ఢిల్లీలో ఎంఐఎం పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ చెరో స్థానం నెగ్గాయి.



ఇక మోదీ పట్టులో ఢిల్లీ

21కి పెరిగిన ఎన్డీయే పాలిత రాష్ట్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దాదాపు 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడంతో దేశంలో ఎన్డీయే పాలిత రాష్ట్రాల సంఖ్య 21కి పెరిగింది. దీంతో ఢిల్లీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వస్తుందని, ప్రధానమంత్రి కార్యాలయం ఢిల్లీ అభివృద్ధి, పరిపాలనపై కీలక నిర్ణయాలు తీసుకుంటుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఢిల్లీ ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రతిదానికీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతల యంత్రాంగం కూడా కేంద్రం అధీనంలో ఉండడంవల్ల ఢిల్లీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు అవకాశాలు ఉండవు.. ఢిల్లీలో మౌలిక సదుపాయాల నిర్మాణం, యమునా నది, వాతావరణ కాలుష్యాన్ని నివారించడంపై కేంద్రం దృష్టి కేంద్రీకరిస్తోంది. ఇప్పటికే సెంట్రల్ విస్తా, భారతీయ మండపం, సొరంగ మార్గాలు, మెట్రో విస్తరణపై వేగంగా చర్యలు తీసుకున్న మోదీ సర్కారు ఢిల్లీ మొత్తం అభివృద్ధికి నడుంకట్టవచ్చు. దాంతో ఢిల్లీ ఒక అధునాతన అంతర్జాతీయ రాజధానిగా మారే అవకాశాలు ఉన్నాయని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంమీద ఢిల్లీ మోదీ అధీనంలోకి వస్తుందని, తనకు అనుగుణంగా నడుచుకునే ముఖ్యమంత్రిని నియమించి పరిపాలనను అదుపులోకి తెచ్చుకుంటారని ఆ వర్గాలు అంటున్నాయి.

ఉప ఎన్నికలు

యూపీలో బీజేపీ, తమిళనాడులో డీఎంకే విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి8: ఉత్తరప్రదేశ్‌లోని మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి చంద్రభాను పాశ్వాన్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అజిత్ ప్రసాదను 61 వేల ఓట్ల తేడాతో ఓడించారు. అజిత్ ప్రసాద ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ తనయుడు. లోక్‌సభ ఎన్నికల సమయంలో అవధేశ్ ప్రసాద్ మిల్కిపూర్ నుంచి రాజీనామా చేసి ఫైజాబాద్ నుంచి సమాజ్‌వాదీ తరఫున పోటీ చేసి బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. అయోధ్య రామ మందిరం ఫైజాబాద్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోవడం అప్పట్లో కలకలం రేపింది. తాజా ఉప ఎన్నికలో ఎస్పీ అభ్యర్థిని ఓడించడం ద్వారా బీజేపీ ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. మరోవైపు తమిళనాడులోని ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికలో అధికార డీఎంకే విజయం సాధించింది. డీఎంకేకు చెందిన వీసీ చందిరకుమార్ ఎన్‌టీకే పార్టీకి చెందిన ఎంకే సీతాలక్ష్మిపై 91 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.



సీఎం రేసులో పర్వేశ్‌వర్మ?

కేజ్రీవాల్‌పై 4 వేల ఓట్ల మెజారిటీతో విజయం

రేసులో బిధూరీ, మనోజ్ తివారీ, స్మృతి పేర్లూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ పేరు ఢిల్లీ సీఎం రేసులో మొదటగా, ఎక్కువగా వినిపిస్తోంది. ఈయన ఢిల్లీ మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. పర్వేశ్ వర్మ కేజ్రీవాల్‌పై 4వేల ఓట్ల మెజారిటీతో గెలుపొంది జెయింట్ కిల్లర్‌గా మారారు. ఇదే స్థానంలో పోటీ చేసిన ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ కేవలం 4,254 ఓట్లను మాత్రమే సాధించారు. ఇక, బీజేపీ ఢిల్లీ నేతల్లో కీలకమైన రమేశ్ బిధూరీ పేరు కూడా సీఎం రేసులో ఉంది. ఎన్నికల ప్రచారంలో సీఎం అతిశీ తండ్రిపై బిధూరీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అతిశీ చేతిలో బిధూరీ ఓడిపోయారు. సీఎం రేసులో సుష్మా స్వరాజ్ కూతురు బాన్సురీ స్వరాజ్, స్మృతి ఇరానీ, మనోజ్ తివారీ, వీరేంద్ర సచ్‌దేవ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో పర్వేశ్ వర్మ ఒక్కరే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు.

● **ఎవరీ వర్మ?**

ముండ్కా నియోజకవర్గం నుంచి 2013 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా పర్వేశ్ వర్మ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. 2014-2024 మధ్యలో పశ్చిమ ఢిల్లీ నుంచి ఎంపీగా ఉన్నారు. 2019లో రికార్డు స్థాయిలో 5.78లక్షల మెజారిటీతో గెలుపొందారు. అయితే, వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో 2024లో ఆయనకు బీజేపీ టికెట్ నిరాకరించింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌పై పర్వేశ్ వర్మనే రంగంలోకి దింపింది.

అత్యధికం	అత్యల్పం
42,724	344
మతియామహల్ నియోజకవర్గం	సంగమ్‌విహార్ నియోజకవర్గం
aap	(బీజేపీ)

మెజారిటీ

డబుల్ ఇంజన్ సర్కార్!

బీజేపీ 'డబుల్ ఇంజన్ సర్కార్' నినాదం కూడా ఈ ఎన్నికల్లో బాగానే పనిచేసింది. ఆప్ ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ మధ్య విభేదాలతో పాలన సజావుగా సాగడం లేదని, బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే లెఫ్టినెంట్ గవర్నర్‌తో సఖ్యత ఏర్పడి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందని ఓటర్లు భావించారు. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయడం కూడా బీజేపీకి కలిసివచ్చింది. బలహీనవర్గాలు, మైనార్టీలు, దళితులు.. కాంగ్రెస్, ఆప్ పార్టీలవైపు చీలిపోయారు. కాంగ్రెస్ కూడా 'ఆప్' ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించడం బీజేపీకి కలిసివచ్చింది. తెలుగు మాట్లాడే వారు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏపీ సీఎం చంద్రబాబు ప్రచారం కమలనాథులకు కలిసివచ్చింది.

అహరహం శ్రమించి విజయాన్ని ముద్దాడి!

26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కమల వికాసం.. ఫలించిన మోదీ, షా వ్యూహాలు

- **ఆప్ ప్రజా వ్యతిరేకతను ఒడిసి పట్టుకోవడంలో విజయవంతం**
- **రంగంలోకి 300 మంది ఎంపీలు**
- **బీజేపీ గెలుపులో 'వికసిత్ ఢిల్లీ సంకల్ప్ పత్ర' కీలకం**
- **ఉద్యోగులను ఆకట్టుకున్న.. 8వ పే-కమిషన్, ఐటీ మినహాయింపు**



దాదాపు 27 సంవత్సరాల నిరీక్షణ..! కొత్త మిలీనియం వచ్చినా.. కొత్త శతాబ్దిలోకి అడుగు పెట్టినా.. దేశ రాజధాని ఢిల్లీలో అధికారానికి ఆమడ దూరంలో ఉన్న కమలం ఇప్పుడు వికసించడం వెనక భారీ కసరత్తే జరిగింది..! ఆరెస్సెస్ నిశ్శబ్ద ప్రచారం మొదలు.. కార్యకర్తలు.. నాయకులు, ఎంపీలు, కేంద్ర మంత్రులు, అగ్రనేతలు, మోదీ-షా వరకు అంతా కలిసి అహరహం శ్రమించడంతో బీజేపీ విజయాన్ని ముద్దాడింది.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఇన్నాళ్లూ ప్రతిపక్షానికి పరిమితమైన కమలం ఇప్పుడు అధికారాన్ని ఏర్పాటు చేస్తోంది. కేంద్రంలో వరుస విజయాలను నమోదు చేస్తున్నా.. ఢిల్లీలోని లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకున్నా.. విధానసభ దక్కకపోవడానికి కారణాలు.. పార్టీకి ఉన్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, ప్రమాదాలు.. ఇలా అన్నింటినీ బేరీజు వేసుకుని, పక్కా ప్రణాళికతో ముందుకు సాగడమే ఆ పార్టీ ఘన విజయానికి ప్రధాన కారణం..! ఈ విజయం కోసం బీజేపీ ఏడాదిన్నరగా కసరత్తు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మధ్యతరగతి మందహాసం!

ఢిల్లీ జనాభాలో 90.2% మంది ప్రభుత్వ, ప్రైవేటు, అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందుతున్నట్లు 2018 నాటి ఎన్‌ఎస్‌ఎస్‌వో గణాంకాలు చెబుతున్నాయి. ఇవే గణాంకాల ప్రకారం 33% మంది చెప్పుకోదగ్గ స్థాయిలో వేతనాలు పొందుతున్నారు. మొత్తం జనాభాలో 50-60% మధ్యతరగతి జనాభా ఉంది. కేంద్రం రూ.12.75 లక్షల వార్షికాదాయం వరకు ఉన్నవారిని ఆదాయపన్ను(ఐటీ) నుంచి మినహాయించడం ఈ వర్గాలకు భారీ ఊరటనిచ్చింది. ఈ నిర్ణయం బీజేపీవైపు వేతన జీవులు, మధ్యతరగతి కుటుంబాలు మొగ్గినట్లు తెలుస్తోంది. ఇక అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులు, పేదల కోసం బీజేపీ ప్రకటించిన ఉచితాలు కలిసివచ్చినట్లు స్పష్టమవుతోంది. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, పేదల కుటుంబాలకు రూ.500కే గ్యాస్‌బండ, హోలీ, దీపావళి పండుగలకు ఉచిత గ్యాస్ సిలిండర్, మాతృ సురక్ష వందన కింద గర్భిణులకు రూ.21 వేలతోపాటు.. 6 పోషకాహార కిట్లు అందిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఈ వర్గాలను ఆకట్టుకుంది. ఆప్ అమలు చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా, ఉచిత విద్యుత్తును కొనసాగిస్తామని బీజేపీ భరోసా ఇచ్చింది. వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా, నెలవారీ పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.3,000కు పెంచుతామని ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలందరికీ కేజీ నుంచి పీజీ వరకూ ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని వాగ్దానం చేసింది. ఆటోడ్రైవర్లకు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తామని పేర్కొంది. ఈ హామీలతో.. సామాన్య ప్రజలు మొదలు.. ఎగువ మధ్య తరగతి ఓటర్ల దాకా బీజేపీ వైపు ఆకర్షితులైనట్లు తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

సుస్థిర ఓటు బ్యాంకు


ముందు నుంచి బీజేపీకి ఢిల్లీలో సుస్థిర ఓటు బ్యాంకు ఉంది. అధికారంలోకి రాకపోయినా 2008లో బీజేపీ 36.34% ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. 2013లో 33% ఓట్లు, 2015లో 3 సీట్లే వచ్చినా.. 32.3%, 2020లో 8 సీట్లే వచ్చినా.. 38.51% ఓట్లు బీజేపీకి వచ్చాయి. తాజా ఎన్నికల్లో 45.56% ఓట్లను సాధించింది. గడిచిన 27 ఏళ్లుగా బీజేపీకి సుస్థిర ఓటుబ్యాంకు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మోదీ, షా హవా..!

ఢిల్లీ బీజేపీ విజయంలో ప్రధాని మోదీ గాలి జోరుగా వీచింది. ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగానే ప్రకటించకపోయినా.. మోదీ ప్రజాదరణ ఓట్లు కురిసేలా చేసింది. ఆప్‌ను ఢిల్లీకి ఆప్దా(విపత్తు)గా అభివర్ణించారు. ఎన్నికల ప్రచారం చివరి మూడు రోజులు ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, శివసేన, జనసేనలను రంగంలోకి దించడం మరింత కలిసి వచ్చింది. కేంద్రమంత్రులు, 300 మంది ఎంపీలను బీజేపీ అధినాయకత్వం రంగంలోకి దింపింది.

హిందూత్వ తోడ్పాటు

ఢిల్లీ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపడానికి 'హిందూత్వ' అంశం ప్రధానంగా తోడ్పడిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పౌరసత్వ చట్టంపై షాహీన్‌బాగ్‌లో నిరసనలు, ఢిల్లీలోని పలు ప్రాంతాలలో అల్లర్లు, జామియామిలియా, జేఎన్‌యూలో విద్యార్థుల ఆందోళన, ఢిల్లీ యూనివర్సిటీలో ఏబీవీపీ ప్రాబల్యం మొదలైనవన్నీ గత ఎన్నికల్లో కేజ్రీవాల్ దాటిని అడ్డుకోలేకపోయాయి. ఈసారి మాత్రం హిందూత్వ పవనాలు ఢిల్లీలో బలంగా వీచినట్లు తెలుస్తోంది.



ఢిల్లీ అభివృద్ధికి నాది హామీ


ఇది చరిత్రాత్మక విజయం .. ఆప్ నుంచి ఢిల్లీకి విముక్తి లభించింది

- **ఏపీలో చంద్రబాబు తన ట్రాక్ రికార్డును నిరూపించుకున్నారని ప్రశంస**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయం అభివృద్ధి, దార్శనికత, విశ్వాసానికి (వికాస్, విజన్, విశ్వాస్) దక్కిన విజయమని ప్రధాని మోదీ అన్నారు. ఢిల్లీ అభివృద్ధికి నాది గ్యారెంటీ అని ప్రధాని హామీ ఇచ్చారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 'ఇది సాధారణ విజయం కాదు. చరిత్రాత్మక విజయం. ఆప్ నుంచి ఢిల్లీకి విముక్తి లభించింది. దశాబ్దంపాటు తమను అహంకారంతో పాలించిన ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ రాజకీయాల నుంచి ప్రజలు తరిమికొట్టారు. వారు పాలనను మాత్రమే కోరుకుంటున్నారు, నాటకాలు ఆడటాన్ని కాదు' అని ఆప్‌పై మోదీ మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలు తమపై చూపించిన ప్రేమకు అనేక రెట్లు అభివృద్ధి రూపంలో తిరిగి అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ఢిల్లీని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తామని పునరుద్ఘాటించారు. అన్నీ ఆలోచించే ప్రజలు డబుల్ ఇంజన్ సర్కారుకు పట్టం కట్టారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మోదీ ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పైనా ప్రధాని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలో జరిగిన ఆరు ఎన్నికల్లో (లోక్‌సభ, అసెంబ్లీ) దేశంలోనే అతి పురాతనమైన పార్టీ ఖాతా తెరవలేకపోయింది. సున్నా సీట్లతో డబుల్ హ్యాట్రిక్ సాధించింది. ఈ ఓటమికి గుర్తుగా వారు తమకు తామే బంగారు పతకం ఇచ్చుకుంటున్నారు.' అని మోదీ ఎద్దేవా చేశారు. 'దయనీయ స్థితిలో ఉన్న బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పు వచ్చింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు తన ట్రాక్ రికార్డును నిరూపించుకున్నారు. ఎన్డీయే అంటే అభివృద్ధి. సుపరిపాలనకు గ్యారంటీ. పేదలకే కాకుండా మధ్యతరగతి వారికీ ప్రయోజనం చేకూరుస్తుంది' అని ప్రధాని పేర్కొన్నారు.







'మోదీ గ్యారెంటీ' విజయమిది..

అబద్ధాలు, మోసాలు, అవినీతితో కూడిన శీష్ మహల్‌ను నాశనం చేసి ఢిల్లీని 'ఆప్'ద రహితంగా మార్చేందుకు ప్రజలు కృషి చేశారు. ఇది 'మోదీ గ్యారెంటీ' విజయం.. ఢిల్లీ హృదయంలో మోదీ ఉన్నారు. వాగ్దానాలను ఉల్లంఘించే వారికి ఈ తీర్పే గుణపాఠం. పదే పదే తప్పుడు వాగ్దానాలతో మోసం చేయలేరని ప్రజలు తేల్చేశారు.

- కేంద్ర హోంమంత్రి, అమిత్ షా



ప్రజా తీర్పును అంగీకరిస్తున్నాం..

ఢిల్లీ ప్రజల తీర్పును మేం వినయపూర్వకంగా అంగీకరిస్తున్నాం. ఢిల్లీ అభివృద్ధి, స్థానికుల హక్కులు, కాలుష్యం, అధిక ధరలు, అవినీతిపై మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.. కాంగ్రెస్ కార్యకర్తలకు, మద్దతిచ్చిన ఓటర్లకు ధన్యవాదాలు..

- కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ



ఇండియా కూటమి కొనసాగేనా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: జాతీయ స్థాయిలో ఒకలా.. రాష్ట్రాల్లో ఇంకోలా అంటూ.. ఇప్పటికే అంతర్గత విభేదాలతో కొట్టుమిట్టాడుతున్న ఇండియా కూటమి ఉనికి.. ఢిల్లీలో ఆప్ ఓటమితో ప్రశ్నార్థకంగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలో 28 విపక్ష పార్టీలు 'ఇండియా' పేరుతో కూటమిగా ఏర్పడ్డాయి. అప్పుడే అందులోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆప్ మధ్య సీట్ల పంపకంపై విభేధాలు వచ్చాయి. ఎట్టకేలకు ఆ కూటమి.. బీజేపీని సొంతంగా అధికారంలోకి రానివ్వకుండా చేయగలిగింది. కానీ, ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో వచ్చిన అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమిలో బీటలు ఎక్కువయ్యాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించే పరిస్థితి లేకుండా పోయింది. హరియాణా, పంజాబ్‌లో కాంగ్రెస్, ఆప్ వేర్వేరుగా పోటీ చేయడంతో రెండు ప్రధాన పార్టీల మధ్య సఖ్యత లేకుండా పోయింది. ఢిల్లీలోనూ అదే పరిస్థితి. ఇండియా కూటమిలో ఉన్నప్పటికీ ఆప్‌పై, కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు, విమర్శలు గుప్పించింది. అలాగనీ, ఆ పార్టీ కనీసం ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెల్చుకోలేకపోయింది. మరోవైపు, కూటమిలో కీలకమైన సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీలు ఢిల్లీలో కాంగ్రెస్‌ను కాదని ఆప్‌కు తమ మద్దతు ప్రకటించాయి. ఇండియా కూటమికి ఎవరు నేతృత్వం వహించాలన్నదానిపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇకపై ఇండియా కూటమి కొనసాగుతుందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇండియా కూటమిలోనే ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇప్పటికే కూటమి పనితీరుపై బహిరంగంగానే తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో ఆప్ ఓటమితో ఇండియా కూటమిలోని పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 8కి పడిపోయింది. కర్ణాటక, జమ్మూకశ్మీర్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్.. ఈ రాష్ట్రాల్లోనే ఎన్డీయేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఈ ఏడాది బిహార్, వచ్చే ఏడాది పశ్చిమబెంగాల్, తర్వాత ఏడాది ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.



కొంపముంచిన మద్యం కుంభకోణం

అవినీతిపై పోరాడిన కేజ్రీవాల్‌పైనే అవినీతి ఆరోపణ.. ఏడాదిన్నరపాటు జైలుకు.. పాలనకు దూరం

ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై వచ్చిన ప్రధానమైన అవినీతి ఆరోపణ ఏమిటి!?

మద్యం కుంభకోణం

కేజ్రీవాల్ జైలుకెళ్లడానికి.. ఏడాదిన్నరపాటు పాలనకు దూరం కావడానికి కారణం ఏమిటి!?

మద్యం కుంభకోణం

ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోవడానికి కారణాల్లో ఒకటి ఏమిటి!?

మద్యం కుంభకోణం



..ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ప్రధానంగా జరుగుతున్న చర్చ ఇది! అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించి చివరికి అవినీతి ఆరోపణల్లో కేజ్రీవాల్ కూరుకుపోవడానికి మద్యం కుంభకోణమే కారణమని, బీఆర్ఎస్‌తో అంటకాగి తీహార్ జైలు ఊచలు లెక్కించడమే కాకుండా ఇప్పుడు అధికారాన్ని కూడా కోల్పోయారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. నిజానికి, మద్యం కుంభకోణం తెరపైకి వచ్చే వరకూ కేజ్రీవాల్‌పై పెద్దగా అవినీతి ఆరోపణలు లేవు. కేసీఆర్ తనయ, బీఆర్ఎస్ నాయకురాలు కవిత ఢిల్లీలో మద్యం వ్యాపారానికి పావులు కదిపారు. ఇందులో భాగంగా తమకు అనుకూలంగా నిబంధనలను మార్చుకోవడానికి ప్రలోభాలను ఆశ చూపారు. సరిగ్గా, ఈ అంశాన్నే తమకు అనుకూలంగా మార్చుకున్న బీజేపీ.. సీబీఐ, ఈడీలను రంగంలోకి దింపింది. ఈ కేసులో తొలుత ఢిల్లీ సర్కారులో ఎక్సైజ్ శాఖను చూసిన సిసోడియా జైలుపాలయ్యారు. ఇదే కేసులో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి విజయ్ నాయర్, ఎంపీ సంజయ్ సింగ్‌తో పాటు అప్పటి సీఎం కేజ్రీవాల్ కూడా జైలు పాలయ్యారు. వీరంతా ఏడాది నుంచి ఏడాదిన్నరపాటు జైల్లోనే మగ్గారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నర [illegible] మాత్రమే ఒకరి తర్వాత మరొకరు బయటకు వచ్చారు. ఇవే ఆరోపణల కారణంగా ఆ తర్వాత కేజ్రీవాల్ సీఎం పదవి నుంచి కూడా దిగిపోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలన్నీ ఆప్ పాలన, పథకాల అమలుపై తీవ్ర ప్రభావం చూపించాయి. గత రెండు ఎన్నికల్లో (2015, 2020) అవినీతికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఆప్ నేతలు ఈసారి ఆ ప్రస్తావనే చేయలేని పరిస్థితి ఎదురైంది. సరికదా.. కేజ్రీవాల్‌పై అవినీతి ఆరోపణలు చేయడానికి బీజేపీకి వజ్రాయుధం దొరికింది. కేజ్రీవాల్, సిసోడియా అరెస్టులతో ఆప్ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింది.



సిసోడియా జైలు నుంచి విడుదలైన సందర్భంగా కేజ్రీవాల్ ఆలింగనం(ఫైల్)

అడుగడుగునా ఎల్జీ అడ్డంకులు

ఢిల్లీలో ఆప్ ఓటమికి ప్రధాన కారణాల్లో మరొకటి కేజ్రీవాల్ పాలనకు లెఫ్టినెంట్ గవర్నర్ అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం. కేజ్రీవాల్ ప్రధాన విమర్శకుడు కూడా ఆయనే. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ నేతల కంటే ఆయనే ఎక్కువ విమర్శలూ చేశారు. ప్రధాన పథకాల అమలు, అధికారులపై పట్టు కోసం ఆప్ సర్కారు, ఎల్జీ మధ్య విమర్శలు, న్యాయ వివాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎన్నికల ముందు ఆప్ పాలనను ఎల్జీ తూలనాడారు. ఆయన జోక్యం కారణంగానే మంచినీటి సరఫరా, మొహల్లా క్లీనిక్‌లు, విద్యుత్తు సబ్సిడీలు వంటి వాటి అమల్లో జాప్యం జరిగేది. ఎక్సైజ్ పాలసీపై సీబీఐ విచారణకు ఆదేశించింది కూడా ఆయనే. ఇక, పాలనాపరమైన నిర్ణయాలకు సంబంధించి ఎల్జీతో ఢిల్లీ ప్రభుత్వం నిరంతరం పోరాడాల్సి వచ్చింది. సుప్రీం కోర్టులో కేసులూ వేయాల్సి వచ్చింది. సర్వీసు వ్యవహారాల్లో ఎల్జీకి సంపూర్ణ అధికారాలు ఇచ్చే నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) చట్టం, 2021ను పార్లమెంటు ఆమోదించింది. దీనిపైనా ఆప్ సర్కారు సుప్రీంలో పోరాడాల్సి వచ్చింది. ఇలా ప్రతి విషయంలోనూ ఇటు ఎల్జీతో అటు సుప్రీం కోర్టులో నిత్యం పోరాడాల్సి రావడం ఆప్ పాలనపై ప్రభావం చూపిందనే విమర్శలు ఉన్నాయి. -సెంట్రల్ డెస్క్

ఇదో చరిత్రాత్మక తీర్పు..

ఢిల్లీ ప్రజలు అవినీతిని కాదని సమగ్రతను, అబద్ధాన్ని కాదని నిజాన్ని ఎంచుకున్నారు. ఇదో చరిత్రాత్మక తీర్పు.. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వమే బీజేపీ విజయానికి కారణం. ఆయన దార్శనికతపై దేశ రాజధాని ప్రజలు నమ్మకం ఉంచారు. బీజేపీకి ఓటేసి గెలిపించిన ప్రజానీకానికి ధన్యవాదాలు.

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు, జేపీ నడ్డా

ఢిల్లీ ప్రజలు అవకాశమివ్వలేదు..

ఆప్ సర్కారుకు వ్యతిరేకంగా పోరాడటంలో కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ పాలించడానికి ప్రజలు అవకాశమివ్వలేదు. ఏదేమైనా ప్రజాభిప్రాయాన్ని అంగీకరిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఢిల్లీలో కాలుష్య నియంత్రణ, యమునా నదిని శుభ్రపర్చడం, మంచినీరు, విద్యుత్తు, రోడ్లు, అభివృద్ధి కోసం ప్రజలతో కలసి పోరాడుతాం.

- కాంగ్రెస్ అధ్యక్షుడు, మల్లికార్జున ఖర్గే

ఇంకా మీలో మీరు కొట్టుకోండి!

ఇంకా మీలో (కాంగ్రెస్-ఆప్) మీరు కొట్టుకుంటూనే ఉండండి.. ఎవరో ఒకరు నాశనమయ్యే వరకు ఇలాగే చేయండి..

- ఒమర్ అబ్దుల్లా, జమ్మూ కశ్మీర్ సీఎం

మోదీపై నమ్మకానికి నిదర్శనం

ఢిల్లీలో చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకున్న బీజేపీ నాయకత్వానికి అభినందనలు. ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి విధానానికి ఢిల్లీ ప్రజలు తమ ఓటుతో బాసటగా నిలిచారు. మోదీపై ప్రజల నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనం.

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

బీజేపీ విజయం హర్షణీయం

ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడం హర్షణీయం. డబుల్ ఇంజన్ సర్కార్‌తో దేశ రాజధానిలో సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం క్షేత్రస్థాయికి చేరతాయి.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఢిల్లీ అసెంబ్లీలో తగ్గిన మహిళలు

- గత ఎన్నికల్లో 8 మంది విజయం
- ఈ సారి ఐదుగురు మాత్రమే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఢిల్లీ విధాన సభలో మహిళల ప్రాతినిధ్యం తగ్గింది. గత ఎన్నికల్లో 8 మంది మహిళలు అసెంబ్లీకి ఎన్నికవ్వగా.. ఈసారి ఐదుగురే విజయం సాధించారు. గెలిచిన వారిలో బీజేపీ నుంచి రేఖాగుప్తా(షాలిమార్‌బాగ్), పూనమ్ శర్మ(వజీర్‌పూర్), నీలమ్ పహల్వాన్(నజాఫ్‌గఢ్), శిఖారాయ్(గ్రేటర్ కైలాశ్), ఆప్ నుంచి తాజా మాజీ సీఎం ఆతిశీ మాత్రమే గెలిచారు. కాగా.. ఈ సారి ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికైన వారిలో బీజేపీ అభ్యర్థి కర్నాలీ సింగ్ రూ.259 కోట్ల ఆస్తులతో అత్యంత ధనికుడిగా నిలిచారు. 31 ఏళ్ల ఉమాంగ్ బజాజ్ అత్యంత పిన్నవయస్కుడు కాగా.. 73ఏళ్ల తిలక్‌రామ్ గుప్తా అత్యంత పెద్దవాడిగా ఉన్నారు. అత్యంత కేసులున్న ఎమ్మెల్యేగా ఆప్‌నకు చెందిన అమానతుల్లా ఖాన్(19 కేసులు) ఉన్నారు.

	పోటీ చేసిన అభ్యర్థులు	గెలిచిన వారు
కోటీశ్వరులు	270	61
పట్టభద్రులు	314	44
నేర చరితులు	132	31
మహిళలు	96	5

ప్రత్యామ్నాయ రాజకీయ ప్రయోగం విఫలం?

కేజ్రీవాల్ సహా ఆప్ దిగ్గజ నేతల ఓటమితో పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకం

- అవినీతి వ్యతిరేక ఉద్యమంతో ఆవిర్భవించి అవే ఆరోపణలతో విలవిల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి8: భారత్‌లో రాజకీయ పార్టీల మనుగడ కులం, మతం, ప్రాంతం, భాషలపై ఆధారపడి ఉండటం సాధారణమే. అయితే వీటి అవసరం లేకుండానే ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ అవతరించింది. 2011లో ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా అవినీతికి వ్యతిరేకంగా లోక్‌జన్‌పాల్ వ్యవస్థ కోసం గాంధేయవాది అన్నాహజారే ఉద్యమించారు. ఆ సమయంలో హజారే వెంట ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించారు. స్వయంగా అన్నా హజారే వద్దని నివారించినా కేజ్రీవాల్ ఆప్‌ను ప్రారంభించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని, సుపరిపాలన అందిస్తామని, సంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా నిలబెడతానని నాడు కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. పార్టీ పేరులోనే ఆమ్ ఆద్మీ ఉండటంతో సామాన్యులకు చేరువయ్యారు. మధ్యతరగతి వర్గానికి కూడా దగ్గరయ్యారు. ఐఆర్ఎస్ అధికారి కావడం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానని హామీ ఇవ్వడంతో ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ వెంటే నడిచారు.



2013 నుంచి 2022 దాకా తిరుగేలేదు

2013లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తొలిసారి ఓడించారు. 28 చోట్ల మాత్రమే గెలిచినా కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 49 రోజుల్లోనే ప్రభుత్వం కూలిపోయింది. 2015, 2020 సంవత్సరాల్లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆప్‌నకు మళ్లీ పెద్ద ఎత్తున పట్టం కట్టారు. 2022లో పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆప్ చిత్తుగా ఓడించింది. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని కేజ్రీవాల్ ప్రకటించుకున్నారు. ఎమర్జెన్సీ సమయంలో జయప్రకాశ్ నారాయణ్ తరహాలో దేశంలో కేజ్రీవాల్ ప్రధాన ప్రత్యామ్నాయ రాజకీయ నేతగా, ఆశాకిరణంగా కనిపించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో పోటీ చేసి ఓట్ల శాతాన్ని పెంచుకున్న ఆప్ జాతీయ పార్టీ స్థాయికి ఎదిగింది. అయితే చూస్తుండగానే ఆప్ ప్రభను కోల్పోవడం ప్రారంభమైంది. 2020లో ఢిల్లీలో మూడోసారి అధికారంలోకి వచ్చాక ఆప్‌ను అవినీతి ఆరోపణలు వెంటాడాయి. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించి వచ్చిన పార్టీ చివరకు అవే ఆరోపణలకు చిక్కింది. ఢిల్లీ మద్యం కుంభకోణం, మనీలాండరింగ్ ఆరోపణలు, రూ.33 కోట్ల ప్రజాధనంతో రాజభవనం(శీశ్‌మహల్) లాంటి ఇల్లు కట్టుకోవడం విమర్శలకు తావిచ్చింది. మద్యం కుంభకోణంలో ఆప్ నేతలతో పాటు స్వయంగా కేజ్రీవాల్ కూడా తీహార్ జైలుకెళ్లి రావడంతో సామాన్యుల్లో నమ్మకం సన్నగిల్లింది. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేంద్రజైన్ లాంటి దిగ్గజ నేతలంతా ఓడిపోవడంతో ఆప్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

హస్తం హ్యాట్రిక్ 'సున్నా'

- మూడోసారీ ఢిల్లీలో ఖాతా తెరవని కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: గతమెంతో ఘనకీర్తి కలిగిన కాంగ్రెస్‌కు ఢిల్లీలో మరోసారి ఘోర పరాభవం ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారీ ఖాతా తెరవలేక 'సున్నా'ల హ్యాట్రిక్ నమోదు చేసింది. అంతేకాదు.. 2014 నుంచి మూడుసార్లు పార్లమెంటు ఎన్నికల్లోనూ సీట్లు గెలవలేక చతికిలబడింది. దీంతో.. ఒకప్పుడు వరుసగా మూడుసార్లు గెలిచి 15 ఏళ్లపాటు ఢిల్లీని ఏలిన హస్తం పార్టీ ఇంతటి దయనీయ స్థితికి దిగజారడం ఆ పార్టీ నేతలను ఆందోళనకు గురి చేస్తోంది. దేశ రాజధానిలో పార్టీ ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చింది. 1998లో తొలిసారి ఢిల్లీలో గెలుపొందిన కాంగ్రెస్.. ఆ తరువాత వరుసగా 2003, 2008 ఎన్నికల్లో నాటి సీఎం షీలా దీక్షిత్ సారథ్యంలో విజయం సాధించింది. అప్పట్లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉండడం కూడా ఢిల్లీలో కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. అయితే 2013లో ప్రభుత్వ వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయిన అవినీతిని ప్రశ్నిస్తూ అరవింద్ కేజ్రీవాల్ ఏర్పాటు చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ.. కాంగ్రెస్‌కు సవాలు విసిరింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఆప్ దెబ్బకు కాంగ్రెస్ 43 సీట్ల నుంచి 8 సీట్లకు పడిపోయింది. ఓటింగ్ శాతం కూడా 40.31 నుంచి 24.55 శాతానికి దిగజారింది. అనంతరం 2015 ఎన్నికల్లో ఈ పరిస్థితి మరింత దిగజారి ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. 2020 ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఆప్ వరుసగా మూడోసారి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకుంది. తాజా ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విషయంలో ఫలితం మాత్రం మారలేదు.

ఆప్‌ను ముంచిన కాంగ్రెస్!

- బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చిన హస్తం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉండి కూడా.. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేయడం వల్లే బీజేపీ గెలిచిందా? బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చడం ద్వారా ఆప్ అవకాశాలను కాంగ్రెస్ దెబ్బతీసిందా? అంటే.. ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి చూస్తే ఇది నిజమేనన్న అభిప్రాయాలు కలుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో 48 సీట్లతో విజేతగా నిలిచిన బీజేపీకి మొత్తం 45.56 శాతం ఓట్లు రాగా, 22 సీట్లతో సరిపెట్టుకున్న ఆమ్ ఆద్మీ పార్టీకి 43.57 శాతం ఓట్లు వచ్చాయి. ఈ రెండు పార్టీలకు మధ్య వ్యత్యాసం కేవలం 1.99 శాతం మాత్రమే. కాగా, ఒక్క సీటు కూడా గెలుచుకోలేక చతికిలబడ్డ కాంగ్రెస్‌కు 6.34 శాతం ఓట్లు దక్కాయి. అయితే ఆప్, కాంగ్రెస్‌కు కలిపితే 49.91 శాతం ఓట్లు లభించాయి. ఇవి బీజేపీ కన్నా 4.35 శాతం ఎక్కువ. అంతేకాదు.. బీజేపీ అభ్యర్థులు విజయం సాధించిన 14 నియోజకవర్గాల్లో వారికి దక్కిన మెజారిటీ కన్నా ఆయా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఈ స్థానాల్లో కాంగ్రెస్ ఓట్లను చీల్చకపోతే మళ్లీ ఆప్ అధికారంలోకి రాగలిగేదని గణాంక వివరాలు చెబుతున్నాయి. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా, సోమ్‌నాథ్ భారతి, సౌరవ్ భరద్వాజ్ తోపాటు పలువురు ఆప్ నేతలు కాంగ్రెస్ ఓట్లు చీల్చడం వల్లే పరాజయం పాలయ్యారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్‌కు వచ్చిన 4,568 ఓట్ల వల్లే కేజ్రీవాల్ ఓడిపోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి పర్వేశ్‌సింగ్ వర్మ 4,089 ఓట్ల మెజారిటీ మాత్రమే సాధించారు. కాగా, జంగ్‌పురాలో మనీశ్ సిసోడియా కేవలం 675 ఓట్లతో పరాజయం పాలయ్యారు. ఇక్కడ. కాంగ్రెస్ అభ్యర్థికి 7350 ఓట్లు లభించాయి. సంగం విహార్ నియోజకవర్గంలోనైతే బీజేపీ అభ్యర్థి చందన్‌కుమార్ చౌదరి కేవలం 344 ఓట్లతో ఆప్ అభ్యర్థిపై గెలుపొందగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 15,863 ఓట్లు వచ్చాయి.



ఓట్ల లెక్కింపు సమయంలోనే నిర్మానుష్యంగా ఢిల్లీలోని ఆప్ కార్యాలయం

ఇండియా కూటమిలో అనైక్యత వల్లే..

ఇండియా కూటమిలోని పార్టీల అనైక్యత ఢిల్లీలో బీజేపీ గెలుపునకు కారణమైందని వివిధ పార్టీల నేతలు అన్నారు. విడిపోతే పడిపోతామని తెలిసీ కాంగ్రెస్, ఆప్ పొరపాటు చేశాయని పేర్కొన్నారు. ఢిల్లీలో బలం ఉన్న ఆప్‌కు కాంగ్రెస్ సహకరించలేదని జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. 'ఇంకా మీలో మీరే కొట్టుకుంటూ ఉండండి' అంటూ రెండు పార్టీలకు చురకలంటించారు. కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేసి ఉంటే బీజేపీ గెలిచే అవకాశమే ఉండేది కాదని శివసేన నేత సంజయ్ రౌత్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీయే ఎక్కువ బాధ్యత తీసుకోవాల్సిందని సీపీఐ నేత డి.రాజా అభిప్రాయపడ్డారు. అయితే ఆప్ ఓటమికి తమ పార్టీ కారణం కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే అన్నారు. ఆప్‌ను గెలిపించడం తమ బాధ్యత కాదన్నారు. గతంలో కేజ్రీవాల్ కూడా గోవా, హరియాణా, గుజరాత్, ఉత్తరాఖండ్ ఎన్నికల్లో ఆప్‌ను పోటీలో నిలిపి ప్రచారం చేశారని, ఫలితంగా ఓట్లు చీలిపోయి.. గోవా, ఉత్తరాఖండ్‌లలో తాము అధికారం దక్కించుకునే అవకాశాన్ని కోల్పోయామని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు ఆప్‌ద!

క్యాడర్‌ను బీజేపీ లాగేసే ప్రమాదం

ఢిల్లీలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) భవిష్యత్ ఏమిటి? గోవా నుంచి ఢిల్లీ వరకు తమ పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటుందా? ఒకవేళ బీజేపీ 'ఆపరేషన్ కమల్'ను ప్రారంభిస్తే.. తుడిచిపెట్టుకుపోతుందా? ఇప్పుడు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముందు ఉన్న అతిపెద్ద సవాల్ ఇది.! ప్రస్తుతం 92 మంది ఎమ్మెల్యేలతో ఆప్ పంజాబ్‌లో అధికారంలో ఉంది. ఢిల్లీ తాజా ఎన్నికల్లో 22 స్థానాలను నిలబెట్టుకుంది. వీటితోపాటు.. గుజరాత్‌లో ఐదుగురు, గోవాలో ఇద్దరు, జమ్మూకశ్మీర్‌లో ఒకరు చొప్పున ఆప్ ఎమ్మెల్యేలున్నారు. లోక్‌సభలో ఆప్ బలం మూడు మాత్రమే..! మోదీ-షా ద్వయం ఒకవేళ 'ఆపరేషన్ కమల్'ను ప్రకటిస్తే.. వీరిలో ఎంతమంది ఆప్‌ను వీడుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న..! ఢిల్లీ ఎన్నికలకు ముందే.. ఎనిమిది మంది ఆప్ సిటింగ్ ఎమ్మెల్యేలు కేజ్రీవాల్‌పై విమర్శలు చేస్తూ.. బీజేపీ పంచన చేరారు. శుక్రవారం పార్టీ అభ్యర్థులతో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. "16 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు బీజేపీతో టచ్‌లో ఉన్నట్లు నాకు సమాచారం ఉంది. ఒక్కొక్కరికీ రూ.15 కోట్లు ఇచ్చి, బీజేపీలో చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు" అని వ్యాఖ్యానించారు. అదే జరిగితే.. ఢిల్లీలో ఆప్ పరిస్థితి ఏమిటనేదానికి ప్రస్తుతానికి సమాధానాల్లేవని విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ స్థాయిలో ఇప్పుడు బీజేపీ-కాంగ్రెస్ మాత్రమే తలపడుతున్నాయి. క్రమంగా అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు చెక్ పెట్టేలా బీజేపీ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో బీజేపీ ఇప్పటికే ఒడిసాలో బీజేడీ, మహారాష్ట్రలో ఎన్సీపీ-శివసేన కూటమి, అసోంలో ఏజీపీ వంటి పార్టీలకు చెక్‌పెట్టి.. కాంగ్రెస్ కంచుకోటలైన పలు రాష్ట్రాల్లో పాగా వేసింది. ఈ క్రమంలో గోవా, గుజరాత్, జమ్మూకశ్మీర్, ఢిల్లీల్లో ఆప్‌ను అడ్డు తొలగించే దిశలో మోదీ-షా ద్వయం వ్యూహరచన చేస్తే.. కేజ్రీవాల్ తిరిగి కోలుకోవడం కష్టమనే అభిప్రాయాలున్నాయి. - సెంట్రల్ డెస్క్



ప్రజలకు దూరమైన సామాన్యుడు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠం వరకూ ఎదిగిన అరవింద్ కేజ్రీవాల్ ఒక్కసారిగా నేలకూలారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో ఆయన రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. హరియాణాలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన ప్రస్థానం అసామాన్యంగా సాగింది. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడైన కేజ్రీవాల్.. 1992లో ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్(ఐఆర్ఎస్)లో చేరారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రాచుర్యంలోకి తేవడానికి చేసిన కృషికి గాను 2006లో రామన్ మెగసెసే అవార్డును అందుకున్నారు. ఆయన స్థాపించిన పరివర్తన్ సంస్థ ఢిల్లీలో నకిలీ రేషన్ కార్డుల స్కాంను వెలుగులోకి తెచ్చింది. 2013లో కేజ్రీవాల్ తొలిసారి ఢిల్లీ సీఎం అయ్యారు. అయితే అసెంబ్లీలో జన్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించడంలో ఆయన పార్టీ విఫలం కావడంతో 49 రోజుల తర్వాత తన ప్రభుత్వాన్ని రద్దుచేసి సీఎం పదవికి



రాజీనామా చేశారు. దీంతో అవినీతిపై పోరాటంలో భాగంగా అత్యున్నత పదవిని సైతం వదులుకోవడానికి సిద్ధపడిన సూత్రప్రాయమైన రాజకీయ నాయకుడిగా గుర్తింపు లభించింది. ఇది ఢిల్లీ అసెంబ్లీకి 2015, 2020లో జరిగిన ఎన్నికల్లో ఆప్ భారీ విజయాలు సాధించింది.

కామన్ మ్యాన్ ఇమేజ్‌కు దెబ్బ

ఢిల్లీ రాజకీయాల్లో కేజ్రీవాల్ ఎదుగుదల 'ఆమ్ ఆద్మీ'గా ఆయన ఇమేజ్‌తో ముడిపడి ఉంది. అవినీతి వ్యతిరేక కార్యకర్త నుంచి ఢిల్లీ సీఎంగా ఎదిగిన ఆయన ప్రయాణం నగటు పౌరుడితో తనకున్న అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. కేజ్రీవాల్ తరచుగా సాధారణ దుస్తుల్లో కనిపిస్తుంటారు. పెద్ద సైజు చొక్కా, మెడకు చుట్టుకున్న మఫ్లర్.. ఇవే ఒక ట్రేడ్‌మార్క్‌గా మారి 'మఫ్లర్ మ్యాన్' అని పేరు తెచ్చాయి. అయితే కొద్దికాలంగా ఆయన పఫర్ జాకెట్‌లో కనిపించడాన్ని బీజేపీ ఎన్నికల ప్రచారంలో అస్త్రంగా మార్చుకుంది. కేజ్రీవాల్ ధరించే ఒక్కో జాకెట్ ఖరీదు రూ.25వేలు అని ఆరోపించింది. దీన్ని కేజ్రీవాల్ ఖండించినా 'కామన్ మ్యాన్' ఇమేజ్‌ను దెబ్బతీసింది. అవినీతిని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ 2012లో ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించారు. అయితే జన్ లోక్‌పాల్ అని నినదించిన కేజ్రీవాల్ ప్రారంభించిన పార్టీ స్వయంగా అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది.

జ్యో ట్రైక్ హ్యాట్రిక్ కలలు కల్లలు



ఆమ్ ఆద్మీ అపజయానికి అనేక కారణాలు

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయం

అవినీతిపై యుద్ధం ప్రకటించి అదే అవినీతి ఆరోపణల్లో చిక్కి...మద్యం కుంభకోణంతో విలవిల..

ఢిల్లీ కాలుష్యం.. ట్రాఫిక్ కష్టాలు.. కేజ్రీ పాలనపై సామాన్యుడి కన్నెర్ర.. ఫలించని యమునా నది సెంటిమెంట్

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

సామాన్యుడి పేరుతో పార్టీ పెట్టారు. అవినీతిని ఊడ్చేస్తాం అంటూ 'చీపురు' గుర్తు ఎంచుకున్నారు. అన్నట్లుగానే... వరుసగా రెండుసార్లు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను 'స్వీప్' చేశారు. ఇప్పుడు... మాత్రం 'ఆప్'నే ఢిల్లీ ఓటర్లు గెలుపు బరి నుంచి ఊడ్చేశారు. ఢిల్లీలో ముచ్చటగా మూడోసారి కూడా అధికారం దక్కించుకుంటామని, ఎన్ని అవరోధాలు వచ్చినా గెలుపు గుర్రం తమదేనని లెక్కలు కట్టిన సామాన్యుడి పార్టీ.. ఆమ్ ఆద్మీ ఘోర పరాజయం చవిచూసింది. గత ప్రాభవాన్ని కుప్పకూల్చుకుంది. ఈ ఓటమికి కారణాలేంటి? ఎందుకిలా జరిగింది? పార్టీ అధినేత కేజ్రీవాల్ అంచనాలు ఎందుకు తప్పాయి? ఢిల్లీ ప్రజల ఆలోచనా విధానం ఏంటి?

అవినీతిపై పోరాడి...

ఆమ్ ఆద్మీ పార్టీ.. కేవలం రాజకీయాల కోసమే పుట్టిన పార్టీ కాదు. అవినీతికి వ్యతిరేకంగా సామాన్యుల పక్షాన నిలబడి న్యాయం చేసేందుకు జన్మించిన పార్టీ. కానీ, అలాంటి పార్టీ.. రాను రాను అదే అవినీతి ఆరోపణల పరిష్వంగంలో చిక్కి శల్యమవుతూ వచ్చింది. ఈసారి అభ్యర్థుల ఎంపికలో తెలిసి తెలిసి తప్పులు చేసింది. అవినీతి ఆరోపణలు, క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారికి భారీ సంఖ్యలో టికెట్లు ఇచ్చింది. దీనిని ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. మొత్తం 70 స్థానాల్లో 44 మంది ఆప్ అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారే కావడం గమనార్హం. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థి బీజేపీ శిబిరానికి ఈ పరిణామం వజ్రాయుధంగా మారింది.

'కిక్కు'లో చిత్తు...


ఎన్నికల సమయంలోనే ఆప్ ప్రభుత్వ అవినీతికి సంబంధించి కాగ్ సంచలన నివేదిక విడుదల చేసింది. మద్యం విధానం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలతో సహా వెల్లడించింది. ఇది కూడా బీజేపీ కలిసి వచ్చి.. ఆప్ అవినీతిపై మరింత ప్రచారం చేసింది. ప్రధాని మోదీ సహా అగ్రనేతలు కాగ్ నివేదికను తమ ప్రచారంలో భాగం చేసుకున్నారు.

పూర్వాంచల్ ఫట్!

ఆప్ విజయంలో పూర్వాంచల్ ఓటర్ల పాత్ర అత్యంత కీలకం. అయితే.. ఈ దఫా ఇక్కడి మధ్యతరగతిని బీజేపీ గణనీయంగా ఆకర్షించింది. 2015, 2020 ఎన్నికల్లో ఆప్‌కు బలమైన మద్దతుగా ఉన్న ఇక్కడి ఓటర్లు.. తాజా ఎన్నికల్లో బీజేపీకి మొగ్గు చూపారు. నగర ఓటర్లలో 30 శాతం పూర్వాంచల్‌లోనే ఉన్నారు. వీరిని ఆకట్టుకునేందుకు జేడీయూ, ఎల్‌జేపీలకు బీజేపీ టికెట్‌లు ఇచ్చింది. ఇది కమల నాథులకు కలిసి వచ్చింది. ఈ విషయాన్ని గ్రహించిన కేజ్రీవాల్ యమునా నదిలో విషం కలిపారంటూ.. ప్రచారం చేయడం ద్వారా.. పూర్వాంచల్‌లో పట్టు నిలుపుకొనే ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

మధ్యతరగతి మారింది ఇందుకేనా?

- కేజ్రీవాల్ పార్టీకి వెన్నెముకగా ఉన్న మధ్యతరగతి ప్రజలు దూరం కావడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు సహా ఢిల్లీలో ట్రాఫిక్ కష్టాలు వారిని వేధించాయి.
- ఢిల్లీ నగర పౌరులు వాయు కాలుష్యంలో చిక్కి ఊపిరాడక విలవిలలాడుతున్నా.. కేజ్రీ సర్కారు బలమైన చర్యలు తీసుకోలేకపోయింది. ట్రాఫిక్ నియంత్రణ, వాయు కాలుష్యం తగ్గించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది.
- మధ్యతరగతి ప్రజల కష్టాలు తీరుస్తామంటూ.. 2023లో మిడిల్ క్లాస్ మేనిఫెస్టోను తీసుకువచ్చినా.. దీనిని అమలు చేయడంలో ఆప్ విఫలమైంది.
- ఎక్సైజ్ పాలసీతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై 2024 మార్చిలో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. భారత్‌లో ఒక సిటింగ్ సీఎంను అరెస్టు చేయడం అదే మొదటిసారి. దాదాపు ఆరు నెలల నిర్బంధం అనంతరం 2024 సెప్టెంబరులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ వివాదం ఆయన చిత్తశుద్ధిపై ప్రజల్లో సందేహాలను లేవనెత్తింది.



ఆప్ ఓటమికి 5 కారణాలు

1 కేంద్రంపై నెపాలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనను ఏమీ చేయనీయడం లేదంటూ సుదీర్ఘకాలం పాటు ఆప్ అధినేత, అప్పటి సీఎం కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. ముఖ్యంగా లెఫ్టినెంట్ గవర్నర్, పోలీసులు తనకు సహకరించడం లేదన్నారు. రహదారులను బాగుచేయడం, నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ఢిల్లీ కార్పొరేషన్‌లో తనకు బలం లేనందున సాగడం లేదన్నారు. దీంతో 2022లో ప్రజలు కార్పొరేషన్ పగ్గాలను కూడా ఆప్‌కే అప్పగించారు. అయినా అభివృద్ధి సాగలేదు. చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణలోనూ వెనుకబడిపోయారు. ఒకరకంగా చెప్పాలంటే.. ఈ వాతావరణం సామాన్యులకు విసుగు తెప్పించింది. ఢిల్లీ పీఠంపై ఉన్న బీజేపీ దేశాన్ని ఏలుతోంది. అలాంటిది.. ఢిల్లీ రాష్ట్రాన్ని మాత్రం మరొకరికి అప్పగించడం ఎందుకనే ఆలోచన మొదలైంది. తాజా ఎన్నికల్లో ఆప్ ఓటమికి ఇదో ప్రధాన కారణంగా నిలిచింది.

2 కనిపించని అభివృద్ధి

అధికారంలోకి వస్తే.. ఎన్నెన్నో చేస్తామని హామీలు గుప్పించిన ఆప్.. తీరా పగ్గాలు చేపట్టాక.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోయింది. స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, ప్రజారోగ్యం, రవాణా సౌకర్యాలు వంటివాటిలో చాలా వెనుకబడింది. దీనికి తోడు యమునా నది కాలుష్యాన్ని కరిగిస్తామన్న హామీ మాటలకే పరిమితమైంది. అభివృద్ధి నత్తనడకన సాగింది. కొన్ని ప్రాంతాల్లో ఫుట్ పాత్‌లు నిర్మించినా.. ప్రయోజనం దక్కలేదు. మొహల్లా క్లినిక్‌లు మంచి పేరు తెచ్చినా.. తర్వాత నామ మాత్రంగా మారాయి. దీంతో ప్రజలు విసిగెత్తిపోయారు.

3 అవినీతి ఆరోపణలు

ఆప్ రెండో విడత పాలనలో అవినీతి ఆరోపణలు చుట్టుముట్టాయి. కీలక నేతలు కేసుల్లో చిక్కుకున్నారు. సాక్షాత్తూ కేజ్రీవాల్, సహా పలువురు జైలుకు వెళ్లడం.. ఉక్కిరిబిక్కిరికి గురిచేశాయి. ముఖ్యంగా మద్యం కుంభకోణం పార్టీకి ప్రాణసంకటంగా మారింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని ఆప్ నేతలు చెప్పినా.. ప్రజలు పట్టించుకోలేదు. దీనికి తోడు పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు.. ఆప్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో పాటు కేజ్రీవాల్‌పై తీవ్ర ఆరోపణలు సంధించారు. ఇది కూడా ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసింది.

హామీలు పేటెంట్ ఔట్! 4

ప్రజలకు ఉచితాలు ఇవ్వడంలో పేటెంట్ తమదేనని భావించిన ఆప్‌కు ఈ దఫా బీజేపీ భారీ దెబ్బ కొట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత హామీలు.. తమకు గెలుపును అందిస్తాయని ఆప్ నేతలు అంచనా వేసుకున్నారు. అయితే.. ఇదే బాటలో ఇంతకన్నా వేగంగా దూసుకువచ్చిన బీజేపీ ప్రజలపై వరాల జల్లు కురిపించి.. ఆప్ హామీలను ఓవర్ టేక్ చేసింది. ఆప్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని అమలు చేస్తామని చెప్పడంతోపాటు.. అనేక ఇతర హామీలను కూడా కురిపించింది.

5 కేంద్ర బడ్జెట్‌లో వరాలు..

ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ ఢిల్లీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపింది. రూ.12 లక్షల వరకు ఆదాయపన్ను పరిమితి మధ్యతరగతి జీవులను ఆకర్షించింది. 8వ వేతన సంఘం కూడా ఆకట్టుకుంది. అదే విధంగా కేజ్రీవాల్ 'మోనార్క్' తరహా రాజకీయాలు, నిర్ణయాలు ప్రజలకు నచ్చలేదు. విడతల వారీగా సుదీర్ఘకాలం కొనసాగిన రైతుల ఆందోళనతో ఢిల్లీ ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. ఈ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన 'ఆప్'పై కోపం పెంచుకున్నారు. వెరసి.. కర్ణుడి చావుకు.. అన్నట్టుగా ఆప్ ఓటమికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి.

మే12న ఈసెట్, జూన్ 6న లాసెట్

» ఉన్నత విద్యామండలి వెల్లడి

హైదరాబాద్, కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఉద్దేశించిన లాసెట్ షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. శనివారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ న్యాయ కాలేజీ ప్రిన్సిపాల్, లాసెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మూడు, ఐదేళ్ల వ్యవధిగల న్యాయవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను ఈనెల 25న విడుదల చేయనున్నారు. మార్చి1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 15 వరకు కొనసాగనుంది. మే 25 వరకు ఆలస్య రుసుంతో ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉంది. జూన్ 6న ప్రవేశ పరీక్ష ఉంటుందని లాసెట్ కన్వీనర్ ఆచార్య బి.విజయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా ఈసెట్ పరీక్ష దరఖాస్తులను మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు స్వీకరించనున్నారు. మే12న పరీక్ష ఉంటుందని ఈసెట్ కన్వీనర్ ఆచార్య పి.చంద్రశేఖర్ వెల్లడించారు.

భార్యను చంపింది గురుమూర్తి ఒక్కడే కాదు!

» హత్యలో అతడికి ముగ్గురి సహకారం?

» అంతా కుటుంబసభ్యులే.. వీరిలో ఇద్దరు మహిళలు

» రిమాండ్ రిపోర్టులో పేర్లు?

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట మర్డర్ కేసు మరో మలుపు తిరిగింది.. అచ్చంగా మలయాళం మూవీ సూక్ష్మదర్శిని సినిమాలో మాదిరిగానే!! ఈ సినిమా స్ఫూర్తితోనే భార్య వెంకటమాధవిని హత్యచేసి.. మృతదేహాన్ని గురుమూర్తి మాయం చేశాడని అనుకున్నాం! ఆమెను చంపింది మొదలు.. మృతదేహాన్ని ముక్కలుగా నరకడం.. ఆ ముక్కలను వేడినీళ్లలో ఉడికించడం.. ఎముకల్ని కాల్చి, దంచి పొడిచేయడం.. ఆ అవశేషాలను చెరువులో కలిపేయడం.. ఇదంతా ఒక్కడే చేశాడనే ఇప్పటిదాకా తెలుసు! అయితే ఈ మొత్తం ప్రక్రియలో ఆయనకు కుటుంబసభ్యుల్లో ముగ్గురు సహకరించినట్లు తెలుస్తోంది. పోలీసు వర్గాల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మీర్‌పేట మర్డర్ కేసుకు సంబంధించి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో గురుమూర్తిని ఏ-1గా పేర్కొన్న పోలీసులు, మరో ముగ్గురి పేర్లనూ చేర్చారు. ఆ ముగ్గురూ పరారీలో ఉన్నట్లుగా తెలిసింది. ముగ్గురిలో ఇద్దరు మహిళలున్నట్లు సమాచారం. అయితే హత్యలో గురుమూర్తికి కొందరు సహకరించారన్న విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. కాగా గురుమూర్తిని నాలుగు రోజుల విచారణ నిమిత్తం శనివారం మీర్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కాగా హత్య కేసుకు సంబంధించి మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో పోలీసలు అన్వేషిస్తున్నారు. గురుమూర్తి విచారణ పూర్తయ్యేలోపు మిగతా నిందితులనూ పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పల్లె పోరుకు సిద్ధం!

పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధం

» ఎన్నికలెప్పుడొచ్చినా సజావుగా నిర్వహించేలా కసరత్తు

» బ్యాలెట్ బాక్సులు, పత్రాలు సమకూర్చేపనిలో నిమగ్నం

» పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది ఎంపిక, శిక్షణపై దృష్టి

» జిల్లాలకు చేరిన ఎన్నికల గుర్తులు

» సర్పంచ్‌కు 30.. వార్డు సభ్యులకు 20

» రాష్ట్రంలో 12,848 పంచాయతీలు..



సంగారెడ్డి, హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పల్లె పోరుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు చేస్తోంది. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎన్నికల ప్రక్రియను సజావుగా చేపట్టడానికి సమాయత్తమవుతోంది. సిబ్బంది ఎంపిక, వారికి శిక్షణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల గుర్తులు తదితర అంశాలపై అధికారులు కొద్దిరోజులుగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులను కేటాయించారు. తెలంగాణలో గ్రామాల సంఖ్య పెరగడంతో బ్యాలెట్ బాక్సుల అవసరం మరింత ఏర్పడింది. అందుకే పక్క రాష్ట్రాల నుంచి బాక్సులు తెప్పిస్తున్నారు. అలాగే, గ్రామాలు, వార్డుల వారీగా కావాల్సిన బ్యాలెట్ పత్రాల అవసరాన్ని అంచనా వేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల ఎంపిక ఇప్పటికే పూర్తయ్యింది. ఇక, ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి ఉపాధ్యాయులతోపాటు ఇతర శాఖల ఉద్యోగులను గుర్తించారు. పలుచోట్ల సిబ్బందికి శిక్షణ కొనసాగుతోంది. ఇక, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు కేటాయించే గుర్తులు కూడా సిద్ధమైనట్లు సమాచారం.

పంచాయతీ గుర్తులివే..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గుర్తులపై తుది కసరత్తు పూర్తయ్యింది. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఆమోదించినట్లుగా తెలుస్తోంది. దాదాపు ఇవే గుర్తులు ఖరారయ్యే అవకాశం ఉంది.

సర్పంచ్ గుర్తులు:

ఉంగరం, కత్తెర, బ్యాటు, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్టు, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయలు, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, క్రికెట్ బ్యాటర్, పడవ, బిస్కెట్, పిల్లనగ్రోవి, చైను, చెప్పులు, బెలూన్, క్రికెట్ వికెట్లు

వార్డు సభ్యుల గుర్తులు

గౌను, గ్యాస్‌స్టవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టు డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీ స్టిక్ మరియు బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ స్తంభం, కెటిల్.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

రాష్ట్రంలోని పల్లెల్లో ప్రస్తుతం ఎన్నికల రిజర్వేషన్లే హాట్‌టాపిక్‌గా మారాయి. సామాజిక వర్గాల వారీగా ఆశావహులు పోటీకి సిద్ధమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలించకుంటే స్థానిక ఎన్నికల వైపు గురిపెడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సగం దాకా మహిళా రిజర్వేషన్లు ఉండడంపైనా తర్జనభర్జన పడుతున్నారు. అయితే, రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో సామాజికవర్గాల జనాభాశాతం, మహిళల సంఖ్యతోపాటు గతంలో వరుసగా మూడుసార్లు వచ్చిన రిజర్వేషన్లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లుగా తెలిసింది. గతసారి వచ్చిన రిజర్వేషన్ ఈసారి మారవచ్చని అంటున్నారు. తమ గ్రామానికి ఫలానా రిజర్వేషన్‌ను కేటాయించాలని అధికారులకు వినతిపత్రాలు కూడా అందజేస్తున్నారు. మొత్తంగా ఎన్నికల కోడ్ వెలువడకముందే రిజర్వేషన్ల అంశం పల్లెల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇక పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా 12,848 గ్రామ పంచాయతీలను గుర్తించింది. వీటన్నింటికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నివేదిక వివరాలను 'ఆంధ్రజ్యోతి' సంపాదించింది. దాని ప్రకారం మొత్తం 12,848 గ్రామ పంచాయతీల్లో 5,817 ఎంపీటీసీ స్థానాలుండగా, 570 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 868 గ్రామ పంచాయతీలు ఉండగా అక్కడ 352 ఎంపీటీసీ స్థానాలు, 33 జడ్పీటీసీ స్థానాలున్నాయి. ఇక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అత్యల్పంగా 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ జిల్లాలో 19 ఎంపీటీసీ, 3 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలకు జరగనున్నాయి.

ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం రాష్ట్రంలోని పంచాయతీల వివరాలు

జిల్లా	గ్రామపంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు
ఆదిలాబాద్	473	166	20
భద్రాద్రి కొత్తగూడెం	478	236	22
హన్మకొండ	210	129	12
జగిత్యాల	385	216	20
జనగాం	280	134	12
భూపాలపల్లి	248	109	12
జోగులాంబ గద్వాల	255	142	13
కామారెడ్డి	536	237	25
కరీంనగర్	318	170	15
ఖమ్మం	579	288	20
ఆసిఫాబాద్	335	127	15
మహబూబాబాద్	482	193	18
మహబూబ్‌నగర్	423	175	16
మంచిర్యాల	306	129	16
మెదక్	492	190	21
మేడ్చల్ మల్కాజిగిరి	34	19	3
ములుగు	174	87	10
నాగర్‌కర్నూల్	460	214	20
నల్లగొండ	868	352	33
నారాయణపేట	276	136	13
నిర్మల్	400	157	18
నిజామాబాద్	545	307	31
పెద్దపల్లి	266	140	13
రాజన్న సిరిసిల్ల	260	123	12
రంగారెడ్డి	531	232	21
సంగారెడ్డి	633	276	27
సిద్దిపేట	508	230	26
సూర్యాపేట	486	235	23
వికారాబాద్	594	227	20
వనపర్తి	268	133	15
వరంగల్	317	130	11
యాదాద్రి భువనగిరి	428	178	17


సంక్షోభాలకు ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

» సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని కబళిస్తోంది: హరగోపాల్

» తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో ప్రతాపరెడ్డి కృషి: కె. శ్రీనివాస్

» స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాప రెడ్డి రచనలు ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాదం 21వ శతాబ్దంలో ఎలాంటి రూపం తీసుకుందనడానికి ట్రంప్ గెలుపు, ఆయన తీరే నిదర్శనం అని ప్రముఖ సామాజికవేత్త ఆచార్య హరగోపాల్ పేర్కొన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని కబళిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నయా ఉదారవాదం మానవీయ విలువలు సహా అన్నీ రంగాలను సంక్షోభంలోకి నెట్టివేసిందని, ఈ దశలో కార్ల్‌మార్క్స్ రచనలు, విశ్లేషణల అవసరం మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. అన్ని సంక్షోభాలకూ కమ్యూనిజం ఒక్కటే ప్రత్యామ్నాయం, అంతిమ పరిష్కారం కూడా అని హరగోపాల్ నొక్కి చెప్పారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాప రెడ్డి రాసిన 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం', 'విప్లవాల విప్లవం' పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం నారాయణగూడలో జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ కార్మికులను పట్టించుకున్నంతగా కర్షకులను పట్టించుకోకపోవడం, సాంస్కృతిక విలువలు, మత విశ్వాసాలను విస్మరించడం.. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు బలహీన పడటానికి ప్రధాన కారణమని విశ్లేషించారు. సీనియర్ సంపాదకుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో ప్రతాపరెడ్డి అవిరళ కృషి చేశారంటూ అభినందించారు. కుల సమస్యను పట్టించుకోవడంలో కమ్యూనిస్టు పార్టీలు విఫలమయ్యాయని ప్రముఖ కవి నిఖిలేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో కవయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రతాపరెడ్డి 90వ జన్మదినం సందర్భంగా ఆయన్ను పలువురు ప్రముఖులు శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. వారిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు, సీపీఐ తెలంగాణ నాయకులు చాడా వెంకట రెడ్డి, పశ్య పద్మ, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎస్. వీరయ్య ప్రతాపరెడ్డి అల్లుడు తెలుగు వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, భారతి తదితరులున్నారు.



కందిమళ్ల ప్రతాప్ రెడ్డి రాసిన 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం', , 'విప్లవాల విప్లవం' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

పెరుగుతున్న టారిఫ్ సబ్సిడీ భారం

» 2025-26లో రూ.20,151 కోట్లు కోరనున్న డిస్కమ్‌లు

» గతేడాది రూ.16,825 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పూచీతో వివిధ వర్గాలకు ఉచితంగా, సబ్సిడీ రూపంలో సరఫరా చేస్తున్న విద్యుత్‌కుగాను ఏటా డిస్కమ్‌లకు చెల్లించాల్సిన టారిఫ్ సబ్సిడీల భారం గణనీయంగా పెరుగుతోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో టారిఫ్ సబ్సిడీ రూ.4,410.12 కోట్లు ఇవ్వగా... 2024-25నాటికి రూ.16,825 కోట్లకు చేరింది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.20,151 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం నుంచి కోరాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈ మేరకు లోటుతో వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) పిటిషన్‌ను దాఖలు చేశాయి. అయితే వచ్చే బడ్జెట్‌లో ఏమేరకు సబ్సిడీని కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక సబ్సిడీతోపాటు ఉచితంగా విద్యుత్‌ను వాడే వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో గృహ వినియోగదారులకు 200 యూనిట్లదాకా ఉచితంగా విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే.

బీఆర్‌ఎస్‌తో స్నేహమే కేజ్రీవాల్‌ను ముంచింది

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబంతో ఉన్న స్నేహమే ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను ముంచాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కేసీఆర్ కుమార్తె కవితపై వచ్చిన మద్యం కుంభకోణం ఆరోపణలు ఆప్ ఓటమికి కారణమని చెప్పారు. కాంగ్రెస్‌ను శత్రువుగా చూడడం కేజ్రీవాల్ పతనానికి నాంది పలికిందని తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఘోర పరాజయానికి కేజ్రీవాల్ స్వయం కృతాపరాధమే కారణమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీని కేజ్రీవాల్ శత్రువుగా పరిగణించడం, కాంగ్రెస్‌తో పొత్తు వద్దనుకోవడమే బీజేపీ నెత్తిన పాలు పోసిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ వద్దనుకోవడం అవగాహన రాహిత్యమా లేక ముందస్తు అవగాహనతోనా? అన్నది అర్థంకాని విషయమని వ్యాఖ్యానించారు. రాజకీయ ముఖచిత్రంలో బీజేపీకి చోటు లేదని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ గెలుపుతో కేటీఆర్ ఊహల్లో విహరిస్తున్నారని, కానీ తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిందన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు.

బీజేపీ ఎదగడానికి బీఆర్‌ఎస్సే కారణం

- మళ్లీ మేం దేశ వ్యాప్తంగా గెలుస్తాం: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ ఎదగడానికి కారణం బీఆర్‌ఎస్ పార్టీనేని.. ముమ్మాటికీ ఆ ఘనత ఆ పార్టీకే దక్కుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు అందించినందుకు అభినందనలు అంటూ బీఆర్‌ఎస్‌కు చురకలు అంటించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అక్కడ కాంగ్రెస్ ఓటమి పాలవ్వడంపై రాహుల్‌గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. ఈ సందర్భంగా.. "మేం కాంగ్రెస్ పార్టీ యోధులం. తెలంగాణలో ఓటమి తరువాత ఎలాగైతే తిరిగి పుంజుకుని విజయం సాధించామో.. అలాగే దేశ వ్యాప్తంగా గెలుస్తాం. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం కోసం మీ సొంత పార్టీకి సున్నా సీట్లు అందించిన గొప్ప నాయకత్వం మీది, మీ పార్టీది." అంటూ తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.

కేరళ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి.. శనివారం కేరళ రాష్ట్రానికి వెళ్లారు. అక్కడ ఆదివారం జరగనున్న 'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ ఇన్ కేరళ' అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. సోమవారం తన పరిధిలోని శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కేటీఆర్‌కు పిచ్చెక్కింది: రామచంద్రునాయక్

కేటీఆర్‌కు పిచ్చెక్కిందని, అది మూడో దశలో ఉందని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ధ్వజమెత్తారు. ఢిల్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేయలేదన్నారు. గత పదేళ్ల నుంచీ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆప్ గెలవకపోవడానికి కారణం కవితనేనని ఓ ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అనడానికి కులగణన సర్వే నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ తెలిపారు. కులగణన సర్వేను నిర్వహించడమే కాకుండా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బీసీల బాంధవుడయ్యారన్నారు.

ఆర్నెల్లలో 5.23 లక్షల విద్యుత్ అంతరాయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్నెల్ల కాలంలో విద్యుత్ సరఫరాలో 5,23,762 అంతరాయాలు ఏర్పడినట్లు డిస్కమ్‌లు వెల్లడించాయి. 2024-25లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30దాకా ఈ అంతరాయాలు చోటుచేసుకున్నట్లు గుర్తుచేశాయి. ఒక్క దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 3,84,848 విద్యుత్ అంతరాయాలు జరగ్గా... 43,53,990 మంది ప్రభావితం అయినట్లు డిస్కమ్ పేర్కొంది. ఆర్నెల్ల కాలంలో విద్యుత్ షాక్‌లతో 138 మంది మరణించగా... జంతువులు 277 చనిపోయాయని వెల్లడించింది. ఉత్తరడిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో విద్యుత్ అంతరాయాలపై 1,38,914 ఫిర్యాదులు వచ్చాయి. దీని పరిధిలో 165 మంది కరెంట్ షాక్‌తో చనిపోగా... 825 జంతువులు మృతువాత పడినట్లు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) తన జాబితాలో పేర్కొంది.

ఆరు నెలలుగా కరెంట్ బిల్లులు కడ్తలేరు!

- రూ.50 వేలకు మించిన వారి బకాయిలు రూ.30,777 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పలువురు వినియోగదారులు కరెంట్‌ను వాడుకుంటూ బిల్లులు మాత్రం చెల్లించకపోతుండడంతో బకాయిలు గుట్టల్లా పెరుగుతున్నాయి. డిస్కమ్‌లకు ఆరు నెలలుగా వివిధ కేటగిరిల వినియోగదారులు రూ.50వేలపైన చెల్లించాల్సిన బకాయిలు అక్షరాలా రూ.30,777.65 కోట్లకు చేరాయి. ఇందులో దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)కు రూ.17,405.04 కోట్లు, ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)కు రూ.13,372.61 కోట్ల బకాయిలు వినియోగదారుల నుంచి రావాల్సి ఉంది. రూ.50 వేల పైన కరెంట్ బిల్లులు కట్టాల్సిన సంబంధిత మొత్తం వివరాలను డిస్కమ్‌లు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఆర్‌సీ)కి అందించాయి.

రాష్ట్రంలోనూ బీజేపీ సర్కారు ఖాయం

3 ఎమ్మెల్సీ స్థానాలూ మావే.. మద్యం స్కాంపై ఢిల్లీ ప్రజల విస్పష్ట తీర్పు

- ఆప్ ఓటమిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఆప్‌ను చీపురుతో ఛీకొట్టారు..
- కాంగ్రెస్‌కు ఢిల్లీ ప్రజలు గాడిద గుడ్డు బహుమతిగా ఇచ్చారు : బండి సంజయ్
- ఆప్ అవినీతి పాలనకు చరమగీతం: ఎంపీ డీకే అరుణ
- తెలంగాణ రాజకీయాలపై ఢిల్లీ ఫలితాల ప్రభావం: ఎంపీ లక్ష్మణ్





హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆప్‌ను ఓడించడం ద్వారా మద్యం కుంభకోణంపై ఢిల్లీ ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి అన్నారు. పదేళ్ల కిందట అన్నాహజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో కేజ్రీవాల్ కలుపుమొక్కలా పనిచేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్ లిక్కర్ స్కాంలు, బీరు, బ్రాందీల్లో మునిగితేలారని విమర్శించారు. వాటర్ స్కాం, రాజ్‌మహల్‌లా సీఎం నివాసం నిర్మాణం, ఆప్ మంత్రుల అవినీతి, అక్రమాలు, అబద్ధపు ప్రచారాలతో పాటు అమలుకు నోచుకోని హామీలు కూడా ఆప్ ఓటమికి కారణాలని, ప్రధానమైనది లిక్కర్ స్కాం అని పేర్కొన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని, ఆమేరకు ఇక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటకలో ఒంటరిగానే పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలను తమ పార్టీనే గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ఆప్ ఓటమితో ఢిల్లీకి పట్టిన పీడ విరగడైందని, కేజ్రీవాల్ అనే గ్రహణం వీడిందన్నారు. వరుసగా మూడుసార్లు ఢిల్లీలో గుండుసున్నా వచ్చిన కాంగ్రెస్ దీనస్థితి చూస్తుంటే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. ఢిల్లీ ప్రజలు ఆ పార్టీకి హ్యాట్రిక్ ఓటమినిచ్చారని అన్నారు. రాహుల్‌పై కాంగ్రెస్ కార్యకర్తలకే నమ్మకం లేకుండాపోయిందని వ్యాఖ్యానించారు. రాహుల్ నాయకత్వం ఉన్నన్ని రోజులు కాంగ్రెస్‌కు భవిష్యత్తు ఉండబోదన్నారు. యమునా నదిలో బీజేపీ విషం కలిపిందంటూ కేజ్రీవాల్ తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోలేదని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లి సిగ్గులేకుండా అక్కడి నుంచే పరిపాలన చేసిన ఏకైక సీఎం కేజ్రీవాల్ అని మండిపడ్డారు. కేజ్రీవాల్, రాహుల్ ఒకే తాను ముక్కలని కిషన్ రెడ్డి విమర్శించారు. అబద్ధాల ప్రచారంలో, ప్రజలను రెచ్చగొట్టేందుకు వారు పోటీపడ్డారని, అధికారం కోసం ఎంతకైనా దిగజారతారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపించకపోతే ప్రజలదే తప్పు అన్నట్లుగా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ, హిమాచల్, కర్ణాటకల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో.. ఉద్యోగులు, పట్టభద్రులు, మేధావులు, నిరుద్యోగులు, విద్యార్థులు చైతన్యంగా ఆలోచించి.. బీజేపీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగంగా చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినందుకు కేటీఆర్‌కు శుభాకాంక్షలు అని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 'ఆప్' గతే పడుతుంది: లక్ష్మణ్

ఢిల్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణ రాజకీయాలపై ఉండబోతోందని బీజేపీ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీ ఫలితాలు రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదేని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆప్‌కు పట్టిన గతే తెలంగాణలో కాంగ్రెస్‌కు పట్టడంఖాయమన్నారు. బీజేపీని రాహుల్ గాంధీ గెలిపించారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై లక్ష్మణ్ స్పందించారు. బీజేపీని ఢిల్లీ ప్రజలు గెలిపించారా, రాహుల్ గాంధీయా అన్నది ముందు తెలుసుకోవాలని కేటీఆర్‌కు సూచించారు. మద్యం కుంభకోణంలో కూరుకుపోయిన సీఎం కేజ్రీవాల్, మంత్రులకు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారని లక్ష్మణ్ పేర్కొన్నారు.

రేవంత్ ప్రచారంతో కాంగ్రెస్ మటాష్: బండి సంజయ్

ఢిల్లీ ప్రజలు ఆప్‌ను చీపురుతో ఛీకొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హస్తాన్ని చిదిమేశారని, కమలాన్ని వికసింపజేశారని వ్యాఖ్యానించారు. అక్రమాలతో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ లాంటి నాయకుడు తమకొద్దని, మోదీ నాయకత్వంలో నీతిమంతమైన పాలన కావాలని ఢిల్లీ ప్రజలు ఆకాంక్షించారని బండి పేర్కొన్నారు. అందుకే ఆప్‌ను చీపురుతో ఊడ్చిపారేసి, 'వార్ వన్‌సైడ్' అన్నట్లు బీజేపీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ ప్రజలు బహుమతిగా ఇచ్చి గుణపాఠం చెప్పారన్నారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డిది కూడా ఐరన్‌లెగ్ అని.. ఆయన ఎక్కడ, ఏ పార్టీ తరఫున ప్రచారం చేసినా ఆ పార్టీ మటాషేనన్నారు. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో రేవంత్ ప్రచారం చేస్తే అక్కడ కాంగ్రెస్ మటాష్ అయిందన్నారు. తెలంగాణ సహా మిగతా రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీయే అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్ర సృష్టించిందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. పదేళ్ల అవినీతి పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడారన్నారు. తాను ప్రచారం చేసిన జనక్‌పురి, వికాస్‌పురి, రాజోరి గార్డెన్‌లో పార్టీ అభ్యర్థుల విజయంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పని అయిపోయినట్లేనని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ మోసాలు, అవినీతే ఆప్‌ను ఈ దుస్థితికి తెచ్చాయన్నారు.

కార్పొరేషన్ల రుణాలను పునర్వ్యవస్థీకరించండి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ) కింద తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించాలని(రీస్ట్రక్చరింగ్) డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఢిల్లీలో ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం 2014 నుంచి 2023 వరకు సాగు, తాగు నీటి కోసం కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఎస్పీవీల కింద రుణాలు తీసుకుందని తెలిపారు. ఇలాంటివాటికి అసలు, వడ్డీని ప్రభుత్వ బడ్జెట్ నుంచి చెల్లిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌ల నుంచి 10.75శాతం, 11.25శాతం వడ్డీ రేట్లతో రూ.31,795 కోట్ల రుణం తీసుకున్నారని, ఇతర కార్పొరేషన్ల కోసం అధిక వడ్డీలతో రుణాలుతెచ్చారని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ అప్పులు పెద్ద గుదిబండగా పరిణమించాయన్నారు. ఈ దృష్ట్యా వడ్డీ రేట్లను తగ్గించడం, దీర్ఘకాలిక రుణాలుగా మార్చడంవంటి రీస్ట్రక్చరింగ్ చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించి రుణ వితరణ సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.


● ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 94(2)ప్రకారం రాష్ట్రంలోని 9 వెనుకబడిన ఉమ్మడి జిల్లాలకు ఏటా రూ.450 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాల్సి ఉందని భట్టి తెలిపారు. 2019-20, 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి మొత్తం రూ.1,800 కోట్లు విడుదల చేయాలని కోరారు.

● ఏపీబీఏసీడబ్ల్యూడబ్ల్యూబీ నుంచి రూ.455.76 కోట్లు, ఏపీ సంక్షేమ నిధి నుంచి రూ.9.15 కోట్లు రావాల్సి ఉందని, వీటిని ఇప్పించాలని కోరారు.

● రాష్ట్ర విభజన సందర్భంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అదనంగా రూ.1,052.70 కోట్ల అప్పును కేటాయించిందని, అదనపు కేటాయింపుల కారణంగా తెలంగాణ అసలు కింద రూ.481.82 కోట్లు, వడ్డీ కింద రూ.788.18 కోట్లు (మొత్తం రూ.1,270 కోట్లు) చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఈ సొమ్మును ఏపీ నుంచి తెలంగాణకు రీ-యింబర్స్ చేయించాలని, అలాగే తెలంగాణ విద్యుత్తు సంస్థలకు ఏపీ నుంచి రావాల్సిన రూ.24,132 కోట్ల బకాయిలను ఇప్పించాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బలరాం నాయక్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

మభ్యపెట్టే నేతలకు జనం వాతలు!

- నాడు ఏపీ, నేడు ఢిల్లీ ఫలితాలే నిదర్శనం
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు



అమరావతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులైన నాయకులు ఎల్లకాలం ప్రజలను మభ్యపెట్టలేరని... మొన్న ఆంధ్రప్రదేశ్, నేడు ఢిల్లీ ఓటర్లు ఈ విషయాన్ని రుజువు చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీ, ఢిల్లీ మధ్య చాలా సారూప్యతలు ఉన్నాయన్నారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఏపీలో సంక్షేమం ఇస్తున్నామంటూ బటన్ నొక్కడం ద్వారా ప్రజలను మోసం చేశారు. ఇది సరైనది కాదని ప్రశ్నిస్తే సామాజిక మాధ్యమాల ద్వారా దుమ్మెత్తి పోయడం, వ్యక్తిగత దూషణలు చేయడం, అరెస్టులు చేయడం, గర్వంతో నోటికొచ్చినట్లు మాట్లాడటం చేశారు. ఇలాంటి రాజకీయ కాలుష్యాన్ని ప్రజలు ఎక్కువ కాలం భరించలేక ఓటుతో బుద్ధి చెప్పారు. ఢిల్లీలోనూ అద్భుతమైన విద్యా వ్యవస్థను తీసుకొచ్చామని చెబుతూ ఉన్నత విద్యను నాశనం చేశారు. అందుబాటులో ఆసుపత్రుల పేరుతో ఇంటికే మందులు పంపిస్తున్నామన్నారు. కానీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఊసే మరిచిపోయారు. ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలను కల్పించలేకపోయారు. ఢిల్లీని చెత్తనగరంగా మార్చేశారు. వాయు కాలుష్యానికి చిరునామాగా చేశారు. అందుకే ఢిల్లీ మోడల్ పూర్తిగా విఫల నమూనా అని చెబుతా. పంజాబ్‌లోనూ ఢిల్లీ లాంటి పరిస్థితే ఏర్పడింది. ఒకప్పుడు దేశానికి కావాల్సిన సైన్యాన్ని, ఆహారాన్ని సమకూర్చే పంజాబ్ ఇప్పుడు డ్రగ్స్ కేంద్రంగా మారిపోయింది. పంజాబ్ నుంచి ప్రతి రోజూ ఓ రైలు నిండా ప్రజలు క్యాన్సర్ ట్రీట్‌మెంట్ కోసం ఢిల్లీకి వచ్చే పరిస్థితిని అక్కడి పాలకులు తీసుకొచ్చారు. ఢిల్లీ, పంజాబ్‌ల్లో విధ్వంసానికి సమయం పడితే, ఏపీలో ఐదేళ్లలోనే విధ్వంసాన్ని సృష్టించారు. ఏపీలో నాయకులు గర్వంతో నోటికి వచ్చింది మాట్లాడేవారు. ఢిల్లీలో సైతం మోదీ మరో జన్మ ఎత్తినా ఓడించలేరని మాట్లాడారు. అలాంటి వారి పరిస్థితి ఇప్పుడు ఏమైందో చూస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

సీఎం రేవంత్ ఐరన్‌లెగ్

ఢిల్లీలో ప్రచారం చేసి కాంగ్రెస్‌కు గుండుసున్నా తెచ్చిండు

- బీజేపీకి అతిపెద్ద కార్యకర్త రాహుల్ గాంధీనే.. ఆ పార్టీని గెలిపిస్తుండు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిది ఐరెన్ లెగ్ అని, ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా తెచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పతనాన్ని మహారాష్ట్రలో ప్రారంభించిన రేవంత్ రెడ్డి.. ఢిల్లీలో ముగించారని, రాబోయే రోజుల్లోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందని విమర్శించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ శనివారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీ ఫలితాలపై మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. నరేంద్రమోదీకి, బీజేపీకి అతిపెద్ద కార్యకర్తగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా రాహుల్ బీజేపీని గెలిపించి వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని కేటీఆర్ అన్నారు. ప్రజలు తిట్టే తిట్లకు రేవంత్ కాకుండా వేరొకరైతే ఆత్మహత్య చేసుకునేవారని అన్నారు. ప్రజాశీర్వాదంతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.

కాంగ్రెస్ దగా ప్రజలకు అర్థమైంది

కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రామ్‌రామ్... అని నాడు కేసీఆర్ చేసిన హెచ్చరిక నిజమైందని కేటీఆర్ అన్నారు. ఏడాది తిరిగే సరికే కాంగ్రెస్ దగా నైజం ప్రజలకు అర్థమైందని చెప్పారు. వికారాబాద్‌లో పట్నం మహేందర్ రెడ్డి వెన్నుపోటు కారణంగానే మెతుకు ఆనంద్ ఓడిపోయాడని అన్నారు. ప్రజాపాలన అని చెప్పే రేవంత్.. సభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకే మైక్ ఇచ్చేందుకు వణికిపోతున్నారని కేటీఆర్ అన్నారు. ఇక, శతశాతం రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని గతంలో తాను చెప్పిన మాటకి ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 25 శాతం రుణమాఫీ కూడా జరగలేదని, రుణ మాఫీకి రూ.49,500 కోట్లు కావాలని బ్యాంకర్ల సమావేశంలో చెప్పిన సీఎం... విలేకరుల సమావేశం లో రూ.40 వేల కోట్లు అన్నారని, మంత్రివర్గ సమావేశంలో రూ.31వేల కోట్లు అన్నారని గుర్తు చేశారు. అలాగే, అసెంబ్లీ బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు అన్నారని, మహబూబ్‌నగర్ సభలో రుణమాఫీ మొత్తం చేశానని రూ.18 వేల కోట్లు ఇచ్చారని చెప్పారన్నారు. కానీ, ఇప్పటిదాకా రూ.11 వేల కోట్లు కూడా ఖాతాలలో పడలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని కేటీఆర్ తెలిపారు.

ఫుట్‌వేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 12 ఎఫ్‌డీడీఐ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం https://fddiindia.com వెబ్‌సైట్ సందర్శించాలని అధికారులు సూచించారు. కాగా, సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్- 2025 రిజిస్ట్రేషన్ గడువును 2025 ఫిబ్రవరి 18 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది.

డంపింగ్ కాంట్రాక్టర్ల అవకతవకలు

- రోజూ ప్రభుత్వానికి రూ.2.30 కోట్ల నష్టం
- లారీ యజమానుల సంఘం ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): డంపింగ్ టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇసుక అదనపు లోడింగ్ చేస్తూ అవకతవకలకు పాల్పడుతూ ప్రతి రోజూ ప్రభుత్వానికి రూ.2.30 కోట్ల మేర నష్టం కలిగిస్తున్నారని తెలంగాణ లారీ యజమానుల సంఘం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్యకార్యదర్శికి శనివారం లేఖ రాసింది. 14 చక్రాల లారీ 32 టన్నులు, 16 చక్రాల లారీ 35 టన్నుల ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని, క్వారీల వద్దకు వెళుతున్నాయని తెలిపింది. కానీ అక్కడికి వెళ్లిన తర్వాత డంపింగ్ కాంట్రాక్టర్లు లోడింగ్‌కు ఒక్కో లారీ వద్ద రూ.2,500 మేర వసూలు చేస్తున్నారని ఆరోపించింది. ఒక్కో లారీ వద్ద నుంచి అదనంగా రూ.12 వేల చొప్పున బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ అదనంగా 28-30 టన్నుల ఇసుకను లోడ్ చేస్తున్నారని తెలిపింది. ఇలా ప్రతి రోజూ ప్రభుత్వ ఖజానాకు రూ.2.30 కోట్ల మేర తూట్లు పొడుస్తున్నారని తెలిపింది. ఈ దృష్ట్యా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆ సంఘం కోరింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.